www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంగళవారం | 5-2-2019 | పేజీలు: 14 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 15 సంచిక (Issue) : 208 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 5.15 తదుపరి విదియ; నక్షత్రం: ధనిష్ఠ పూర్తి; వర్జ్యం: ఉ. 10.33-12.21; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.52; అమృతఘడియలు: రా. 9.23-11.12; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.08 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


బెంగాల్ దంగల్

కోల్‌కతా నగరం నడిబొడ్డున... బెంగాల్ ముఖ్యమంత్రి ధర్నా!
యుద్ధం ముదురుతోంది!

రాష్ట్రపతి పాలన విధించైనా దారిలోకి తెచ్చుకోవాలని మోదీ!
వ్యూహం కుదురుతోంది!

చావుకైనా సిద్ధం... కేంద్రంపై యుద్ధంలో రాజీ లేదంటూ దీదీ!
స్వరం పెరుగుతోంది!

బీజేపీ ఒక్కటీ ఒక వైపు!
ప్రతిపక్షాలన్నీ మరో వైపు!
ఇది ఎక్కడిదాకా వెళ్తుంది?
ఏం జరుగుతుంది?
సుప్రీంకోర్టు ఏమంటుంది?





ఢిల్లీలో పవార్ ఇంట్లో సమావేశం తర్వాత మీడియాతో చంద్రబాబు, ఫారూక్ అబ్దుల్లా, కేజ్రీవాల్ తదితరులు

రగులుతున్న రాజకీయం
సుప్రీం మాటే కీలకం
రెండో రోజూ సాగిన మమతా బెనర్జీ దీక్ష

సాక్ష్యాల ధ్వంసంపై ఆధారాలివ్వండి

సొలిసిటర్ జనరలైనా, ఇంకెవరైనా ఇవ్వొచ్చు
సాక్ష్యాల ధ్వంసానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలే
కోల్‌కతా సీపీ తర్వాత చింతించాల్సి వస్తుంది
సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు
రెండు పిటిషన్లు వేసిన సీబీఐ.. నేడు విచారణ
సీఎంతో కలిసి ధర్నాలో సీఎస్, డీజీపీ, సీపీ
వారు ఉమ్మడిగా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారు
బెంగాల్లో అరాచకానికి ఇదే నిదర్శనం: సీబీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: "రోజ్‌వ్యాలీ, శారదా పోంజీ స్కాం కేసుల్లో సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడానికి పశ్చిమ బెంగాల్ అధికార యంత్రాంగం కానీ, పోలీసు అధికారులు కానీ ప్రయత్నించినా.. ప్రణాళికలు వేసినా.. అందుకు సంబంధించిన సాక్ష్యాలు. వివరాలను కోర్టుకు సమర్పించవచ్చు. అది సొలిసిటర్ జనరల్ కావచ్చు.. ఇతరులైనా కావచ్చు. మంగళవారం విచారణ ప్రారంభమయ్యేలోపు వాటిని అందించవచ్చు" అని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసుల్లో సాక్ష్యాధారాలను

మిగతా 12వ పేజీలో...



12

ఇది రాజ్యాంగ సంక్షోభమే

చర్య తీసుకునే అధికారం కేంద్రానికి ఉంది
ఆదివారంనాటి పరిణామాలు అసాధారణం
దేశ సమాఖ్య రాజకీయ వ్యవస్థకే ముప్పు
లోక్‌సభలో హోంమంత్రి రాజ్‌నాథ్ ప్రకటన
పరిస్థితిపై కేంద్రానికి గవర్నర్ నివేదిక



దీక్షా వేదికపై సీఎం మమతకు కుర్చీ చూపిస్తున్న సీపీ రాజీవ్ కుమార్

బీజేపీది నీచ రాజకీయం

రాష్ట్రపతిపాలన విధింపునకు కుట్ర

చచ్చినా సరే రాజీపడేది లేదు.. కేంద్ర పథకాల నిధులు తీసుకోం 12
మమత 'తిరుగుబాటు'.. శుక్రవారం దాకా దీక్ష కొనసాగింపు

ప్రజాస్వామ్యంపై దాడి

మమత ఏకాకి కాదు.. మేమంతా ఉన్నాం: విపక్షాలు
పవార్ ఇంట్లో ముఖ్యుల సమావేశం.. సంఘీభావం
మాలో కొందరం కోల్‌కతాకు వెళతాం: చంద్రబాబు
కోల్‌కతా సీపీని సీబీఐ అవమానించింది: కాంగ్రెస్
మమతకు అఖిలేశ్, స్టాలిన్, కుమార, దేవెగౌడ మద్దతు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ సర్కారు కక్ష సాధింపు విధానాలపై యుద్ధం ప్రకటించిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల నుంచి మద్దతు పెరుగుతోంది. కోల్‌కతా పోలీసు కమిషనర్ ఇంటిపై సీబీఐ

మిగతా 12వ పేజీలో...

ఐపీఎస్‌లపై 'నియంత్రణ'?

వారి సస్పెన్షన్ అధికారం కేంద్రానిదే
ముందస్తు అనుమతి ఉంటే తప్ప
రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేవు!
1969 నాటి రూల్స్ సవరించే చాన్స్
దెబ్బకు దెబ్బతీయనున్న ప్రధాని మోదీ



12



కుటుంబాన్నే చూడనివారు.. దేశాన్నేం కాపాడతారు?

గడ్కరీ నర్మగర్భ వ్యాఖ్యలు
బీజేపీలో దమ్మున్న నేత నితిన్ ఒక్కరే: రాహుల్ 14

ఫిబ్రవరి 1నాటికి ఐదెకరాల్లోపు ఉంటేనే!

'పీఎం-కిసాన్'కు అర్హతపై కేంద్రం సర్కారు పరిమితి
మరో 5 సంవత్సరాల వరకు కొత్తవారికి అవకాశం లేదు
వారసత్వ బదిలీకి మాత్రం వెసులుబాటు 11
ఈసారికి ఆధార్ ఐచ్ఛికం



యాదాద్రి చూసి తరించాలి

ఒక్కసారైనా దర్శించాలని ప్రతి ఒక్కరూ అనుకోవాలి!
ఆలయ వైభవం తెలిసేలా అద్భుత నిర్మాణాలుండాలి
4.5 ఎకరాల్లో గుడి ప్రాంగణం
పునరుద్ధరణ తర్వాత 11 రోజులు యాగం: కేసీఆర్

హైదరాబాద్/యాదాద్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అద్భుత శిల్ప కళా నైపుణ్యంతో ఆలయ ప్రాశస్త్యం, వైభవం ప్రస్ఫుటమయ్యేలా యాదాద్రి పునరుద్ధరణ పనులు జరగాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు సూచించారు. యాదాద్రిలో చేపట్టిన నిర్మాణ పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఈ సారి బడ్జెట్లో కూడా అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని చెప్పారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత సహస్రాష్టక కుండ యాగం (1008 యజ్ఞ కుండాలతో) 11 రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి,

మిగతా 2వ పేజీలో...

ఏకకాలంలో ఎన్ని పనులు చేయాలి?

ఈ ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నాం..
ఆరోగ్య కార్యకర్తల ఆందోళన బాట 3
అధికారులకు వినతి పత్రాలు

పదోన్నతుల ఆశ

ఏకీకృతం వద్దన్న తీర్పుపై సుప్రీం స్టే



ఉద్యోగ సంఘాలకు నోటీసులు
మార్చి 25కు కేసు విచారణ వాయిదా
టీచర్ల పదోన్నతులకు అవకాశం
ప్రభుత్వ నిర్ణయమే తరువాయి
15 వేల మందికి లబ్ధి అవకాశం
పదోన్నతులకు టీచర్ల డిమాండ్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ చెల్లవంటూ గత ఏడాది హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.భానుమతి, ఆర్.సుభాష్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పుపై స్టే విధించడమే కాకుండా ప్రతివాదులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. 371(డి) అధికరణను సవరించి పంచాయతీరాజ్, ప్రభుత్వ టీచర్లకు ఒకే సర్వీసు రూల్స్ వర్తింపజేస్తూ గతేడాది జూన్‌లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉపాధ్యాయ పోస్టుల బదిలీలు, పదోన్నతుల్లో ఏకీకృత నిబంధన వర్తింపజేయడం, ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్- 1975లో చేర్చిన పేరా 2ఏ చట్టవిరుద్ధమంటూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. ఏకీకృత నిబంధనలను జారీచేసే పరిధి రాష్ట్రపతికి లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. 371-డీలో ఏకీకృత సర్వీసు నిబంధనల ప్రస్తావనే లేనప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వులో వాటిని చేర్చుతూ మార్పులు ఎలా చేసిందని హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి

మిగతా 2వ పేజీలో...

వలపు వల వేసి పిలిచి..

కొట్టి చంపాడు!

జయరామ్‌ను హత్య చేసిన రాకేశ్ రెడ్డి

జూబ్లీహిల్స్‌లోని తన ఇంట్లోనే పథకం
రాకేశ్ వద్ద 4.5 కోట్లు తీసుకున్న జయరామ్
శిఖా విలాసాలకు కోటి ఖర్చు చేశానన్న రాకేశ్
మొత్తం కలిపి రూ.5.5 కోట్లు ఇవ్వాలని ఒత్తిడి
కొన్నాళ్లు వడ్డీ ఇచ్చి, తర్వాత ఫోనెత్తని జయరామ్
జయరామ్ 'బలహీనత'తో రాకేశ్ ఆట
వాట్సా‌ప్‌లో వలపు వల విసిరి ఇంటికి పిలుపు
అక్కడే బంధించి.. కొట్టి.. చిత్రహింసలు.. హత్య



నిందితుడు రాకేశ్‌రెడ్డి

విజయవాడ/బంజారాహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నారై, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరామ్‌ను రాకేశ్ రెడ్డి కొట్టి చంపేశాడు. అది కూడా వాట్సాప్‌తో 'వలపు వల' విసిరి.. తన ఇంటికి రప్పించుకున్నాడు. అక్కడ బంధించాడు. చిత్రహింసలకు గురి చేసి మరీ హత్య చేశాడు. ఇందుకు ఒక కారణం శిఖా చౌదరితో సాన్నిహిత్యం అయితే.. మరొకటి తాను ఇచ్చిన నాలుగున్నర

మిగతా 11వ పేజీలో...

ఖాకీల క్రిమినల్ ఐడియా!

జయరామ్‌తో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ దోస్తానా!
హత్య తర్వాత వారికి రాకేశ్ రెడ్డి ఫోన్ 11
సహకరించాలని వినతి
పక్క రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంగా చూపాలని సలహా ఇచ్చిన పోలీసులు
సీఐ బదిలీ.. ఏసీపీపై విచారణకు ఆదేశం



విజయ్ మాల్యా అప్పగింత!

ఫైలుపై బ్రిటన్ మంత్రి జావిద్ సంతకం
కోర్టు తీర్పు మేరకు హోంశాఖ లైన్‌క్లియర్
2 వారాల్లో అప్పీలు చేసుకొనేందుకు అవకాశం
హైకోర్టులోనూ ఓడిపోతే సుప్రీంకు వెళ్లే చాన్స్

లండన్, ఫిబ్రవరి 4: తొమ్మిది వేల కోట్ల రూపాయల మేర బ్యాంకులను మోసం చేసి పారిపోయి లండన్‌లో తలదాచుకుంటున్న భారత ఆర్థిక నేరగాడు, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేత విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించడానికి బ్రిటన్ అంగీకారం తెలిపింది. ఆయన అప్పగింతకు సంబంధించిన ఫైలుపై బ్రిటన్ హోంమంత్రి సాజిద్ జావిద్ సోమవారం సంతకం

మిగతా 14వ పేజీలో...



పరంజ్యోతి Paramjyothi



ఎలా ప్రార్థించినా.. పరమాత్మ అనుగ్రహం

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినో అర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ

..అంటూ తన భక్తులను నాలుగు విధాలుగా పేర్కొన్నాడు గీతాచార్యుడు. ఆ నాలుగు రకాల భక్తులూ ఎవరంటే.. ఆర్త భక్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానభక్తులు. వీరిలో ఆర్తులంటే.. తమకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు దేవుడిని ప్రార్థించేవారు. మొసలి నోటికి చిక్కి ప్రాణాలు పోతున్న దశలో.. 'రావే ఈశ్వర, కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా' అని ప్రార్థించిన గజేంద్రుడు.. నిండుసభలో వస్త్రాపహరణం జరుగుతున్నప్పుడు శ్రీకృష్ణ పరమాత్మను ప్రార్థించిన ద్రౌపది వంటివారు ఈ కోవలోకి వస్తారు. ఇక.. భగవంతుడి తత్వాన్ని తెలుసుకోవాలనుకునేవారు జిజ్ఞాసు భక్తులు. పరీక్షిత్తు, ఉద్ధవుడు వంటివారు ఈ కోవలోకి వస్తారు. అర్థార్థులు.. అంటే సంపదను, ఇహపర సుఖాలను కాంక్షించి పరమాత్మను ప్రార్థించేవారు. సుగ్రీవుడు రాముణ్ని.. ధ్రువుడు విష్ణుమూర్తిని ప్రార్థించి రాజ్యపదవి పొందారు. ఇలాంటివారు అర్థార్థి భక్తులు. వర్తమానంలో చాలామంది దేవుడిని ఏవో ఒక సంపదలు ఆశించి ప్రార్థిస్తున్న అర్థార్థి భక్తులేనంటే అతిశయోక్తి కాదు. ఇక.. భగవంతుని తత్వాన్ని పూర్తిగా గ్రహించి.. ఏ కోరికలూ లేకుండా భగవంతుడిని ఆరాధించేవారే జ్ఞానభక్తులు. ప్రహ్లాదుడు, ఆంజనేయుడు, భీష్ముడు, నారదుడు.. తదితరులు జ్ఞానభక్తులు. పరమాత్మ తన భక్తుల్లో జ్ఞానియైనవాడిని మెచ్చుకుంటానంటూనే.. నాలుగు విధాల భక్తులూ తన వరాలను అందుకోవడానికి అర్హులేనన్నాడు. అందుకే.. 'లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, ప్రాణంబులున్ ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె' అని ఆర్తిగా ప్రార్థించిన గజేంద్రుడిని రక్షించడానికి భార్యకు సైతం చెప్పకుండా, ఆయుధాలనూ ధరించకుండా అలవైకుంఠపురంబు నుంచి ఉన్నపళంగా లేచివచ్చేశాడు. కురుసభలో ద్రౌపదీ మాన సంరక్షణం చేశాడు. 'ఎవడబ్బ సొమ్మని కులుకుచూ తిరిగేవు' అన్నప్పటికీ.. రామదాసు భక్తికి మెచ్చి ఆయన్ను చెర నుండి విడిపించాడు.

అనన్యాశ్చింతయన్తో మాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం

ఇతర భావాలు ఏమీ లేకుండా ఎవరైతే నన్నే పూజిస్తూ, ఆరాధిస్తూ, నా గురించే ఆలోచిస్తూ, ఎల్లప్పుడూ నన్నే ధ్యానిస్తారో.. నాపై మనస్సు లగ్నం చేసి నన్ను కొలుస్తారో అట్టి భక్తులను నేను ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటాను అని కృష్ణావతారంలో..

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ

..నేను నీవాడనంటూ ఎవరైనా భక్తితో నన్ను శరణు కోరితే వారిని రక్షించడం నా వ్రతం అని రామావతారంలో ఆ పరమాత్మ స్పష్టం చేశాడు. మన ధ్యాస భగవంతుడిపై ఉండాలేగానీ ఆయన మనకు ఏ లోటూ చెయ్యడు. ఏ అవతారంలోనైనా ఆ భగవంతుడు ఇచ్చిన దివ్య సందేశం ఇదే.

-నిట్టల గోపాలకృష్ణ, 9493053206

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	12.5	31.3
ఖమ్మం	17.0	32.0
నిజామాబాద్	17.4	31.5
హైదరాబాద్	18.1	29.9
నల్లగొండ	18.4	31.0

ఏపీలో ప్రేమ జంటపై యువకుల దాడి

యువతిపై గ్యాంగ్‌రేప్

▸ **వివస్త్రను చేసి రైలు పట్టాలపై నడక.. రాత్రంతా చిత్రవధ**

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4: ఓ ప్రేమ జంటపై దాడికి పాల్పడిన ఐదుగురు దుండగులు.. ప్రియుడిని చితకబాది.. ప్రియురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఉదంతమిది. ఈ సంఘటన నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, విజయనగరం జిల్లాకు చెందిన ఓ యువతి (19), కాకినాడకు చెందిన యువకుడు (22) శ్రీసిటీ సెజ్‌లో పనిచేస్తున్నారు. ఇద్దరూ ప్రేమలోపడ్డారు. ఏకాంతంగా గడపడానికి ఆదివారం రాత్రి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర ఉన్న గూడ్స్‌షెడ్ వద్దకు వెళ్లారు. వారిపై ఓ ఐదుగురు యువకులు దాడి చేశారు. ప్రేమికుడ్ని తీవ్రంగా కొట్టారు. ప్రియురాలిని బెదిరించి, ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పోలీసు వాహనం అక్కడకు చేరుకోడాన్ని చూసిన నిందితులు బాధితురాలిని తీసుకుని ఉడాయించారు. ఆమెను వివస్త్రను చేసి, రైలుపట్టాలపై నడిపించారు. తెల్లవారుజామున 3.30 సమయంలో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

మహబూబ్‌నగర్ క్రైం, ఫిబ్రవరి 4: ప్రేమ పేరుతో ఓ యువతిని వేధిస్తున్న ఉన్మాది బ్లేడుతో ఆమె మెడ కోసిన ఉదంతమిది. ఆ తర్వాత అతడూ ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. జడ్చర్లకు చెందిన అనూప్, లక్ష్మీనగర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధించేవాడు. దీంతో యువతి తల్లిదండ్రులు ఆమె చదువు మాన్పించారు. సోమవారం సాయంత్రం యువతి ఇంటికి చొరబడిన అనూప్.. విచక్షణ కోల్పోయి బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. విషయం గమనించిన పక్కింట్లో ఉండే మహిళ అతడిని ఓ ఇంట్లో బంధించగా.. గొంతు కోసుకుని, నిప్పుపెట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు.

ఆగస్టులోగా కాళేశ్వరం పూర్తి

▸ **ప్రాజెక్టు.. ఇంజనీరింగ్ అద్భుతమే**
▸ **సీఎం కేసీఆర్ కూడా భూ నిర్వాసితుడే**
▸ **రైతుల ఆవేదన ఆయనకు తెలుసు: కేటీఆర్**
▸ **సిరిసిల్ల జిల్లాలో పనుల పరిశీలన**



సిరిసిల్ల జిల్లాలోని మల్కపేట రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్రలో సాగునీటి రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దాన్ని సరిదిద్ది రైతుల కళ్లలో సంతోషం చూడాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న తొమ్మిదో ప్యాకేజీ పనులు, మల్కపేట రిజర్వాయర్, సిరిసిల్ల, ధర్మారం టన్నెల్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ఆగస్టులోగా పూర్తవుతాయన్నారు. రాష్ట్రంలోని బీడు భూములను గోదావరి, కృష్ణ జలాలతో తడిపేందుకు అనేక చిన్న, మధ్య తరగతి ప్రాజెక్టులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వాటన్నింటినీ యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కేసీఆర్ సంకల్పమైన 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడానికి బడ్జెట్‌లో ఏటా సాగునీటి రంగానికి రూ.25వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ కూడా భూ నిర్వాసితుడేనని, రైతుల ఆవేదన ఆయనకు తెలుసునన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టులో కేసీఆర్ స్వయంగా భూములు కోల్పోయారని, మిడ్‌మానేరు కింద కొదురుపాకలో తన అమ్మమ్మ భూములు కోల్పోయారని గుర్తు చేశారు. అందుకే రైతులు సంతృప్తి చెందే విధంగా పరిహారం అందిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వంద కిలోమీటర్ల టన్నెల్స్, కాలువలు ఉన్నాయన్నారు. 11 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రూపొందించిన ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును ఇప్పుడు 141 టీఎంసీలకు పెంచుకున్నామన్నారు. చైనాలో ఇంజనీరింగ్ అద్భుతాల గురించి వింటున్నాం కానీ.. కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలిస్తే ఇంజనీరింగ్ అద్భుతం ఇక్కడే కనిపిస్తుందన్నారు. సాగునీటి రంగంలో ఇంజనీర్ల కృషికి హ్యాట్సాప్ చెప్పక తప్పదని అన్నారు. కాలంతో పోటీపడి పనులు జరుగుతున్నాయంటే సీఎం కేసీఆర్ దార్శనికతే కారణమన్నారు. ఉమ్మడి ఏపీలో చిన్ననీటి వనరులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, చెరువులు, కుంటలను పట్టించుకోలేదన్నారు. భారీ ప్రాజెక్టులతో అనుసంధానం చేసి చెరువులన్నింటినీ నీటితో నింపేందుకు కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని చెప్పారు. కాగా, సిరిసిల్లలో అట్టహాసంగా జరిగిన మాఘమాస్య జాతరలో కేటీఆర్ పాల్గొన్నారు. మానేరు తీరంలో గంగమ్మ తల్లిని, రామప్పలో రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేలమంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 6 గంటలు, స్లాటెడ్, సర్వ, దివ్యదర్శనాలకు దాదాపు 2 గంటల సమయం పడుతోంది. బుధవారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో మంగళవారం లక్కీడిప్ ద్వారా జారీచేసే టిక్కెట్లు సుప్రభాతం: 50, కల్యాణోత్సవం: 80, డోలోత్సవం: 25, అర్చన: 8 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.



జర్నలిస్టులకు టోల్ వద్దు

జర్నలిస్టులందరికీ టోల్ ట్యాక్స్ నుంచి మినహాయింపునివ్వాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన సోమవారం ఓ లేఖ రాశారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

- కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి



రోడ్డు ప్రమాదాలు 20% తగ్గొచ్చు

"రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన తాజా నివేదిక మార్చిలో రానుంది. ఈసారి రోడ్డు ప్రమాదాలు 15 నుంచి 20 శాతం తగ్గొచ్చని భావిస్తున్నాం. యాక్సిడెంట్ల కారణంగా ప్రతి ఏడాది చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో 18-35 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. ఇది నన్ను చాలా బాధిస్తోంది. రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు స్థిరంగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వాటిని నిరోధించడంలో పెద్దగా విజయం సాధించలేకపోతున్నాం."

- నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి

పదోన్నతుల ఆశ

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు వచ్చే వరకు స్టే వర్తిస్తుందని తెలిపింది. తదుపరి విచారణను ధర్మాసనం మార్చి 25కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఉపాధ్యాయ పదోన్నతులకు ఇకనైనా మోక్షం కలుగుతుందా? అని టీచర్లు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. స్టేతో ఏకీకృత సర్వీస్ రూల్స్ ఆధారంగా ఉపాధ్యాయుల పదోన్నతులకు వెసులుబాటు కలిగింది. కేసు విచారణకు వచ్చేలోగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలా? వద్దా? అన్న మీమాంసలో ప్రభుత్వం ఉంది. ఉపాధ్యాయ సంఘాలు మాత్రం వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. పదోన్నతుల వల్ల సుమారు 15వేల మంది ఉపాధ్యాయులకు లబ్ధి కలిగే అవకాశం ఉంది. ఖాళీగా ఉన్న బీఎడ్, డీఎడ్ టీచర్లు, ప్రిన్సిపాళ్లు, ఎంఈవో, డిప్యూటీ ఈవో, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 350 డైట్ లెక్చరర్లు, 500 ఎంఈవోలు, 56 డిప్యూటీ ఈవోలు, 1000 వరకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు పండిట్లకు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇవ్వడం వల్ల కింది స్థాయిలోనూ భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో ఆ పోస్టులను నూతన నియామకం ద్వారా భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. పదోన్నతులు, నూతన నియామకాల వల్ల ప్రభుత్వంపై ప్రతి నెల రూ.400 కోట్ల వరకు భారం పడే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుకు వెళుతుందా..? లేక వేచి చూసే ధోరణిలో ఉంటుందా? అనేది తేలాల్సి ఉంది. పదోన్నతులు చేపట్టాలంటూ మంగళవారం సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పీఆర్‌టీయూ ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్దన్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, కమలాకర్‌రావు తెలిపారు. వెంటనే పదోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, చావా రవి, ఎస్టీయూ అధ్యక్షుడు భుజంగరావు, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండల్‌రెడ్డి, మైస శ్రీనివాస్, టీపీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, చెన్నయ్య, టీఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, టీటీఎఫ్ అధ్యక్షుడు రఘునందన్, డీటీఎఫ్ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, టీయూటీఎఫ్ అధ్యక్షుడు మల్లారెడ్డితో పాటు ఇతర సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

పదోన్నతుల్లో అవకాశమివ్వండి: ఎస్జీటీలు

పండిట్లతో పాటు తమకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని సెకండరీ గ్రేడ్ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పండిట్ పోస్టులకు పండిట్లకే పదోన్నతులు ఇవ్వాలనే జీవో 17, 18లను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో జీవో 11, 12ల ప్రకారం తమకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని ఎస్జీటీ ఫోరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కమ్రుద్దీన్, చంద్రారెడ్డి, ఎస్జీటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి కోరారు.

సుప్రీంను ఆశ్రయిస్తాం: ప్రభుత్వ టీచర్లు

ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కి సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించిన నేపథ్యంలో మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వీరాచారి తెలిపారు. గతంలోనే తాము కేసుకు సంబంధించి కేవియట్ దాఖలు చేశామని, ఈ నేపథ్యంలో స్టేను ఎత్తివేసే అవకాశం ఉందన్నారు.


యాదాద్రి చూసి తరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉప రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. వందల ఏళ్ల పాటు నిలిచిపోయే దేవాలయం కాబట్టి, నిర్మాణాలు అత్యంత వైభవోపేతంగా ఉండాలని స్పష్టం చేశారు. వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి నిర్మాణాలను అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. దేశంలోని ప్రతి ఒక్కరు ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించాలనే ఉత్సుకతను కలిగించేలా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. పునరుద్ధరణ తర్వాత యాదాద్రికి భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. యాదాద్రి పునరుద్ధరణ పనులను ఆదివారం సందర్శించి వచ్చిన కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదాద్రిలో శివరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవం నిర్వహించడానికి, నిరంతరం వ్రతాలు చేసుకోవడానికి, తలనీలాల సమర్పణకు, మండల దీక్ష భక్తులు ప్రత్యేక పూజలు చేసుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు శాశ్వత ప్రాతిపదికన చేయాలని ఆదేశించారు. వీటి నిర్మాణ పనులన్నీ సమాంతరంగా సాగాలన్నారు. మాడవీధులు, ప్రాకారాలు కలుపుకొని 4.5 ఎకరాల్లో దేవాలయ ప్రాంగణం ఉంటుందని కేసీఆర్ వెల్లడించారు. లక్ష్మీనర్సింహస్వామి కొలువై ఉండే గుట్ట పైభాగంలో ప్రధాన దేవాలయంతో పాటు గోపురాలు, ప్రాకారాలు, మాడవీధులు, శివాలయం, ఆంజనేయ స్వామి విగ్రహం, ఈవో కార్యాలయం, వీవీఐపీ గెస్ట్‌హౌస్, అర్చక నిలయం, నైవేద్యం, వంటశాల, ప్రసాద మంటపం, రథశాల, వ్రత మంటపం, స్వామి పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, మెట్లదారి, బస్టాప్, పోలీస్ ఔట్ పోస్టు, హెల్త్ సెంటర్లు ఉండాలని నిర్ణయించారు. ఏ నిర్మాణం ఎక్కడ రావాలనే దానిపై తుది నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుట్ట కింది భాగంలో గండి చెరువులో తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. గండి చెరువుకు అనుబంధంగా కోనేరు, కల్యాణకట్ట నిర్మించాలని ఆదేశించారు. గుట్ట కింద భాగంలోనే ఆలయ బస్టాండ్ నిర్మించాలని, అక్కడి నుంచి భక్తులను దేవాలయ వాహనాల ద్వారా గుట్టపైకి తీసుకురావాలని చెప్పారు. గుట్ట కింద మండల దీక్ష చేపట్టిన భక్తుల కోసం ఆశ్రమం నిర్మించాలని నిర్ణయించారు. యాదాద్రి ఆలయం చుట్టూ రింగు రోడ్డు నిర్మించాలని, దానికి అనుబంధంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. యాదాద్రి నుంచి తుర్కపల్లికి 4 లైన్ల రోడ్డు వేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతలో రాజీపడవద్దని కోరారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడానికి ఒక కమిటీ నియమించనున్నట్లు చెప్పారు. టెంపుల్ సిటీలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజ్ లాంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. యాదాద్రిలోని ప్రతి బ్లాకుకు దేవుళ్ల, దేవతల పేర్లు పెడతామన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, వైటీడీఏ ప్రత్యేకాధికారి కిషన్‌రావు, ఈవో గీత తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణను పరిశీలించిన కలెక్టర్

యాదాద్రి ఆలయ పరిసరాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి కేసీఆర్ సూచనల అమలుకు అధికారులు సిద్ధమయ్యారు. గుట్టకు తూర్పు భాగాన ఆలయాన్ని సందర్శించే భక్తులకు అవసరమైన సదుపాయాల అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు రూ.70 కోట్లు మంజూరు చేయడంతో కలెక్టర్ అనితారామచంద్రన్, భువనగిరి ఆర్డీవో ఎంవీ భూపాల్‌రెడ్డి సోమవారం స్థలాలను సందర్శించారు.



శ్వాసతో కేన్సర్ పసిగట్టే బయోసెన్సర్

లండన్, ఫిబ్రవరి 4: ఒక వ్యక్తి తీసుకునే శ్వాసను బట్టి ఊపిరితిత్తులు కేన్సర్ వచ్చే అవకాశాలను ముందే పసిగట్టే బయోసెన్సర్‌ను లండన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్ పరిశోధకులు రూపొందించారు. గ్రఫేన్‌తో రూపొందించిన ఈ బయోసెన్సర్‌ను ఈ-నోస్ పరికరాల్లో ఉపయోగించి.. శ్వాస తీసుకొని వదిలినప్పుడు వచ్చే అణువులను విశ్లేషిస్తారు. ఊపిరితిత్తుల కేన్సర్ బయోమార్కర్‌లో సహజంగా కనిపించే అణువులను గుర్తిస్తారు. ఇది చాలా తక్కువ ఖర్చుతో కూడినదని శాస్త్రవేత్తలు తెలిపారు.

హెచ్ఐవీ నియంత్రణకు కొత్త ఆధారాలు!

టొరంటో, ఫిబ్రవరి 4: హెచ్ఐవీని నిరోధించి, వ్యాధి నిరోధకశక్తిని పెంచే టీకాను అభివృద్ధి చేసే కొత్త పద్ధతులను పరిశోధకులు కనుగొన్నారు. ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ, హెచ్ఐవీ కణాలపై వ్యాధి నిరోధక టీ- కణాలను ప్రతిస్పందించడం మధ్య గల సంబంధాన్ని కెనడాకు చెందిన సిమోన్ ఫ్రేజర్ యూనివర్సిటీ, దక్షిణాఫ్రికాలోని క్వాజులు-నాటల్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా హెచ్ఐవీ కణాలు తన రూపును మార్చుకుని టీ-కణాల నుంచి తప్పించుకుంటాయని ప్రొఫెసర్ మార్క్ బ్రోక్‌మన్ తెలిపారు. ఆ కణాలు తప్పించుకోలేని విధంగా వ్యాధినిరోధక శక్తిని పెంచి హెచ్ఐవీని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

సవరణ

చిగురుపాటి జయరాం హత్య కేసులో పోలీసులు నిందితుడిగా అనుమానిస్తున్న రాకేశ్‌రెడ్డి ఫోటో పొరపాటుగా ప్రచురితమైంది. ప్రచురితమైన చిత్రానికి, జయరాం హత్య కేసులో నిందితుడికీ ఎలాంటి సంబంధం లేదు.

తక్కువ ఖర్చుతో కేన్సర్‌కు చికిత్స: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రాణాంతక కేన్సర్ నివారణకు అతి తక్కువ ఖర్చుతో చికిత్స విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా ఆయన సోమవారం ట్వీట్ చేశారు. "కేన్సర్‌ను ముందుగానే గుర్తించి, నివారించేందుకు మేము కట్టుబడి ఉన్నాం. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా తక్కువ ఖర్చులోనే నాణ్యమైన చికిత్స అందిస్తున్నాం" అని వివరించారు. "కేన్సర్‌పై పోరాడుతూ ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నారు" అంటూ కేన్సర్ వ్యాధిగ్రస్తులను అభినందించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి భరోసా ఇచ్చే దిశగా కేన్సర్ పరిశోధనలు కొనసాగాలన్నారు.

కేన్సర్ నివారణకు ప్రాధాన్యమివ్వాలి

డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కేన్సర్ గుర్తింపు, నిర్ధారణతో పాటు ఏ దశలో అయినా చికిత్స అందించేందుకు అవసరమైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) కోరింది. కేన్సర్ నిర్ధారణతో పాటు పర్యవేక్షించేందుకు వసతులు ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేవని, ఇదే కేన్సర్ మరణాలు పెరగడానికి కారణమని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అన్ని దేశాలూ కేన్సర్ నివారణకు విధివిధానాలు రూపొందించాలని విన్నవించింది.

ఉచితంగా కేన్సర్ ఔషధాలు: రాజస్థాన్

జైపూర్, ఫిబ్రవరి 4: కేన్సర్‌తో బాధపడుతున్న వారికి ఉచితంగా ఔషధాలు అందజేస్తామని రాజస్థాన్ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందుల జాబితాలో కేన్సర్ ఔషధాలను కూడా చేర్చామని ఆరోగ్య శాఖ మంత్రి రఘు శర్మ సోమవారం వెల్లడించారు. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా సోమవారం ఎస్ఎంఎస్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మారిన జీవన శైలి, ఒత్తిడి, మానసిక అంశాలే ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి కారణమన్నారు.

● ఉత్తమ 'పట్టు' ఉత్పత్తి రాష్ట్రంగా తెలంగాణ



ఏపీసీ పార్థసారధిని సన్మానిస్తున్న ఉద్యాన కమిషనర్ వెంకట్రాంరెడ్డి

▸ **9 న ఢిల్లీలో పార్థసారథికి అవార్డు ప్రదానం**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన 'పట్టు'(సిల్క్)ను ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ జాతీయ అవార్డును సాధించింది. పట్టుగూళ్ల నుంచి ఏడాదిలో రెండు దఫాలుగా నాణ్యమైన (బై-వోల్టైన్ కుకూన్) పట్టును 100% ఉత్పత్తి చేసినందుకుగాను తెలంగాణను ఈ అవార్డు వరించింది. ఈనెల 9న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథికి అవార్డు ప్రదానం చేయనున్నారు. తెలంగాణ 'పట్టు'కు జాతీయస్థాయి గుర్తింపు, రాష్ట్రానికి అవార్డు రావటంతో.. ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ మదన్‌మోహన్ సోమవారం సచివాలయంలోని డి-బ్లాక్‌లో ఏపీసీ పార్థసారథికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

భూగర్భ గనుల్లోకీ మహిళలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మహిళలు ఇక నుంచి భూగర్భ గనుల్లోనూ పనిచేయవచ్చని కేంద్ర కార్మిక శాఖ సోమవారం వెల్లడించింది. గనుల చట్టం 1952లో మహిళలపై ఉన్న నిబంధనలను సడలిస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మహిళలకు ఉద్యోగావకాశాలు పెంచాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. దీని ప్రకారం ఓపెన్ కాస్టు గనుల్లో మహిళలు ఎప్పుడైనా పనిచేయవచ్చు. అయితే భూగర్భ గనుల్లో మాత్రం రాత్రి సమయంలో మహిళలకు నిర్దేశించిన పనుల్లో మాత్రమే వారు పనిచేయవలసి ఉంటుంది. మహిళలకు పని కేటాయించేటప్పుడు కనీసం ముగ్గురు మహిళలు ఒక గుంపుగా ఉండేలా చూసుకోవాలని గనుల యజమానులకు కేంద్రం సూచించింది. గనుల చట్టం 1952 ప్రకారం భూగర్భ గనుల్లో పనిచేయడానికి మహిళలకు నిషేధం ఉండేది.

అమెరికా నుంచి తిరిగొచ్చిన విద్యార్థులు!

శంషాబాద్, ఫిబ్రవరి 4: ఎంతో ఆశతో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లి అక్కడి నకిలీ విశ్వవిద్యాలయం వలలో పడిన విద్యార్థుల్లో కొందరు సోమవారం తెల్లవారుజామున స్వదేశానికి చేరుకున్నారు. భారత విదేశాంగ శాఖతో పాటు అమెరికాలోని తెలుగు సంఘాలు విద్యార్థులను కష్టాల నుంచి గట్టెక్కించడానికి చొరవ చూపాయి. దాంతో దాదాపు 30 మంది విద్యార్థులకు విముక్తి కలిగింది. వారు ఎప్పుడు వస్తారా అని కుటుంబ సభ్యులు ఎంతో ఎదురుచూశారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఆ విద్యార్థులను చూడగానే కుటుంబీకుల ఆనందానికి అవధుల్లేవు. మరికొన్ని రోజుల్లో అమెరికాలో చిక్కుకుపోయిన ఇతర విద్యార్థులూ స్వదేశానికి రానున్నారు.



● అన్నా హజారే దీక్షతో దిగొచ్చిన మహారాష్ట్ర

ముంబై, ఫిబ్రవరి 4: సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే ఆరో రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు మహారాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. రాష్ట్రంలో లోకాయుక్త, ఉప లోకాయుక్తల నియామకానికి అంగీకరిస్తున్నట్లు సీఎం ఫడణవీస్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన కేబినెట్ భేటీలో ఈమేరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికైనా దీక్షను విరమించాలని అన్నా హజారేకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు హజారే మాట్లాడుతూ హామీని కేంద్రం నెరవేర్చకుంటే పద్మభూషణ్‌ను వెనక్కి ఇచ్చేస్తానని స్పష్టం చేశారు. ఆరు రోజుల దీక్షతో హజారే 4.2 కేజీల బరువు తగ్గారు.

● మహిషాసురుడిగా ప్రియాంక పోస్టర్



న్యూఢిల్లీ, ముంబై, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీని మహిషాసురుడిగా చిత్రీకరిస్తూ ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో ఓ బీజేపీ నేత పేరుతో పోస్టర్ వెలిసింది. బీజేపీ నేత ప్రియాంక రావత్ దుర్గా అవతారంలో ప్రియాంకగాంధీని అంతం చేస్తున్నట్లు పోస్టర్ ఏర్పాటు చేశారు.

● సీబీఐ చీఫ్‌గా శుక్లా బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సీబీఐ డైరెక్టర్‌గా రిషి కుమార్ శుక్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆయన నియామకం జరగ్గా, రెండు రోజుల్లోనే పగ్గాలు చేట్టడం విశేషం. సాధారణంగా వారం రోజుల గడువు ఉంటుంది. కానీ, సీబీఐ అధికారులు, కోల్‌కతా పోలీసుల మధ్య జగడం నేపథ్యంలో శుక్లా ఏమాత్రం ఆలస్యం చేయలేదు.

● చిన్నారి రేప్ కేసులో టీచర్‌ను ఉరి తీయండి

»» హైకోర్టు తీర్పు.. సుప్రీంకు నిందితుడు

జబల్‌పూర్, ఫిబ్రవరి 4: నాలుగేళ్ల పసిపాపపై అత్యాచారానికి పాల్పడిన ఒక టీచరుకు ఉరిశిక్ష అమలుచేయాల్సిందిగా మధ్యప్రదేశ్‌లోని ట్రయల్‌కోర్టు 'డెత్ వారెంటు' జారీచేసింది. ఈ మేరకు జబల్‌పూర్ సెంట్రల్ జైల్లో ఉన్న నిందితుడు మహేంద్ర సింగ్ గోండ్(28)ను మార్చి రెండో తేదీ తెల్లవారుజామున ఐదింటికి ఉరితీయాలని జైలు అధికారులు నిర్ణయించారు. అయితే, దీనిపై అతను సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నాడు.

● బాలికపై ముగ్గురు పాస్టర్ల అత్యాచారం!

మైసూరు, ఫిబ్రవరి 4: అత్యాచారం, లైంగిక వేధింపుల అభియోగాలపై మంగుళూరుకు చెందిన ముగ్గురు పాస్టర్లపై మైసూర్ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మైసూర్‌కు చెందిన బాధితురాలి(16) తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ కె.టి. బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఇంటి నిర్మాణానికి సాయం చేయడంతో పాటు బాలికకు ఉద్యోగం ఇప్పిస్తామని ముగ్గురు పాస్టర్లు హామీ ఇచ్చి, గత ఏడాది నవంబరులో మంగళూరు తీసుకెళ్లారని పేర్కొన్నారు. బాలికను లైంగికంగా వేధించడంతో పాటు ఇంటి పనులు చేయించేవారని చెప్పారు. నిందితులు సెబాస్టియన్, బెన్నెట్‌అమ్మన్, జోషువాఅమ్మన్ పరారీలో ఉన్నారన్నారు.

● అసూయతో ఎంత పనిచేశావన్నా!

»» పెట్రోలు పోసి సోదరుల ఇంటికి నిప్పు.. నలుగురి బలి

మాల్దా, ఫిబ్రవరి 4: తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం రావడాన్ని తట్టుకోలేకపోయిన అన్న విచక్షణ కోల్పోయాడు. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోతూ తమ్ముడితో పాటు అతడికి సాయం చేసిన మరో సోదరుడిపైనా కక్ష గట్టాడు. సోదరులు ఉంటున్న ఇంటికి నిప్పుపెట్టి ఇద్దరు చిన్నారులు సహా.. నలుగురిని బలితీసుకున్నాడు. ఈ దుర్ఘటన పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో జరిగింది. మడన్‌టోలా గ్రామంలో నివసించే వికాశ్(32)కు మఖన్(30), గోవింద(28)తో పాటు మరో సోదరుడు లక్ష్మణ్ ఉన్నారు. నేషనల్ వాలంటీర్ ఫోర్స్(ఎన్‌వీఎఫ్)లో పనిచేసే ఒక కార్మికుడు చనిపోవడంతో.. ఆ ఉద్యోగాన్ని గోవిందకు ఇప్పించేలా సహకరించాడు వికాశ్. దీంతో మఖన్ వారిపై కక్షగట్టాడు. ఆదివారం రాత్రి తమ్ముడు గోవింద(28), ఆయన భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు; మరో సోదరుడు వికాశ్(32), ఆయన భార్య, కొడుకు, కూతురు నిద్రిస్తుండగా పెట్రోలు పోసి ఇంటికి నిప్పంటించాడు. గోవింద, ఆయన ఇద్దరు కూతుళ్లతో పాటు వికాశ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన గోవింద భార్య, వికాశ్ భార్య, కొడుకు, కూతురిని ఆస్పత్రిలో చేర్చారు.

వీళ్లు కన్నేస్తే ఇల్లు గుల్లే!

హాపూర్ గ్యాంగ్ శైలి ..తాళం వేసిన ఇళ్లే టార్గెట్

»» పగటిపూటే చోరీలు .. 6 రాష్ట్రాల్లో మోస్ట్‌వాంటెడ్

»» ఎనిమిది మందికి బేడీలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వారు కన్నేస్తే ఇల్లు గుల్లే..! తాళం వేసి ఉన్న ఇళ్లే వారి టార్గెట్. పక్కాగా స్కెచ్ వేసి, పగటిపూటే పనికానిచ్చేస్తారు. తెల్లారేసరికి మకాం మార్చేస్తారు. కార్లలో దర్జాగా వచ్చి.. దొంగతనాలకు పాల్పడతారు. ఇదీ ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాకు చెందిన దొంగల ముఠా నేరశైలి. మూడేళ్లుగా ఆరు రాష్ట్రాల పోలీసులకు ముప్పుతిప్పలు పెడుతున్న ఈ ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ. 18లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాకు చెందిన మహ్మద్ సద్బార్ వ్యసనాలకు బానిసై.. దొంగతనాలను ఆరంభించాడు. షానవాజ్, నదీమ్ అనే వ్యక్తులతో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. యూపీ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. యూపీకే చెందిన 'నయీం' గ్యాంగ్‌ను తన ముఠాలో కలుపుకొని పక్కా స్కెచ్‌తో దొంగతనాలు చేస్తున్నాడు. ఈ ముఠా తొలుత ఎంచుకున్న నగరాల్లో ఉదయం వేళల్లో కార్లు, ఆటోల్లో రెక్కీవేస్తుంది. అంతా సవ్యంగా ఉందనుకుంటే.. ఆ వెంటనే స్క్రూడ్రైవర్, ప్రత్యేకంగా తయారు చేసిన పరికరం సాయంతో ఇంటి తాళం బద్దలు కొడుతుంది. బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులతో ఉడాయిస్తుంది. తాము బసచేసిన లాడ్జికి చేరుకుని, మరుసటి రోజు యూపీకి తిరిగి వెళ్తుంది. సద్బార్ మూడు సార్లు యూపీ పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. ఈ ముఠాలో విలీనమైన నయీం గ్యాంగ్ నాయకుడు.. యూపీకి చెందిన నయీం అలియాస్ సోనూను 2017లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. హాపూర్ గ్యాంగ్ ఆరు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ అని సజ్జనార్ వివరించారు.

ఇలా దొరికారు...

ఈ గ్యాంగ్ గత ఏడాది అక్టోబరులో ఆసిఫ్‌నగర్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడింది. ఈ ఏడాది జనవరి 19న రాజేంద్రనగర్‌లో దొంగతనం చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన రాజేంద్రనగర్ పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ముఠాను గుర్తించారు. యూపీ వెళ్లిన ఎస్వోటీ పోలీసులు జనవరి 31న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో చోరీలకు సిద్ధంగా ఉన్న మరో నలుగురిని, వీరి నుంచి చోరీసొత్తును కొనుగోలు చేసే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఈ ముఠా నుంచి అరకిలో బంగారం, మరో అరకిలో వెండి, రూ. 20వేల నగదు, చోరీలకు ఉపయోగించే పరికరాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ. 18 లక్షలు ఉంటుందని సజ్జనార్ తెలిపారు.



హాపూర్ దొంగల ముఠా

● హెల్మెట్టే ఆయువు పట్టు



హెల్మెట్ ధరించకపోవడం వల్లే చాలావరకు రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య పెరుగుతోంది. అందుకే వాహనం నడిపేప్పుడు హెల్మెట్ పెట్టుకుని, ప్రాణాలను కాపాడుకోవాలని జగిత్యాలలో భారీ ర్యాలీ తీశారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జగిత్యాల కలెక్టర్ శరత్, ఎస్పీ సింధుశర్మ, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సంజయ్‌కుమార్, సుంకె రవిశంకర్‌తో పాటు పలువురు హెల్మెట్ ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యమ ధర్మరాజు వేషంలో ఏఎస్సై మల్లయ్య చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. - ఆంధ్రజ్యోతి, జగిత్యాల

ఏకకాలంలో ఎన్ని పనులు చేయాలి?

ఈ ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నాం.. ఆరోగ్య కార్యకర్తల ఆందోళన బాట.. అధికారులకు వినతిపత్రాలు

నిర్మల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఒత్తిళ్లను తట్టుకోలేక ఆందోళన బాట పడుతున్నారు. ఏకకాలంలో పది రకాల పనులు చేయలేమంటూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది సోమవారం ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వం అప్పజెప్పిన పనులను తమ జాబ్ చార్ట్ ప్రకారం నిర్వహించేందుకు సిద్ధమేనని తెలిపారు. కానీ, ఏకకాలంలో అనేక రకాల పనులను అప్పగిస్తుండడంతో పాటు ప్రతి పనినీ నిరంతరం ఆన్‌లైన్ చేయించే విధానంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కార్యకర్తలతో పాటు క్షేత్రస్థాయిలో పని చేసే పర్యవేక్షకులు, విస్తరణ అధికారులకు విపరీతమైన పనిభారం పెరిగింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కేసీఆర్ కిట్ల పంపిణీతో పాటు ఇతర కార్యక్రమాల అమలులో ఆరోగ్య సిబ్బంది ఒత్తిళ్లకు గురవుతున్నారు. గర్భిణుల గుర్తింపు, టీకాలు, గృహ సందర్శనలు, అంటు వ్యాధుల నిర్వహణ వంటి రోజువారీ పనులు ఓ వైపు.. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న కార్యక్రమాల నిర్వహణ మరోవైపు ఉండడంతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. అలాగే 104, 102 సేవల్లో కూడా పాల్గొంటున్నారు. గ్రామాల్లో నిర్వహించే అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలతో పాటు 25 రకాల రిజిస్టర్ల నమోదు ఆరోగ్య కార్యకర్తలకు తలకు మించిన భారంలా మారుతోంది. తమిళనాడు తరహాలో ఆరోగ్య సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆలోచనకు విరుద్ధంగా ఇక్కడి వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన కంటి వెలుగుతో పాటు క్యాన్సర్, టీబీ, కుష్ఠు, మధుమేహం, బీపీ వంటి జబ్బుల నిర్ధారణ ప్రత్యేక కార్యక్రమాల్లోనూ పాల్గొనాల్సి ఉంటుంది. ఇది మరింత భారమవుతుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కొత్తగా చెవి, ముక్కు, గొంతు పరీక్షల కార్యక్రమాన్ని తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎన్‌సీడీ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి.. సర్వే నిర్వహించాల్సి వస్తోంది. ఒక్కో వ్యక్తికి సంబంధించిన 30 రకాల సమాచారాన్ని సేకరించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే పనిని అప్పగించారు. ఇది తమకు మరింత భారంగా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆదిలాబాద్ డీఎంహెచ్‌వోను సమస్యలపై నిలదీస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

ఈడబ్ల్యూఎస్‌ల సమస్యలను చర్చించాలి

»» ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి

బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బలహీన వర్గాల సమస్యలపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే చర్చించాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థిక బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన కేంద్రం, బడ్జెట్‌లో మాత్రం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం తగదన్నారు. న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో వెనుకబడుతున్న అగ్రవర్ణ పేదలకు జాతీయ స్థాయిలో 50వేల కోట్లతో ఓసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించినా, అనేక రాష్ట్రాలు ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు చెల్లవని తెలిసినప్పటికీ ఏపీ సీఎం చంద్రబాబు కాపులకు 5 శాతం, మిగిలిన అగ్రవర్ణాలకు 5 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామంటూ జనాన్ని గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.



● చీపురుపట్టి.. చెత్తను ఊడ్చి

పంచాయతీ పాలకవర్గ పారిశుద్ధ్య బాట

వారంతా కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు.. ఎలాగూ గెలిచాం కదా.. మళ్లీ ఐదేళ్ల తర్వాత చూసుకుందాంలే అనుకోలేదు. పరిశుభ్రతలో గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలనుకున్నారు. చీపుర్లు చేతబట్టి చెత్తనంతా శుభ్రం చేశారు. వారే సిద్దిపేట రూరల్ మండలం గుర్రాలగొంది పంచాయతీ పాలకవర్గ సభ్యులు. సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు. - సిద్దిపేట

పులకించిన చెట్టు.. పుట్ట!

»» నాగోబా మహా జాతర ఆరంభం..

ఉట్నూర్/ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో చెట్టు.. పుట్ట పులకించింది. ఆదివాసీ మెస్రం గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మెస్రం గిరిజనులు పూజలు నిర్వహించిన అనంతరం జాతరను ప్రారంభించారు. ఐదు రోజుల క్రితం పవిత్ర గోదావరి జలాలతో మెస్రం గిరిజనులు వంద్రి చెట్టు చెంతకు చేరడంతో నాగోబా జాతర సందడి మొదలైంది. మెస్రంలు మర్రిచెట్టు నుంచి గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. సిరికొండ నుంచి తెచ్చిన కొత్త కుండలకు పూజలు చేసి, మెస్రం మహిళలకు అందించారు. ఆ కుండలతో కోనేరు నీటిని తెచ్చి నాగోబా ఆలయాన్ని శుద్ధి చేశారు. హస్తిన మడుగు నుంచి తెచ్చిన గోదావరి పవిత్ర జలాలతో నాగోబాకు అభిషేకం నిర్వహించారు. అనంతరం మెస్రం ఆడపడచులు, అల్లుళ్లు ఆలయంలోని పాత పుట్టను తవ్వి కొత్త పుట్టను తయారు చేశారు. ఆ పుట్ట నుంచి సేకరించిన మట్టితో ఏడుగురు దేవతల ప్రతిమలను రూపొందించి పూజలు చేశారు. అనంతరం మహిళలు గోవాడ్‌లో (విడదిస్థలం) చేరుకొని 22 పొయ్యిలను ఏర్పాటు చేసి వంటలు ఆరంభించారు.



గంగా నీళ్లతో జాతరకు వస్తున్న మెస్రం మహిళలు

ఘనంగా మాఘ అమావాస్య స్నానాలు

»» వేలాదిగా తరలివచ్చిన భక్తులు..

»» కిటకిటలాడిన ఆలయాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయలలో వేలాదిమంది భక్తులు మాఘస్నానాలు ఆచరించారు. సింగూరు డ్యాంలో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో దిగువనున్న గణపురం ప్రాజెక్టుకు మంజీర నీరు విడుదల చేయలేదు. దీంతో ఉన్న నీటితోనే ఆలయ పాలకవర్గం షవర్లు ఏర్పాటు చేసింది.సిద్దిపేట, సంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, నిజామాబాద్‌ల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ ఎమ్మెల్యే పద్మారెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి ఏడుపాయల్లో స్నానాలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే, కోహెడ మండలంలోని సింగరాయ జాతరకు భక్తులు పోటెత్తారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మాఘ అమావాస్య జాతర ప్రారంభమైంది. కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలను ఘనంగా నిర్వహించారు. దుబ్బాక మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం జనజాతరగా మారింది. మంజీర నదిలోని కలుషిత నీటిలోనే భక్తులు స్నానాలు ఆచరించారు.



ఏడుపాయలకు తరలివచ్చిన భక్తజనం

ఐఏఎస్‌లకు ఏపీవీఎన్ ఆదర్శం: గవర్నర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులకు మాజీ ఐఏఎస్ అధికారి ఏపీవీఎన్ శర్మ ఆదర్శప్రాయుడని గవర్నర్ నరసింహన్ ప్రశంసించారు. నరుడి సేవలో నారాయణుడు అనే పేరుతో శర్మ జీవితచరిత్రపై ఆర్ అనంత పద్మనాభరావు రాసిన పుస్తకాన్ని గవర్నర్ సోమవారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం లాభాల్లో నడుస్తోందంటే ఆ సంస్థ ఎండీగా శర్మ తీసుకున్న నిర్ణయాలే కారణమని, సింగరేణి కార్మికుల సంక్షేమానికి కూడా ఎన్నో చర్యలు తీసుకున్నారని గవర్నర్ అన్నారు. 2014 నుంచి తనకు సలహాదారుగా ఉన్న శర్మ ఎన్నో విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని గవర్నర్ చెప్పారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ దంపతులు

కేబుల్ ఆపరేటర్ల ఆందోళన

హిమాయత్‌నగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేబుల్ చానళ్ల ప్రసారాలకు సంబంధించి కొత్త ఒప్పందాలు కుదుర్చుకునే వరకు తమను ఇబ్బంది పెట్టొద్దంటూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఆపరేటర్లు హాత్‌వే కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. లిబర్టీలోని హాత్‌వే కార్యాలయానికి భారీ సంఖ్యలో తరలొచ్చిన కేబుల్ ఆపరేటర్లు కార్యాలయం ఎదుట బైఠాయించారు. దాదాపు రెండు గంటలపాటు ఈ ఆందోళన కొనసాగింది. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హాత్‌వే అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రేటర్ అధ్యక్షుడు లింగాల హరిగౌడ్‌లు మాట్లాడుతూ పాత అగ్రిమెంట్లు రద్దుచేసి, కొత్త అగ్రిమెంట్లు కుదుర్చుకునేవరకు కిందిస్థాయి కేబుల్ ఆపరేటర్లను ఇబ్బందులకు గురియొద్దన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

గోవు కడుపులో 10కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు

»» సర్జరీ చేసినా దక్కని ప్రాణాలు

»» దహన సంస్కారాలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ

కోదాడ, ఫిబ్రవరి 4: ప్లాస్టిక్ కవర్లు తిన్న ఆ ఆవును కాపాడేందుకు పర్యావరణ ప్రేమికులు శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. సూర్యాపేట జిల్లా కోదాడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్లవెంట ఉన్న ప్లాస్టిక్ కవర్లను తిన్న ఒక ఆవు, ఆరోగ్యసమస్యల్ని ఎదుర్కోవడం గమనించిన శ్రీరామసైన్యం, గోసంరక్షణసమితి సంస్థల సభ్యులు పశువైద్యులతో చికిత్స అందించారు. శస్త్రచికిత్స చేసి సుమారు 10 కేజీల ప్లాస్టిక్‌ను తొలగించారు. అయితే.. వారి ప్రయత్నం ఫలించక.. సర్జరీ చేసిన రెండురోజులకే గోవు మృతిచెందింది.. దీంతో ఆయా సంఘాల నాయకులు గోమాతకు దహన సంస్కారాలు నిర్వహించారు.

దహన సంస్కారాలకు అవును తీసుకెళ్తున్న దృశ్యం



బీసీ బిల్లు పెట్టాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అన్ని పార్టీలు పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. దీన్ని వ్యతిరేకించిన పార్టీలకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ బిల్లు డిమాండ్‌పై ఢిల్లీలో 12పార్టీల ప్రతినిధులతో చర్చించామని తెలిపారు. బీసీలకు బర్రెలు, గొర్రెలు కాదని.. రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

ముగిసిన ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన

»» జాతీయ స్థాయికి ఎంపికైన 75 నమూనాలు

వరంగల్ అర్బన్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 3రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ముగిసింది. 31 జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు 647నమూనాలు ప్రదర్శించగా.. న్యాయనిర్ణేతలు 75 నమూనాలను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో వీటిని ప్రదర్శించనున్నారు.

మమత సత్యాగ్రహం

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజ్యాంగ విలువల పరిరక్షణ లక్ష్యంగా సుదీర్ఘ దీక్షలో కూర్చున్నారు. పన్నెండేళ్ళ క్రితం సింగూరు రైతులనుంచి టాటా నానో కార్ల ఫ్యాక్టరీ కోసం అప్పటి ప్రభుత్వం జరిపిన భూసేకరణను నిరసిస్తూ ఆమె ఆమరణదీక్షకు కూర్చున్న స్థలం ఇదే. ధర్నాలు, ఉద్యమాలు మమతకు కొత్తకాదు. ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకోగలిగే సాహసి ఆమె. ఒక పోలీస్ కమిషనర్ కోసం ఇలా వీధిపోరాటానికి దిగడం, అక్కడనుంచి కదిలేది లేదని ప్రతిజ్ఞ చేయడం ఆశ్చర్యం కలిగించే విషయాలే అయినప్పటికీ, బీజేపీ దూకుడుకు కళ్ళెం వేయాలంటే ఇంతటి వీరంగం వేయకతప్పదని ఆమె నమ్మకం. ఆమె కూర్చున్నచోటనే పోలీసు పరేడ్లు, మంత్రివర్గ సమావేశాలు జరుగుతున్నాయి. వివాదానికి కారకుడైన పోలీస్ కమిషనర్‌ను సత్కరించి, ధర్నా చేస్తున్న చోట తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థకూ ఒక రాష్ట్ర పోలీసు యంత్రాంగానికీ ఈ స్థాయి ఘర్షణ రేగడం సముచితం కాదు.

శారదాకుంభకోణం విచారణలో భాగంగా కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ ఇంటికి 40మంది సీబీఐ అధికారులు వెళ్ళగానే రాష్ట్ర పోలీసులు వారిని చుట్టుముట్టడం, పోలీసు ఠాణాలకు తరలించడం, సీబీఐ కార్యాలయాన్ని సైతం పోలీసులు చుట్టుముట్టి సోదాలు చేయడం, ఇందుకు ప్రతిగా కేంద్ర బలగాలు అక్కడకు చేరుకోవడం వంటివి ఇంతవరకూ చూడని, ఊహకు అందని పరిణామాలు. ఈ వివాదాన్ని న్యాయస్థానాల ఆదేశాలకో, తీర్పులకో పరిమితం చేయకుండా నడివీధిలోకి లాగడం మమత ప్రత్యేకత. ఆరోపణలున్న పోలీసు అధికారిని ఒకపక్కన రక్షిస్తూనే, మోదీపై ప్రత్యక్షయుద్ధాన్ని ప్రకటించారు ఆమె. మోదీ హయాంలో భ్రష్టుపట్టిన సీబీఐ విపక్ష నేతలపై కక్షసాధింపుకు ఎలా ఉపకరిస్తున్నదో నిరూపించదల్చారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అనుమతించకపోయినా, రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు సైతం అనుకూలంగా లేకున్నా సీబీఐని ప్రయోగించాల్సిందేనని మోదీ నిర్ణయించుకోవడం సరైనదే అయితే, మమత ప్రతిచర్యలు కూడా సముచితమైనవే అవుతాయి. తప్పొప్పుల మాట అటుంచితే, అందివచ్చిన ఏ అవకాశాన్నీ మమత జారవిడుచుకోరు కనుక, ఒక రాజ్యాంగ సంక్షోభాన్ని ఆమె రాజకీయాంశంగా వాడుకోగలుగుతున్నారు. అర్ధరాత్రి, ఓ శాలువా కప్పుకొని, అప్పటికప్పుడు ఎవరో తెచ్చివేసిన ప్లాస్టిక్ కుర్చీలో కూర్చోవడంతో ఆరంభమైన ఈ నిరసన అతివేగంగా సత్యాగ్రహ దీక్షగా మారిపోయింది. వేలాదిమంది తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు దీక్షాస్థలివైపు తరలిరావడం, బీజేపీ కార్యాలయాలపై దాడులు జరగడంతో కోల్‌కతా ఉద్రిక్తంగా తయారైంది. తొలుత సోషల్ మీడియాలోనూ, పత్రికా ప్రకటనలతోనూ సంఘీభావం ప్రకటించిన విపక్ష నాయకుల్లో కొందరు ఇప్పుడు కోల్‌కతా ప్రయాణం కడుతున్నారు.


జనవరి 19న విపక్ష నాయకులతో నిర్వహించిన ర్యాలీ విజయవంతం కావడంతో మోదీ ఈ దాడులతో తనను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మమత అంటున్నారు. ఆరోపణలున్న అధికారిని కాపాడుకొచ్చి ఆమె రాజ్యాంగ విలువల్ని అపహాస్యం చేశారని బీజేపీ అంటున్నది. ఈ కుంభకోణంతో మమతకు, ఆమె అస్మదీయులకు సంబంధం ఉన్నదని బీజేపీ ఆరోపించినప్పుడల్లా, తామే సిట్ ఏర్పాటు చేసి అనేకమంది పెద్దలను జైళ్ళలోకి నెట్టామని మమత గుర్తుచేస్తుంటారు. సీబీఐ నోటీసులను రాజీవ్‌కుమార్ బేఖాతరు చేయడం నిజమే అయినా, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేనప్పుడు ఈ విధంగా చొరబడటం సరికాదు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకే కేసు విచారణ జరుగుతున్నదని అంటున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వమూ రాజీవ్‌కుమార్ కలగలసి సహాయనిరాకరణకు పాల్పడుతున్న విషయాన్ని కోర్టు దృష్టికి సీబీఐ తెచ్చివుంటే సరిపోయేది. కోర్టు ఆదేశాలమేరకు కనుక ఈ దాడులు జరిగివుంటే మమత కచ్చితంగా ఆత్మరక్షణలో పడివుండేవారు. సిట్‌కు నాయకత్వం వహించిన రాజీవ్‌కుమార్ సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారని సీబీఐకు నిజంగానే అనుమానం ఉండివుంటే ఈ పని మరింత సక్రమంగా జరిగివుండేది. కానీ, బీజేపీ పెద్దలకు దర్యాప్తు సక్రమంగా సాగడం కాక, మమతను దెబ్బతీయడం, రాజకీయంగా లబ్ధిపొందడం ముఖ్యం. సీబీఐ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి మమత ప్రభుత్వం తనకు చేసిన అవమానాలను, విధినిర్వహణలో సృష్టించిన ఆటంకాలను ఏకరువుపెట్టి, తక్షణ విస్పష్ట ఆదేశాలను కోరింది. కానీ, ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్‌కు మాత్రం సదరు పోలీసు అధికారి ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారనేందుకు సీబీఐ ఒక్క ఆధారమూ చూపలేకపోవడమే ఆశ్చర్యం కలిగించింది. నేడు సుప్రీంకోర్టు ఏం చెప్పినా, ఏ ఆదేశాలు ఇచ్చినా, మమత సత్యాగ్రహం మాత్రం ఇప్పట్లో ముగిసే అవకాశాలు లేవు.

కటిక పేదకూ కనీస ఆదాయం!

ప్రతి సన్నకారు, చిన్నకారు రైతు బ్యాంకు ఖాతాకు ఏటా రూ.6000 నగదును నేరుగా బదిలీ చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. అయితే దేశ పౌరులందరికీ సార్వత్రిక కనీస ఆదాయ పథకం (యూనివర్శల్ బేసిక్ ఇన్ కమ్ స్కీమ్ యూబీ ఐ ఎస్) ను అమలుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

201718 ఆర్థిక సంవత్సరంలో ప్రజల సంక్షేమానికిగాను కేంద్ర ప్రభుత్వం చేసిన వ్యయాలను వివరంగా చూద్దాం. ఆహార సబ్సిడీపై రూ.140,000 కోట్లు; గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆవాస్ యోజన ఇత్యాదులపై రూ.136,000 కోట్లు; విద్యావైద్యాలపై రూ.134,000 కోట్లు; వీటితో పాటు ఎరువులు, పెట్రోలియం సబ్సిడీలపై రూ.100,000 కోట్లు ఖర్చు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం చేసిన మొత్తం సంక్షేమ వ్యయాల విలువ రూ.510,000 కోట్లు. పెట్రోల్, డీజిల్ పై యూబీఐ ఎస్ సెస్ విధించడం ద్వారా మరింత ధనాన్ని సమకూర్చుకోవచ్చు. మనం ఏటా రూ.14, 532 కోట్ల విలువైన పెట్రోలు, డీజిల్ ను వినియోగించుకుంటున్నాము . ఈ ఇంధనాలపై లీటర్‌కు రూ.10 చొప్పున యూబీ ఐ ఎస్ పన్ను విధిస్తే ఏటా రూ.140,000 కోట్ల ధనం సమకూరుతుంది. అదే విధంగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పై 10 శాతం యూబీఐ ఎస్ సెస్ విధింపుతో రూ.120,000 కోట్లు సమకూరుతాయి. ఈ రెండు సెస్ ల ద్వారా మొత్తం రూ.260,000 కోట్లు సమకూరుతాయి. ఆదాయపు పన్ను పై 10 శాతం సెస్‌తో రూ.100, 000 కోట్లు సమకూరుతాయి.

యూబీ ఐ ఎస్ అమలుకు సంక్షేమ పథకాల నుంచి రూ. 510, 000 కోట్లు, సెస్ నుంచి రూ.360,000 కోట్లు వెరసి మొత్తం 870,000 కోట్ల రూపాయల సొమ్ము లభ్యమవగలదు. సరే, మన దేశ జనాభా 135 కోట్లు. ఆ సొమ్మును ఏటా ఒక్కో వ్యక్తికి రూ.6000 చొప్పున లేదా ఒక్కో కుటుంబానికి రూ.30,000 చొప్పున లేదా నెలకు రూ.2500 చొప్పున చెల్లించవచ్చు.

భరతవాక్యం

■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

మన సంక్షేమ వ్యయాల (రూ.510,000కోట్లు) లో సగం సొమ్ము పరిపాలనా పరమైన ఖర్చులకే సరిపోతుందనేది నా అంచనా. మిగతా మొత్తం (రూ.205, 000 కోట్లు) సగభాగం దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న కుటుంబాలకు, మిగతా సగం దారిద్ర్యరేఖకు ఎగువన (ఏ పీఎల్) ఉన్న కుటుంబాలకు వెళ్ళుతోంది. యూబీ ఐ ఎస్ కోసం సంక్షేమ పథకాల అమలు నిలిపివేత వల్ల బీపీఎల్ కుటుంబాలకు సంభవించే నష్టం రూ.5000 కోట్లు. పెట్రోలియం, జీఎస్టీ పై యూబీఐఎస్ సెస్ ద్వారా సమకూరుతున్న సొమ్ము (రూ.260,000 కోట్లు)లో 10 శాతాన్ని మాత్రమే బీపీఎల్ కుటుంబాల నుంచి వసూలు చేయడం జరుగుతోంది. ఈ కుటుంబాలు మార్కెట్ నుంచి చేసే కొనుగోళ్ళు తక్కువగా ఉండడమే ఇందుకు కారణం.

యూబీఐఎస్ అమలుతో ఆ కుటుంబాలపై పడనున్న భారం రూ.26,000 కోట్ల మేరకు ఉండగలదు. ఆదాయపు పన్నుపై సెస్ ప్రభావం బీపీఎల్ కుటుంబాలపై ఉండదు. కనుక సంక్షేమ పథకాలను రద్దు చేయడం వల్ల, సెస్ విధింపు వల్ల బీపీఎల్ కుటుంబాల వారు కోల్పోయే మొత్తం రూ.133,000 కోట్లు. అయితే యూబీఐఎస్ చెల్లింపుల (రూ.870,000 కోట్లు)లో మూడింట ఒక వంతు లేదా రూ.287,000 కోట్ల మేరకు బీపీఎల్ కుటుంబాలు లబ్ధి పొందగలవు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ కుటుంబాలు రూ.133,000 కోట్లు నష్టపోతాయి; అయితే రూ.287,000 కోట్ల మేరకు ప్రయోజనం పొందుతాయి. నికర లబ్ధి రూ.154,000 కోట్లు.

> మన ప్రభుత్వ యంత్రాంగం అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, పనులలో అమిత జాప్యానికి పెట్టింది పేరు. ఈ దుష్ట పాలనా సంప్రదాయాలకు ప్రజాశ్రేయస్సు బలవుతున్నది. సార్వత్రిక కనీస ఆదాయ పథకం అమలుతో ఈ విపత్కర పరిస్థితి తొలగిపోతుందనడంలో సందేహం లేదు. అత్యంత నిరుపేదలకు సైతం కచ్చితంగా కనీస ఆదాయం సమకూరుతున్నప్పుడు సమాజంలోని పరిస్థితులు మారకుండా ఉంటాయా?

సంక్షేమ పథకాల ప్రయోజనాలలో ఒక సగ భాగాన్ని (రూ.102,000 కోట్లు)ఏ పీఎల్ కుటుంబాలు పొందుతున్నాయి కదా. ఈ కుటుంబాలు ఇప్పుడు ఎరువులు, పెట్రోలియం సబ్సిడీలో 95 శాతాన్ని (రూ.95, 000 కోట్లు) కూడా కోల్పోవగలవు. పెట్రోలియం, జీఎస్టీ పై యూబీఐ ఎస్ సెస్ (రూ.260,000 కోట్లు)లో 90 శాతాన్ని అంటే రూ.234,000 కోట్లు ఈ కుటుంబాలు చెల్లిస్తాయి. ఆదాయపు పన్నుపై సెస్ 100 శాతాన్నీ (రూ.100, 000) ఈ కుటుంబాలే చెల్లిస్తాయి.

ఏ పీఎల్ కుటుంబాలపై యూబీఐఎస్ మొత్తం ప్రభావం రూ.531,000 కోట్ల మేరకు ఉంటుంది. ఈ నష్టానికి గాను ఈ కుటుంబాలు యూబీఐ ఎస్ చెల్లింపుల (రూ.870,000)లో మూడింట రెండు వంతులు అంటే రూ.574, 000 కోట్లు పొందుతాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఏ పీఎల్ కుటుంబాలు రూ.531,000 కోట్లు నష్టపోయి రూ.574,000 కోట్లు ప్రయోజనం పొందనున్నాయి. ఈ కుటుంబాల నికర లబ్ధి రూ.43, 000 కోట్లు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలు ఎడమ చేత్తో వివిధ సెస్ లు చెల్లించి, అలా చెల్లించిన దానికంటే అధిక మొత్తంలో కుడి చేత్తో తీసుకొంటున్నాయి! ఈ కుటుంబాలపై అదనపు భారం ఏమీ ఉండబోదు.

ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలకు అమలు పరుస్తోన్న సమస్త సంక్షేమ పథకాలను రద్దుచేసి, పెట్రోలియం, జీఎస్టీ, ఆదాయపు పన్ను పై యూబీఐఎస్ పన్ను విధింపు వల్ల బీపీఎల్ కుటుంబాలు రూ.287,000 కోట్లు, ఏ పీఎల్ కుటుంబాలు రూ.43,000 కోట్లు నికర లబ్ధి పొందుతాయి. కేంద్ర ప్రభుత్వంపై అదనపు భారం ఏమీ ఉండబోదు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి పరిపాలనాపరమైన ఖర్చులను ఆదా చేయడం వల్ల, ప్రజలకు నగదును నేరుగా బదిలీ చేయడం వల్ల ఇది సుసాధ్యమవుతుంది. సార్వత్రిక కనీస ఆదాయ పథకం అమలుకు నిధుల సమస్య లేదు. ఉండబోదు. ఈ పథకం అమలు అమిత ఖర్చుతో కూడిన వ్యవహారమనే ఆక్షేపణ నిరాధారమైనది. మన ప్రభుత్వ యంత్రాంగం కేంద్రంలోనైనా, రాష్ట్రాలలోనైనా, ఆమాటకువస్తే మరింత కిందిస్థాయిలోనైనా అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, పనులలో అమిత జాప్యానికి పెట్టింది పేరు. వలసపాలనా కాలం నుంచి యథావిధిగా కొనసాగుతోన్న ఈ దుష్ట పాలనా సంప్రదాయాలకు ప్రజాశ్రేయస్సు బలవుతున్నది. సార్వత్రిక కనీస ఆదాయ పథకం అమలుతో ప్రజల శ్రేయస్సుకు భరోసా సమకూరుతుందనడంలో సందేహం లేదు. అత్యంత నిరుపేదలకు సైతం కచ్చితంగా కనీస ఆదాయం సమకూరుతున్నప్పుడు సమాజంలోని పరిస్థితులు మారకుండాయా ఉంటాయా?

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

పీయూష్ బడ్జెట్‌తో మేలు మృగ్యం

మోదీ ప్రభుత్వ అధికారాంతంలో ఏ బడ్జెట్ ప్రవేశ పెట్టాలన్న తరుణంలోనే ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మంచం పట్టారు. సంపూర్ణ బడ్జెట్, మధ్యంతర బడ్జెట్, ఓట్ ఆన్ అకౌంట్ అన్న సందిగ్ధాలను ఛేదిస్తూ అరుణ్‌జైట్లీ స్థానంలో మంత్రి పీయూష్ గోయల్ అర్థం పర్థం లేని మధ్యంతర బడ్జెటు ప్రవేశపెట్టారు. పీయూష్‌గోయల్ బడ్జెట్ ప్రసంగం వింటున్నంత సేపు ఆర్థిక శాస్త్రాన్ని ఆకళింపు చేసుకున్న ఆర్థికవేత్తలు ముక్కున వేలేసుకున్నారు. సాధారణంగా మధ్యంతర బడ్జెటు ఎలాంటి పాలసీ నిర్ణయాలు ప్రకటించదు. కొత్త పథకాలనూ, దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలను, బరువునూ మోపే ప్రణాళికలనూ ప్రకటించదు. ఎలాగూ మార్చి 31 వరకు ఇప్పటి బడ్జెట్ నడుస్తుంది కనుక, ఏప్రిల్ ఒకటి నుంచి ఓ రెండు నెల్లకోసం అయ్యే ఖర్చుల కోసం తాత్కాలికంగా ఓట్ ఆన్ అకౌంటును మాత్రమే ప్రవేశపెడుతుంది. పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెటు అందుకు భిన్నంగా ఉంది.

బడ్జెట్ ప్రసంగం ముందునుంచే అయిదేళ్ల మోదీ పాలనలో తాము సాధించామనుకున్న ప్రగతిని పీయూష్‌గోయల్ ఏకరువు పెట్టారు. ఆర్థిక సర్వే లేకుండా, అభివృద్ధి విశ్లేషణకు సమయం కాకున్నా అయిదేళ్ళలో మేము ఇది సాధించాం అది చేశాం అంటూ భారతదేశాన్ని తామే సృష్టించి, పెంచి, పోషించామన్న ధీమాతో చెప్పుకొస్తుంటే ట్రెజరీ బెంచీల వారి చప్పట్లు తప్ప ఏమీ వినిపించలేదు. బడ్జెట్ ప్రతిపాదనలు చూస్తే ఎన్నికల మానిఫెస్టో లాగే ఉంది తప్ప బడ్జెట్‌లా కనిపించలేదు. మధ్యంతర బడ్జెటు అమలు తేదీ కన్నా ముందే ఇచ్చే రాయితీలూ, నగదు బదిలీల విషయం ఇప్పుడెందుకో ఎవరికీ అర్థం కాలేదు. పీయూష్ చేసిన ప్రతిపాదనలు ఒక్కొక్కటి పరిశీలిస్తే ఎన్నికల్లో ఓట్లు ఆశించడానికే తప్ప మరేమీ కాదన్నది స్పష్టమవుతున్నది. బడ్జెట్ ఉపన్యాసం మొత్తం చడీ చప్పుడు లేకుండా విన్న పార్లమెంటేరియన్లు ఆదాయపు పన్ను రాయితీలు ప్రకటించగానే కేరింతలు కొట్టారే కాని అందులోని కిటుకు అర్థం కాలేదు. అర్థం చేసుకోవడానికి యత్నించనూ లేదు.

ఆర్థిక మంత్రి రేట్లు మారవని చెప్పారు కానీ, ఆదాయం పన్ను స్లాబుల విషయం స్పష్టం చేయలేదు. దాంతో అయిదు లక్షల రూపాయల ఆదాయం దాటినవారు సొంత స్లాబుల ప్రకారం రెండున్నర లక్షల నుంచే పన్ను కట్టాలా అన్నది ఇంకా అస్పష్టంగానే ఉంది.

ప్రకటించిన ఆదాయం పన్ను రాయితీతో ఇప్పుడిప్పుడే ఎవరికీ ఏమీ ఒరిగేది లేదు. 2020 మార్చిలో టాక్స్ కట్టేవాళ్లకు తప్ప ఈ నిర్ణయం అమల్లోకి వచ్చేది ఏప్రిల్ 1, 2019 నుంచి. అంటే రాబోయే ప్రభుత్వం మీద పడబోయే భారంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వానికి ఓట్లు పడే సాధనంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. పైపెచ్చు అయిదు లక్షల రూపాయల ఆదాయం, దానిపైన ఉద్యోగులకు యాభై వేల స్టాండర్డ్ డిడక్షన్, డబ్బులు 80సి సెక్షన్ కింద దొరుకుంటే మరో లక్షా యాభైవేల రాయితీ కలిపి ఉద్యోగస్థులయితే ఏడు లక్షల రూపాయల ఆదాయం వరకు పన్ను కోరలని తప్పించుకోవచ్చు. ఇది ఇటీవల ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలను నిర్ణయించిన ఆదాయ పరిమితి ఎనిమిది లక్షల కన్నా కేవలం లక్ష రూపాయలే తక్కువ. ఇంతవరకూ పడ్డ అపవాదులు తొలగించుకోవడానికీ, తామిప్పట్లో చేసేది ఏమీ లేదు కనుక ఆ పరిమితిని ఎనిమిది లక్షల దాకా పెంచితే పొయ్యేది. ఉద్యోగులనూ, పెన్షనర్లనూ సంపూర్ణంగా ఆదాయ పన్ను పరిధి నుంచి తొలగించినా వచ్చే నష్టం లేకపోయేది.

మొత్తం పన్ను వసూళ్లలో ఉద్యోగుల నుంచి వచ్చేది 11 నుంచి 12 శాతం దాటదు. ఇప్పుడిచ్చిన రాయితీ వల్ల అది 2 నుంచి 3 శాతానికి పడిపోతుంది. అంటే ఏనుగుపంటికి జిలకరపోచ అన్నట్టు.

శిలాఫలకాలమీదా, రాతి విగ్రహాల మీద, విదేశీ పర్యటనల మీదా, ఇప్పట్లో అవసరం లేని హై స్పీడు రైళ్ళ మీదా చేసే దుబారాను తగ్గిస్తే, ఉద్యోగవర్గం నుంచి పైసా వసూలు చేయకుండానే ప్రభుత్వాలు నడపొచ్చని లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 12 కోట్ల మంది కొత్తగా, ఆదాయం పన్ను రిటర్నులు దాఖలు చేశారంటే అందులో ఉండే ఉద్యోగులు చాలా తక్కువ. ఎందుకంటే కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారు కోట్ల సంఖ్యలో లేరు. ఉద్యోగుల భవిష్య నిధి ద్వారా సేకరించిన లెక్కలు సరికావు. అందులో ఆదాయం పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులు అతిస్వల్పం. మోదీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో ఉద్యోగాలేమీ కొత్తగా ఇవ్వలేదు సరికదా, ఖాళీ అయిన ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. దేశంలో దాదాపు 1500, ఐఏఎస్ అధికారుల అవసరం ఉందని ఉద్యోగమంత్రి గత సంవత్సరం ప్రకటించారే కానీ వాటిని భర్తీ చేస్తామని చెప్పలేదు. ప్రతి విభాగంలో ఖాళీ అయిన పోస్టులూ, భర్తీ చేయని లీవ్ రిజర్వు పోస్టులు కలిపి లక్ష పైగా ఖాళీలున్నాయని కేంద్రం లెక్కలే చెబుతున్నాయి.

వ్యక్తిగత పన్నులు అసలే లేకుండా బహమాస్, బ్రహ్రెయిన్, బెర్ముడా, బ్రుయోనీ, కువైట్, ఖతార్, ఓమన్, సౌదీ అరేబియా, బోస్నియా, బల్గేరియా లాంటి దేశాలు మనగలుగుతున్నాయి. అవి చాలానే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం మొత్తం ఉద్యోగులకు పన్ను ఎత్తేసినా, కనీసం ఉద్యోగాలు ఇప్పించలేదన్న అపవాదు తొలిగేది.

ఇక రైతుల కిచ్చే రాయితీలు తాయిలాలు. అసలు రైతుల స్థితి గతులను అధ్యయనం చేశారా? లేక కంటి తుడుపుగా మూడు సార్లు రెండేసి వేల



> మన ప్రభుత్వ కార్యాలయాలకు తమ సొంత ఈ–మెయిల్ డొమెయిన్లు లేవు. జీ మెయిల్, యాహూ, రెడిఫ్‌ల ఖాతాలే కాని ప్రభుత్వ సొంత ఖాతాలు లేవు. ఇవన్నీ పక్కనబెట్టి పల్లెటూళ్లన్నీ డిజిటల్ చేస్తామనడం బుర్రకెక్కదు. మోదీ ప్రభుత్వం పోతూ పోతూ మళ్ళీ గెలవడానికి విసిరినరాయి ఎక్కడ ఎవరికి తగులుతుందో? వచ్చే ప్రభుత్వాలు ఎంతవరకు సమర్థిస్తాయో, ఎన్ని మార్పులు తెస్తాయో చెప్పలేం.

చొప్పున ఆరువేలు ఇస్తామన్నారా? ఓ వైపు రైతుల ఆదాయం పెరిగిందని చెబుతూ, త్వరలో దాన్ని ద్విగుణీకృతం చేస్తారని చెబుతూ ఈ తాయిలాలెందుకన్న ప్రశ్న రాక మానదు. తెలంగాణ లాంటి రాష్ట్రంలో రైతుబంధు పథకం, రైతు రుణ మాఫీ పథకం, రైతు పంటలకు మద్దతుధర, రైతు పంటలకు బీమా, రైతుకు వృద్ధాప్య పింఛను, రైతుకు ఆరోగ్య రక్షణ పథకం, రైతు కుటుంబాలకు పెళ్లి ఖర్చులు, రిజర్వేషన్లు, కిసాన్ కార్డులు ఇవన్నీ ఉన్నా రైతు ఎందుకు ఏడుస్తున్నాడు? ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నాడు? ఆకలి చావులు ఎందుకు సంభవిస్తున్నాయి? రైతు కుటుంబాల్లో బాల్య వివాహాలూ బలవంతపు వివాహాలూ, పంట నష్టాలు, పురుగుల మందులు తాగడాలూ ఎందుకింకా కొనసాగుతున్నాయన్న విషయంలో సమగ్ర అధ్యయనం, ఆ అధ్యయనాలపై ఆధారపడ్డ నిర్ణయాలూ ఏవీ లేకుండానే ఆరువేల రూపాయలను రైతు ఖాతాల్లో జమచేస్తామనడం, ముందు రెండు వేలు త్వరలో ఖాతాల్లోకి పంపిస్తామనడం ఓటుకు ఆరువేలు మాట్లాడుకుని అడ్వాన్సుగా రెండువేలు చెల్లించడం కాక మరేమిటి? ఇంతకీ నిర్ణయం ఇప్పుడెందుకు?

మూడో భయంకరమైన నిర్ణయం అసంఘటిత రంగంలోని కార్మికులకు పింఛను. రెండు జాతీయ కార్మిక కమిషన్లు ఏర్పాటై, సంవత్సరాల తరబడి కూర్చుని కార్మికుల స్థితిగతులపైన దస్త్రాలకు దస్త్రాలు రిపోర్టులు రాసినా అసంఘటిత రంగాన్ని, నిర్వచించలేకపోయాయి. చివరకు తమ హక్కుల కోసం అవసరాల కోసం సంఘటితంగా ఒకటి కాలేని వర్గం అసంఘటిత రంగం అని అసంపూర్ణ నిర్వచనాలిచ్చింది.

భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న కాలంలో 2003లో అప్పటి కార్మికమంత్రి సాహెబ్ సింగ్ వర్మ అసంఘటితరంగ కార్మికుల కోసం పింఛను వ్యవస్థను ఏర్పాటు చేయాలని అనేకయత్నాలు చేశారు. వందలాది మీటింగులూ చర్చలూ జరిపారు. అందరూ కలిసి తేల్చిన విషయం అసంఘటిత రంగంలో అప్పట్లో 430 మిలియన్ల కార్మికులు ఉన్నారని, వారిలో వ్యవసాయ కార్మికులే దాదాపు 167 మిలియన్లున్నారని. వారందరి వద్ద వందరూపాయల చొప్పున చందా వసూలు చేసి పింఛను ఇస్తే వసూళ్ల ఖర్చులే పింఛను ఖర్చుల కన్నా ఎక్కువ అవుతాయని లెక్కలు తేల్చాయి. అందుకోసం ఏమీ తీసుకోకుండా కార్మికులకు కనీస పింఛను ఇవ్వాలని కార్మిక మంత్రీ, ఆయన సామాజిక భద్రత సలహాదారు సూచించారు. ఇదో భయంకర ఆర్థిక సమస్య అని అప్పటి వ్యయ విభాగ కార్యదర్శి ముందుకు తీసుకు వెళ్ళలేదు. ఇంతలో కొత్త పింఛను విధానం అమల్లోకి వచ్చింది. అందులో అసంఘటిత రంగంవాళ్లూ చేరవచ్చు. ఆ రూలు ఇప్పటికీ అమల్లో ఉంది. అయినప్పటికీ పీయూష్ గోయల్ ఎలాంటి కొత్త సర్వే, సంప్రదింపులు లేకుండా ఆర్థిక విశ్లేషణలూ, లెక్కలూ లేకుండా వంద రూపాయల చందాతో సంవత్సరానికి మూడు వేల రూపాయలు అరవై ఏళ్ల దాటినవారికి ఇస్తాననడం హాస్యాస్పదంగా ఉంది. మన జనాభాలో అరవై ఏళ్ల దాటినవాళ్ల సంఖ్య ఏడు శాతానికి అంటే ఎనిమిది తొమ్మిది కోట్లు దాటదా? అందుకోసం 50–60 కోట్ల అసంఘటిత కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడం, వాటిని దాచడం, వాటి మీద వడ్డీ ఆర్జించడం మళ్లీ పింఛను వసూలు చేయడం ఎంత పెద్ద పనో ఆలోచిస్తేనే తల తిరుగుతుంది. వెయ్యికి పైగా కమిషనర్లు, 30,000 పైగా ఉద్యోగులు 300కు పైగా కార్యాలయాలు ఉన్న ఉద్యోగుల భవిష్యనిధి సంస్థలోనే లక్షలాది కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులు లెక్క తెలియకుండా మూలుగుతున్నాయి. ఇవన్నీ గ్రహించకుండా మధ్యంతర ఆర్థిక మంత్రి తన మధ్యంతర బడ్జెట్‌లో ఎలక్షన్‌ల తరువాత ఎప్పుడో అమలయ్యే స్కీమును ఇప్పుడే ప్రకటించి ఒక రకమైన ఆర్థిక నేరం చేశారా అనిపిస్తోంది.

వృద్ధాప్య పింఛను మంచిది కాదని కాదు. అందుకు శాస్త్రీయమైన అధ్యయనం కావాలి. వృద్ధుల సంఖ్య తేలాలి. వారిలో వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే వివిధ పథకాల కింద ఇస్తున్న పింఛన్ల లెక్క తేలాలి. ఒకే వ్యక్తికి వివిధ పథకాల కింద ఎంత వస్తుందో ఏదీ రాని వారెందరో తేలాలి. అప్పుడే ఎలాంటి పింఛను వ్యవస్థనయినా ప్రవేశపెట్టొచ్చు.

ఈ మధ్యంతర బడ్జెట్‌లో విమానాశ్రయాల సంగతి ఎందుకో, అవి ఏ తరగతి వారికి ఉద్దేశించినవో, మానవ రక్షణ లేని రైల్వే గేట్ల గురించి ఉటంకింపు ఎందుకో, దేశం మొత్తం అటుంచి ఢిల్లీ వీధులనే ఊడ్చుకోలేని స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రశంస ఎందుకో అర్థం కాదు.

డిజిటల్ ఇండియా విషయంలో చేసిన ప్రకటన మరో ప్రహసనం. భారత దేశ విద్యార్థులూ, కంప్యూటర్ సైంటిస్టులూ, అమెరికా లాంటి దేశాలకు తమ పరిజ్ఞానం పంచుతుంటే, మన దేశంలో ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయమైనా ఈ–మెయిల్‌కు జవాబిచ్చే సంస్కృతిని అలవాటు చేసుకోలేదు. పైపెచ్చు, ప్రభుత్వ కార్యాలయాలకు తమ సొంత ఈ–మెయిల్ డొమెయిన్లు లేవు. జీ మెయిల్, యాహూ, రెడిఫ్‌ల ఖాతాలే కాని ప్రభుత్వ సొంత ఖాతాలు లేవు. ఇవన్నీ పక్కనబెట్టి పల్లెటూళ్లన్నీ డిజిటల్ చేస్తామనడం బుర్రకెక్కదు. మొత్తం మీద మోదీ ప్రభుత్వం పోతూ పోతూ మళ్ళీ గెలవడానికి విసిరినరాయి ఎక్కడ ఎవరికి తగులుతుందో చూడాలి. వచ్చే ప్రభుత్వాలు ఎంతవరకు సమర్థిస్తాయో ఎన్ని మార్పులు తెస్తాయో చెప్పలేం.

■ డా. పి. మాధవరావు
ఐక్యరాజ్యసమితి మాజీ సీనియర్ సలహాదారు

2019 ఎన్నికలు మతయుద్ధమేనా?

> ప్రజాస్వామిక సమాజంలో పార్లమెంటు ఎన్నికల్ని మధ్యయుగాల యుద్ధాలతో పోల్చడం పెద్ద తప్పు. వాటిని మతయుద్ధంగా వర్ణించడం అంతకన్నా మహా తప్పు. పార్టీ ఆధారిత పార్లమెంటరీ ప్రజాస్వామిక యుగంలో అధికార పార్టీ అధినేత ఇంత బాహాటంగా మతయుద్ధాన్ని ప్రకటించినపుడు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాలి. కానీ, అలా జరగలేదు.

మనం తరచుగా పొరబడే పదాలు మతం, మతతత్వం. రెండూ వేరు. మతం ఒక సమూహపు విశ్వాసాల సమాహారం. మతతత్వం రెండు మత సమూహాల మధ్య సంబంధం. మనిషి పుట్టుకకు ముందు, చావు తరువాత ఉంటాయనుకునే వ్యవహారాల మీద విశ్వాసమే మతం. మతతత్వం ఇహలోక ప్రయోజనాల కోసం జరిపే సంఘటన. మతం భౌతిక జీవనానికి దూరంగా వుంటుంది. మతతత్వం భౌతిక సమాజంలోని వర్గవైరుధ్యాల పైన, వర్గ పాలన పైన ఆధారపడి వుంటుంది. ప్రతి మతం జాలి దయ నీతి న్యాయం త్యాగం ప్రేమ సౌభ్రాతృత్వం వంటి సాధారణ మానవీయ విలువలను బోధిస్తుంది. మతతత్వం పరమతస్థుల మీద ద్వేషాన్ని రగిలిస్తుంది. మతం అంతర్గత వ్యవహారం. మతతత్వం బాహ్యాత్మక వ్యవహారం. మతం నైతికం. మతతత్వం రాజకీయార్థికం. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం మతం ముసుగు కప్పుకున్న రాజకీయమే మతతత్వం.

దేశంలోని ప్రతి ఒక్కరూ గతంలోకన్నా మరింత స్పష్టంగా ఈ రెండు పదాల మధ్య తేడాను తెలుసుకోవాల్సిన సందర్భం ఇది. ఎందుకంటే భారతీయ జనతా పార్టి అధ్యక్షులు అమిత్ షా 2019 లోక్ సభ ఎన్నికల్ని మతయుద్ధం అని ప్రకటించారు. ఢిల్లీ రామ్ లీలా మైదానంలో ఇటీవల జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తూ వచ్చే సాధారణ ఎన్నికల్ని వారు మూడవ పానిపట్టు యుద్ధంతో పోల్చారు. ఓటమి అనేదే తెలియకుండా 131 వరుస యుద్ధాలను గెలిచిన మరాఠాలు ఆ ఒక్క యుద్ధంలో ఓడిపోయిన కారణంగా 'మనం' భారీ మూల్యాన్ని చెల్లించడమేగాక రెండు వందల సంవత్సరాలు వలస పాలనలో బానిసలుగా బతకాల్సి వచ్చిందన్నారు.

ఇంతకీ అమిత్ షా వర్తమాన రాజకీయాల్లోనికి మూడవ పానిపట్టు యుద్ధాన్ని ఎందుకు చర్చకు తెచ్చారూ? అన్నది ఎవరికైనా రావలసిన సందేహమే.

18వ శతాబ్దం ఆరంభంలో ఔరంగజేబ్ మరణం తరువాత భారత ఉపఖండంలో ఒకవైపు మొఘల్ సామ్రాజ్య పతనం, మరోవైపు పూణే రాజధానిగా పీష్వాల సామ్రాజ్య విస్తరణ ఆరంభమయ్యాయి. పీష్వా బాలాజీ బాజీ రావు హయంలో మరాఠా సామ్రాజం ఉత్తరాన సట్లెజ్ నది వరకు విస్తరించింది. మొఘల్ పాదుషా అలీ గోహర్ షా ఆలం – 2 ను దాదాపు ఢిల్లీ నగరానికే పరిమితం చేసేశారు. పర్షియన్ భాషలో 'సల్తనత్ ఏ షా ఆలం, అజ్ దిల్లి తా పాలెం' (షా ఆలం మహాసామ్రాజ్యం ఢిల్లీ నుండి పాలెం వరకు మాత్రమే) అంటూ హేళన చేసేవారు.

మరోవైపు, పీష్వా సామ్రాజ్య విస్తరణను రాజపుత్రులు, జాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ సేనాధిపతి సదాశివరావు భావు నాయకత్వంలోని పీష్వా బలగాలు ఓటమి అనేదే తెలియకుండా ఉత్తర దిక్కుకు సాగిపోయాయి. ఈ క్రమంలో వాళ్ళు ఆఫ్ఘన్ చక్రవర్తి అహమద్ షా అబ్దలి దుర్రానీ కుమారుడు తైమూర్ షాహ దుర్రాని సదొజయి ని లాహోర్ నుండి తరిమికొట్టారు. ఎదురులేని విజయోత్సాహంలో బాలాజీ బాజీ రావు కుమారుడు విశ్వాస్ రావును ఢిల్లీ చక్రవర్తిగా పట్టాభిషిక్తుడ్ని చేసేందుకు సన్నాహాలు మొదలెట్టారు సదాశివరావు భావు.

సరిగ్గా ఆసమయంలో అహమద్ షా అబ్దాలి దుర్రానీ తన కొడుక్కి పంజాబ్ లో జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికి సట్లెజ్ నదిని దాటి వచ్చాడు. రాజపుత్రులు, జాట్ లు దుర్రానీ సేనలకు అండగా నిలిచారు. భారత ఉపఖండ చరిత్రలో మూడు మహాయుద్ధాలకు రణక్షేత్రంగా పానిపట్టు నిలిచింది. 1526లో జరిగిన మొదటి పానిపట్టు యుద్ధంలో ఇబ్రాహీం లోడీ సేనల్ని బాబర్ జయించాడు. 1556లో జరిగిన రెండవ పానిపట్టు యుద్ధంలో హేమచంద్ర విక్రమాదిత్యుని సేనల్ని ఖాన్ జెమాన్, బైరామ్ ఖాన్ ల నాయకత్వంలోని అక్బర్ సైన్యం ఓడించింది. 1761 జనవరి 14న ఆరంభమయిన మూడవ పానిపట్టు యుద్ధంలో అహమద్ షా అబ్దాలి దుర్రానీ సేనలు పీష్వా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసి మరణశయ్య మీద వున్న మొఘల్ సామ్రాజ్యానికి కొంత ఊపిరిపోశాయి. ఒక అంచనాప్రకారం ఈ యుద్ధంలో ఇరుపక్షాల్లో దాదాపు లక్ష మంది సైనికులు, సైనికేతరులు చనిపోయారు. సేనాధిపతి సదాశివరావు భావు తోపాటు యువరాజు విశ్వాస్ రావు కూడా యుద్ధంలో తొలిరోజే నేలకొరిగారు.



ఉపఖండంలోని తూర్పు ప్రాంతంలో అప్పటికే ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన మొదలయిన రోజులవి. పశ్చిమ ప్రాంతంలో పీష్వాలు ఆస్వాదించిన 131 వరస విజయల ఉత్సాహం మొత్తం మూడవ పానిపట్టు యుద్ధం తొలి రోజే ఆవిరైపోయింది. పీష్వా సామ్రాజ్య పతనం ఆరంభమయింది. తరువాత, ఒకటవ మాధవ రావు కాలంలో కొంత పుంజుకున్నప్పటికీ రెండవ బాజీ రావు కాలంలో 1818లో జరిగిన భీమా కోరేగావ్ యుద్ధంతో పీష్వాల పాలన పూర్తిగా అంతరించిపోయింది. అలా అప్పుడు అంతరించిపోయిన పీష్వాల హిందుత్వ పాలనను 2014లో నరేంద్ర మోదీ పునరుద్ధరించారని సంఘపరివారం సగర్వంగా చెప్పుకుంటుంది.

భీమా కోరేగావ్ యుద్ధ ద్విశతాబ్ది విజయోత్సవాలు గత ఏడాది జనవరి 1న ఘనంగా జరిగాయి. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం సామాజికవర్గాలు, వామపక్ష పార్టీలకు చెందిన లక్షలాది కార్యకర్తలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంలో చేరిన దళితులు వీరోచిత పోరాటం చేసి పీష్వా సామ్రాజ్యాన్ని కూల్చివేశారనే వాస్తవాన్ని ఈతరంవాళ్ళకు తెలియకూడదనే అక్కసుతో పెత్తందారీ కులాలవాళ్ళు కోరేగావ్, పూణె పరిసర ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించారు. ఈ అల్లర్లలో అనేక గ్రామాలు ధ్వంసమయ్యాయి. అనేక మంది గాయపడ్డారు. కొందరు చనిపోయారు. అందరికీ తెలిసిన ఆ అల్లర్ల దోషుల్ని మహారాష్ట్ర ప్రభుత్వం స్వేచ్ఛగా వదిలి పెట్టి వరవరరావు తదితర ఆలోచనాపరులు, పౌరహక్కుల కార్యకర్తల మీద తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో పెట్టింది. బీఆర్ అంబేడ్కర్ మనుమరాలి భర్త ప్రొఫెసర్ ఆనంద్ తేల్తుంబ్డేను ఈ కేసులో కొత్త నిందితునిగా చేర్చి వేధింపులకు గురి చేస్తున్నారు. ఇవన్నీచూస్తున్న వారికి భీమా కోరేగావ్ యుద్ధం గతం కాదని అది వర్తమానమని సులువుగానే అర్థం అవుతుంది.

వర్తమానాన్ని గతం గానూ, గతాన్ని వర్తమానం గానూ మార్చడం సంఘపరివారానికి పుట్టుకతో అబ్బిన విద్య. అమిత్ షా అలాంటి దురాలోచనతోనే 2019 సాధారణ ఎన్నికల్ని మూడవ పానిపట్టు యుద్ధంతో పోల్చారు. లోక్ సభ ఎన్నికలు విరుద్ధ ధర్మాల మధ్య యుద్ధం అన్నారు.

అమిత్ షా మాటల అంతరార్థం ఏమంటే, నాటి మొఘలాయి సామ్రాజ్యం వున్నంత బలహీన స్థితిలో ఇప్పుడు నూట ముప్ఫయి యేళ్ళ వృద్ధ కాంగ్రెస్ పార్టీ వుంది. కొన ఊపిరితోవున్న షా ఆలం పాలనకు రాజపుత్రులు, జాట్ లు ఊపిరులూదినట్టు ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు రాహుల్ గాంధీకి దన్నుగా నిలుస్తున్నారు. చంద్రబాబు నాయుడు, ఎంకే స్టాలిన్, లాలూ ప్రసాద్ యాదవ్, శరద్ పవార్ తదితరుల్ని దృష్టిలో పెట్టుకుని వారు ఆ మాటలు అని వుంటారు. కాంగ్రెస్ కేంద్రంగా ఐక్యమవుతున్న ప్రజాకూటమి అహమద్ షా అబ్దాలి దుర్రానీ సేన అనేది వారి అన్వయం. 2019 ఎన్నికల్లో ఓడిపోతే 'మనం' మళ్ళీ రెండు వందల సంవత్సరాలు బానిసలై పోతామని అమిత్ షా గట్టిగా హెచ్చరించారు. వీటన్నింటి సారాంశం ఏమంటే ఎన్నికల రూపంలో హిందూఇస్లాం సమూహాల మధ్య మతయుద్ధం జరగబోతున్నదని వారు చెప్పదలిచారు.

ప్రజాస్వామిక సమాజంలో పార్లమెంటు ఎన్నికల్ని మధ్యయుగాల యుద్ధాలతో పోల్చడం పెద్ద తప్పు. వాటిని మతయుద్ధంగా వర్ణించడం అంతకన్నా మహా తప్పు. పార్టీ ఆధారిత పార్లమెంటరీ ప్రజాస్వామిక యుగంలో అధికార పార్టీ అధినేత ఇంత బాహాటంగా మతయుద్ధాన్ని ప్రకటించినపుడు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాలి. కానీ, అలా జరగలేదు. సుదీర్ఘ కాలపు నిరాశ నిస్పృహలు మనల్ని కుంగదీశాయి. మన చర్మం స్పర్శను కోల్పోయింది. మన కళ్ళు మూసుకుపోయాయి. మన మెదళ్ళు మొద్దుబారిపోయాయి.

'మనం ఎంత కాలం ఈ వైరుధ్యాల జీవితాన్ని కొనసాగిద్దాం? మన సాంఘిక, ఆర్థిక జీవితాల్లో సమానత్వాన్ని ఎంత కాలం నిరాకరిద్దాం? ఈ విలువల్ని దీర్ఘకాలం నిరాకరిస్తూ పోతే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మనమే ప్రమాదం లోనికి నెట్టినవాళ్లం అవుతాము. సాధ్యమైనంత త్వరగా మనం ఈ వైరుధ్యాల్ని తొలగించి తీరాలి. అలా చేయకపోతే, ఈరోజు ఈ రాజ్యాంగ పరిషత్తు ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సమాజంలోని అసమానత్వ బాధితులు అందరూ కలిసి పేల్చి వేస్తారు' అంటూ రాజ్యాంగ పరిషత్తు సమావేశాల చివరి రోజు (1949 నవంబర్ 25) వెలువరించిన ప్రసంగంలో అంబేద్కర్ మాటలు ఇప్పటికీ సజీవంగానే వున్నాయి.

■ డానీ
సీనియర్ జర్నలిస్టు,
ముస్లిం ఆలోచనాపరుల వేదిక కన్వీనర్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

స్ఫూర్తి

భర్త పోయిన మూడో రోజునే వ్యాపార పగ్గాలను చేపట్టిందామె. కొందరు ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటే, మరికొందరు ఆమె అవివేకానికి నవ్వుకున్నారు. ఇంకొందరు ఆమెకు అసలు బుద్ధే లేదు అన్నారు. ఇలాంటి స్పందనలకు చెక్ పెడుతూ, 'సీమత్తి' పట్టు చీరల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి తనేంటో నిరూపించుకుంది బీనా కణ్ణన్! పట్టుచీరల జగత్తులో సాగిన ఆమె జీవన ప్రయాణం ఇదే!





పట్టుదలే ఆమె పెట్టుబడి!

మా పూర్వీకులది ఆంధ్రప్రదేశ్. తమిళనాడుకు వలస తర్వాత కేరళలో స్థిరపడ్డారు. తాతయ్య వీరయ్య రెడ్డియార్ ప్రఖ్యాత 'సీమత్తి' సిల్క్స్ స్థాపకులు. ఆయన బాటలోనే నాన్న, భర్త కణ్ణన్ నడిచారు. అయితే తాతయ్య తదనంతరం సీమత్తికి ఆదరణ తగ్గింది. క్రమేపీ అంతరించిపోయే పరిస్థితికి చేరువైంది. తాతయ్య కలల పుత్రిక అలా కనుమరుగైపోవడం నాకు కష్టంగా అనిపించింది. నాన్న నిస్సహాయతతో కుంగిపోవడం చూసి తట్టుకోలేకపోయాను. క్రమక్రమంగా వ్యాపారం దిగజారి, కుటుంబం ఆర్థికంగా చితికిపోయే దశకు చేరుకుంది. అయితే సీమత్తి మీద ఉన్న ఆసక్తితో 1980లోనే కేరళలోని కొట్టాయంలో 'మైసెల్ఫ్' అనే బొటిక్ మొదలు పెట్టాను. అప్పటికి సల్వార్ కమీజ్‌ల ట్రెండ్‌కు ఆదరణ తక్కువ. దాంతో అంతంత మాత్రంగానే సాగేది. అలా కష్టాల్లో మునిగిన మా కుటుంబానికి మరో ఎదురు దెబ్బ తగిలింది. 1990లో మా వారు కణ్ణన్ హఠాత్తుగా కన్నుమూశారు. ఆయన మరణంతో సీమత్తి పూర్తిగా అంతరించిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ ఆయన పోయిన మూడో రోజునే వ్యాపార బాధ్యతలు అందుకున్నాను. నా చేతుల్లోకి చేరిన సీమత్తికి అంతం ఖాయం అనుకున్నారు చాలామంది. కానీ సీమత్తిని బతికించుకోవాలనే కోరిక బలంగా నన్ను ముందుకు నడిపించింది. పట్టు చరిత్ర గురించి సమూలంగా తెలుసుకున్నాను. దేశంలోని మూలమూలనా ఉన్న పట్టు వ్యాపారులతో స్నేహసంబంధాలు ఏర్పరుచుకున్నాను. కొత్త ట్రెండ్‌ల మీద దృష్టి పెట్టాను. నాదంటూ సరికొత్త ట్రెండ్ తయారీలో నిమగ్నమయ్యాను. నా కష్టం వృథా పోలేదు.

టెంపుల్ ఆఫ్ సిల్క్స్

నాణ్యమైన పట్టు చీరలు తయారు చేస్తే సరిపోదు. వాటిని కస్టమర్లకు అందించే పద్ధతి కూడా భేషుగ్గా ఉండాలని నమ్ముతాను. వరల్డ్ క్లాస్ షాపింగ్ అనుభవం అందించాలంటే ఏం చేయాలో, ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న ప్రముఖ దుకాణాలను సందర్శించి తెలుసుకున్నాను. అవసరమైన అంశాలను, కేరళ, అలెప్పిలోని నాలుగు అంతస్తుల సీమత్తి దుకాణంలో అనుసరించాను. సీమత్తి స్టోర్ నిర్మాణానికి నాన్నకు తొమ్మిదేళ్లు పట్టింది. ఆ శ్రమకు నా శ్రమ జోడించి, కొత్త రూపమిచ్చాను. కస్టమర్ల తాకిడి పెరిగింది. వ్యాపారం పుంజుకుంది. దాంతో అలెప్పిలోని స్టోర్ స్వయంగా చూసుకుంటూనే, కేరళ రాష్ట్రవ్యాప్తంగా మరో 10 సీమత్తి స్టోర్లను నెలకొల్పాను. మా స్టోర్‌లలో 'క్వీన్స్ ఓన్' అనే బ్రైడల్ కలెక్షన్లతోపాటు, పిల్లల కోసం 'కిడ్స్ స్టూడియో', 16 ప్లస్ అండ్ మెన్స్ స్టూడియో...ఇలా కుటుంబానికంతటికీ అవసరమైన వస్త్రశ్రేణి ఉంటాయి. వీటికితోడు 2005 నుంచి ప్రతి ఏటా 3 బ్రైడల్ శారీ లైన్స్ మార్కెట్లోకి ప్రవేశ పెడుతున్నాను. కొత్త ట్రెండ్ సృష్టించగలిగితేనే మార్కెట్లో కలకాలం మనుగడ సాగించగలుగుతాం! అందుకోసమే ఈ ప్రయత్నం!

SEEMATTI
The Queen of silks

గిన్నిస్‌బుక్‌లోకి...

2006లో 500 మీటర్ల పొడవైన హ్యాండ్ వీవెన్ సిల్క్ చీర తయారు చేశాను. ఆ ప్రయత్నంతో సీమత్తి పేరు గిన్నిస్, లిమ్కా బుక్‌లలోకి ఎక్కింది. చీర మీద జరీతో ప్రధాని మోదీ ప్రతిమను ఆవిష్కరించి, ఆయన మన్ననలూ అందుకున్నాను. నా చీరల షో స్టాపర్లు, అంబాసిడర్లు అందరూ ప్రముఖులే! 2006 నుంచి 2015 వరకూ నేను డిజైన్ చేసిన దుస్తులకు మందిరా బేడీ, ఊర్మిళా మటోండ్కర్, స్నేహ, దీపికా పదుకొనె, జాక్వలిన్ ఫెర్నాండెజ్, లీసా హైడెన్, సమీరా రెడ్డి, సోనాలి బెంద్రె... మొదలైన సెలబ్రిటీలు షో స్టాపర్లుగా వర్క్ చేశారు.



నాట్యం నా అభిరుచి

నచ్చినది నేర్చుకుని సాధన చేయడానికి వయసుతో పని లేదు. ఇప్పుడు నా వయసు 58 ఏళ్లు. నా 42వ ఏట భరత నాట్యం నేర్చుకుని అరంగేట్రం చేశాను. తర్వాత మూడు నాట్య ప్రదర్శనలు కూడా ఇచ్చాను. తీరిక దొరికితే దూరప్రాంతాలకు వెళ్తాను. కొంతకాలం క్రితం ఒక్కదాన్నే మాస్కో వెళ్లి సెలవులు గడిపి వచ్చాను. గౌత్మంద్, విష్ణు, తుషార నా పిల్లలు. వీళ్లతో గడపడం, సీమత్తి వ్యాపారం చూసుకోవడం, పెయింటింగ్, డాన్స్... ఇవే నా ప్రపంచం. కొత్త డిజైన్లను సృష్టించడం, మార్కెట్లో వాటికి దక్కే ఆదరణను గమనించడం, అందుకు వస్త్రశ్రేణిలో అనుసరించిన పద్ధతులను గుర్తించి, వాటిని మరింత పెంపొందించడం... ఇదంతా నాకు ఎంతో ఇష్టమైన పని. అందుకేనేమో 'సీమత్తి' నాకు ఓ వస్త్ర వ్యాపారంలా అనిపించదు. 'విజయం వెంట పరుగులు పెట్టొద్దు. చేసే పని పట్ల ఇష్టం ఉంటే, విజయం దానంతటదే వరిస్తుంది'. నేను ఈ జీవిత సూత్రాన్నే నమ్ముతాను. నేటి యువ మహిళా వ్యాపారవేత్తలకు నేనిచ్చే సలహా ఇదే!

ఇలా చేయండి



ఇంటి కూరగాయలు!

కిచెన్ గార్డెనింగ్‌పై ఈ మధ్య ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. వంటకి సరిపడా కూరగాయలు, ఆకుకూరలు ఎంచక్కా ఇంటి వద్దనే పండించుకోవచ్చు. కిచెన్ గార్డెన్‌తో ఆరోగ్యానికి ఆరోగ్యమే కాదు డబ్బు కూడా ఆదా అవుతుంది. మొక్కల ఎంపిక, పెంపకం విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దీని నిర్వహణ ఏమంత కష్టమేం కాదు.

- నాణ్యమైన విత్తనాలను ఎంచుకుంటే పంట చక్కగా వస్తుంది. సీజన్‌కు తగ్గ కూరగాయల మొక్కల్ని పెంచడం తెలివైన నిర్ణయం. టొమాటో, పచ్చిమిర్చి, బెండకాయ, బీన్స్ వంటివి పండించడం సులువు. తొందరగా చేతికొస్తాయి కూడా.
- సేంద్రియ ఎరువు కలిపిన మట్టి మార్కెట్లో లభిస్తుంది. హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ వారు అందించే మట్టి కూడా మొక్కల పెంపకానికి అనువుగా ఉంటుంది. లేదంటే నర్సరీల్లో లభించే కూరగాయ మొక్కల్ని తెచ్చుకొని ఇంట్లో పెంచుకోవచ్చు.
- ప్లాస్టిక్ కుండీలు మట్టితో చేసిన, టెర్రాకోట కుండీల కన్నా తేలికగా ఉంటాయి. తేమను ఎక్కువ సమయం మొక్కకు అందేలా చూస్తాయి. తేమ తక్కువ అవసరమైన మొక్కలను మట్టి కుండీల్లో పెంచవచ్చు.
- విత్తనం దశ నుంచి మొక్కగా ఎదిగేంత వరకూ సూర్యరశ్మి ఎంతో అవసరం. వెలుతురు తగిలితే మొక్కలు తొందరగా పెరుగుతాయి. ఆరోగ్యంగానూ ఉంటాయి.
- విత్తనాలు మొలకెత్తేందుకు తేమ అవసరం. విత్తనాలు చల్లిన కుండీలో నీళ్లు పోయాలి. అలాగనీ కుండీలను నీటితో నింపేయొద్దు. నీళ్లు ఎక్కువైతే మొలక బతకదు.
- మొక్కలపై దాడిచేసే క్రిమికీటకాలను చంపేందుకు రసాయన ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడాలి.
- కూరగాయల తొక్కలు, మిగిలిపోయిన టీ, కాఫీ వేస్ట్‌తో ఇంట్లోనే కంపోస్ట్ ఎరువు తయారు చేసుకోవడం మంచిది.

లీగల్ కౌన్సెలింగ్

గిఫ్ట్ డీడ్ రద్దు చేయొచ్చా?


మాకు సంతానం లేదు. వయసు మీద పడడంతో చరమాంకంలో రక్షణ కావాలనుకున్నాం. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో మాకున్న భవంతిని మా మేనల్లుడికి గిఫ్ట్ డీడ్ రాసి రిజిస్ట్రేషన్ చేసిచ్చాం. మేము బతికి ఉన్నంత కాలం మా యోగ క్షేమాలు చూసే షరతు పెట్టాం. అయితే ఆరు మాసాల దాకా మా బాగోగులు చూసి, ఆ తర్వాత పట్టించుకోవడం మానేశాడు. ఏడాది



క్రితం నా భర్త పోయాడు. ఆ సమయంలో అంతిమ సంస్కారానికీ, దశదిన కర్మకు వచ్చి వెళ్లాడే తప్ప మళ్లీ కనపడలేదు. అప్పటి నుంచి బిక్కుబిక్కుమంటూ నా ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నా. మేనల్లుడు కదా అని నమ్మాను కానీ, లేదంటే, మరెవరికైనా రాసి ఇచ్చేదాన్ని. ఏమైనా ఇలాంటి వాడికి ఆస్తి కట్టబెట్టడం అనవసరం అనిపించింది. అందుకే, అతనికి రాసిచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయమంటూ, సివిల్‌కోర్టులో దావా వేశా. అయితే, గిఫ్ట్ డీడ్ రాసిచ్చిన తర్వాత క్యాన్సిలేషన్ చేయడానికి వీల్లేదంటూ మా మేనల్లుడు కోర్టులో కేసు వేశాడు. అనుకున్న షరతుల పట్ల నిబద్ధతగా లేని అతనికి నా ఆస్తి పైన హక్కులు ఎలా వస్తాయో అర్థం కావడం లేదు. కోర్టు తీర్పు నాకు అనుకూలంగా వస్తుందా... లేదా? ఈ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమైనా ఉంటే తెలియచేయండి.

- పి. రామలక్ష్మి, హైదరాబాద్

మీరు ఇంటిని గిఫ్ట్‌డీడ్‌గా రాసి ఇచ్చినా, ఇంకా మీరు అదే ఇంట్లో ఉంటున్నారు కాబట్టి, ఆ గిఫ్ట్ డీడ్ ఒప్పందం పూర్తి అయినట్లు కాదు. అందువల్ల అది అమల్లోకి వచ్చినట్లు కాదు. ఆ స్థితిలో ఆ గిఫ్ట్ డీడ్‌ను క్యాన్సిల్ చేసుకునే అధికారం మీకుంటుంది. గిఫ్ట్‌డీడ్‌లో ఏ రకమైన షరతులూ ఉండకూడదు. మీరు ఆ గిఫ్ట్‌డీడ్‌ను కొన్ని షరతులు పెట్టి రాసి ఇచ్చారు కాబట్టి అది చట్టపరంగా చెల్లదు. ఏ రకంగా చూసినా గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసుకునే అధికారం మీకుంది. అతడు మీ పట్ల దౌర్జన్యం చేస్తాడేమో అనే అనుమానం ఉంటే, మీ ఇంట్లోకే ప్రవేశించకుండా కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డర్ తీసుకోవచ్చు. తర్వాత మళ్లీ ఎప్పుడైనా ఆస్తిని ఎవరికైనా రాసివ్వాలంటే, గిఫ్ట్ డీడ్ రాసివ్వాలనేమీ లేదు. విల్‌డీడ్ (వీలునామా) రాసి ఇవ్వవచ్చు. దీనికి ఇద్దరు సాక్షుల సంతకం తీసుకుంటే సరిపోతుంది. దాన్ని రిజిస్ట్రేషన్ చేయించాల్సిన అవసరం కూడా లేదు. విల్‌డీడ్‌లో ఆస్తి అతనికి అందడానికి మీరు ఎన్ని షరతులైనా విధించవచ్చు. మీ అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే, అప్పుడు కూడా రద్దు చేసుకునే అధికారం మీకు పూర్తిగా ఉంటుంది.



- టి.ఎల్.నయన్ కుమార్
న్యాయవాది, హైదరాబాద్

స్మృతి



అమ్మ... నాకు వరం! పూజాఫలం!

- ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం

మా నాన్న నాకు దేవుడు ఇచ్చిన గొప్ప స్నేహితుడైతే, మా అమ్మ శకుంతలమ్మ నాకు అటూ ఇటుగా ఆయన ఇచ్చిన వరం, పూజా ఫలం. నాన్న కట్టిన ఇల్లు... తను మెట్టిన ఇల్లు... తన అంతఃపురంగా, నాన్న జీవిస్తున్న దేవళంగా భావించి, చివరి వరకూ మరోచోటికి కదలని అమ్మకు ఈ స్మృతి పూజాపుష్పం.

మా నాన్న శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారు. నాన్న గారి మొదటి భార్య, మా పెద్దమ్మ వెంకట సుబ్బమ్మ హఠాన్మరణం ఆయనకు అశనిపాతంలా తగిలింది. మా అక్కయ్య విజయలక్ష్మి, మా అన్నయ్య లింగమూర్తిలను పెంచే బాధ్యతను నెత్తిమీద వేసుకొని, (అప్పటికి వాళ్ళకు ఆరేళ్ళు, నాలుగేళ్ళుట) నాన్న వైరాగ్యంతో శిష్య సంచారం బయలుదేరారు. ఆ సందర్భంలో అప్పటి చిత్తూరు జిల్లా రంగేపల్లికి 'సంచారం' వచ్చారు నాన్నగారు. ఉండడానికి ఆ ఊళ్ళో బ్రాహ్మల ఇల్లు లేకపోతే, పక్క ఊరైన కోనేటంపేటలో ఒకే ఒక బ్రాహ్మలకుటుంబం ఆత్మకూరు రామారావుగారి నీడన పంచ దొరికింది. రామారావు గారికి నలుగురు సంతానం... నారాయణరావ్, శకుంతలమ్మ, కనకమ్మ, శ్రీనివాసరావ్. శకుంతలమ్మకు 14 ఎళ్ళు. ఇద్దరు పిల్లలతో మా నాన్నగారి యాతన చూడలేక... రామారావుగారు, వారి ధర్మపత్ని రాజమ్మ పెద్ద మనసుతో నాన్నగారిని కష్టం మీద ఒప్పించి, శకుంతలమ్మను ఇచ్చి పెళ్ళిచేశారు. అప్పటికి మా నాన్నగారి వయసు 35 పైనే! ఆ శకుంతలమ్మే మా అమ్మ!!

అమ్మ... అపర దేవత

తరువాత మా అమ్మకు మేము ముగ్గురు అబ్బాయిలం, నలుగురు అమ్మాయిలూను! నేను పెద్దవాణ్ణి. నా తరువాత పుట్టిన తమ్ముడు 3 ఏళ్ళ వయసులో పోయాడు. నాకు 13 ఏళ్ళు వచ్చేవరకూ మా అక్కా, అన్నా... మా పెద్దమ్మ పిల్లలని తెలీదు! నాకే కాదు, చాలామందికి తెలీదు! అది మా అక్కయ్యా, అన్నయ్యా కూడా మరచిపోయారంటే, కారణం మా అమ్మ పెంపకం! చాలా పెద్ద మనసు మా అమ్మది. ఈ రోజుకీ మా బంధువుల్లో చాలామంది అంటూ ఉంటారు "చిన్నమ్మ (మా అమ్మ ముద్దు పేరు) దేవత. ఈ రోజుల్లో సవతి పిల్లల్ని ఎవరు ఇలా సాకుతారు?" అని.

కుటుంబ భారమంతా అమ్మదే!

అమ్మకు పెళ్ళి కాగానే నాన్న నెల్లూరు వచ్చి స్థిరపడ్డారు. ఆయన సొంత ఊరు కందులూరు తాలూకా, మాచవరం. సంగీతం పట్ల మక్కువతో హరికథను జీవనాధారంగా ఆయన స్వీకరించారు. ఎవరింట్లో అయినా పెళ్ళికీ, లేకుంటే మరొకరింట్లో ఎవరైనా చనిపోతే క్రతువు రోజునా హరికథ పెట్టించడం ఆనవాయితీ. ఇదీగాక శ్రీరామనవమీ, దసరా లాంటి పండుగ రోజులు వస్తేనే మా నాన్నగారికి పని! ఓ రాత్రంతా హరికథ చెబితే 75 నుంచి 100 రూపాయల కట్నం. ఆ డబ్బు అమ్మకు ఇచ్చేవారు నాన్న. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించే భారమంతా అమ్మదే! గుట్టుగా సంసారం నెట్టుకొచ్చింది. ...పసితనంలో ఏవేవో కోరికలతో అత్తవారింటికి వచ్చే కోడలికి ఉండవలసిన వాతావరణం కాదది! అయినా మాట పడకుండా నిర్వహించింది అమ్మ.

చేంతాడుతో బావిలో దించేసింది!

నేనంటే అందరికీ గారాబమే. కాస్త పోకిరీగానే పెరిగాను... ఒకసారైతే అమ్మకు కోపం వచ్చి నాకు చేంతాడు కట్టి బావిలో దించింది! ఎంత ఇబ్బంది పెడితే సొంత బిడ్డ నయిన నా మీద అంత కోపం చూపించుంటుందీ? మా నాన్న ఏం చేస్తున్నారో, ఎంత సంపాదిస్తారో ఆ వయసులో నాకేం తెలుసు? అడిగింది ఇవ్వాల్సిందే! లేకుంటే యాగీ! రోజూ ఏదోలా అమ్మను రాపాడేవాణ్ణి. ఇప్పుడు అనుకుంటే కష్టమేస్తుంది. నాకు తీపి ఇష్టం. తాతయ్యలూ, మావయ్యలూ ఎప్పుడు వచ్చినా జాంగ్రీ, పాలకోవా తెచ్చేవాళ్ళు. "కడుపు నొప్పి వస్తుందిరా" అంటూనే అంతా నాకే పెట్టేది!

నన్ను సహించి... భరించి...

ఎప్పుడైనా రాత్రి నేను అలిగి పడుకున్నట్టు నటిస్తే, అమ్మ నా కాళ్ళు పిసికేది. వంట అమ్మే చేసేది. నాన్న కూరలు తరిగేవారు. విస్తళ్ళు కుట్టేవారు. ఏమీ పట్టించుకునే వారు కాదు. స్నేహితులతో పురాణ కాలక్షేపం, కొత్త హరికథలు తయారు చేసుకోవడం, అడపా దడపా నాటకాలు ఆడడం (రామదాసు, చిత్రనళీయం గుర్తు). 'రామదాసు'లో రఘురాముడి వేషం వేశా. నాటకం వేశాక, వేకువజామున నిద్రకళ్ళతో ఇంటికి వస్తే, అమ్మ దిష్టి తీయడం బాగా గుర్తు. ఆరేళ్ళు వచ్చేదాకా నేను బడికి వెళ్ళలేదు. మా ఇంటి ఎదురుగా ఉన్న 'ఆంజనేయ విద్యాలయం' అనే ఎలిమెంటరీ స్కూల్లో అక్కయ్య సాయంతో అమ్మ నన్ను బలవంతంగా ఎత్తుకుపోయి పడేసింది. అరగంటలో ఇంటికి వచ్చేసేవాణ్ణి. ముందు బుజ్జగించేది. మొరాయిస్తే అట్లకాడతో బెదిరించి, బడికి పంపేది. స్కూల్లో అన్నీ డబుల్ ప్రమోషన్లే! అమ్మ నిశ్శబ్దంగా ముచ్చటపడేది. ...అమ్మమ్మగారి ఊరు కోనేటంపేటకు నాన్న కొన్నాళ్ళు మకాం మార్చారు. అక్కడికి 8మైళ్ళ దూరంలో నగరి హైస్కూల్లో థర్డుఫారంలో చేర్చారు. మా చిన్న మేనమామ శ్రీనివాసరావ్ ఇంట్లో నా మకాం. అప్పుడే రాధాపతి అయ్యవారి దగ్గర ట్యూషన్‌కు చేరా. అమ్మ మీద బెంగ. రెండు రోజులకు ఒకసారి ఏదో సాకుతో కోనేటంపేట వెళ్ళిపోయేవాణ్ణి. ఎన్నాళ్ళని అత్తవారింట్లో ఉంటామని నాన్న మద్రాసులో మా అమ్మ మేనమామ గారింటికి మకాం మార్చారు. ఆచారప్పన్ వీధిలో వైశ్యులు నాన్న చేత 40 రోజులు రామాయణం చెప్పించారు. రోజూ వచ్చే హారతి పళ్ళెం డబ్బులే ఆధారం. వారం రోజులకు ఒకసారి ఏడ్చీ, మారాం చేసీ అమ్మను చూడాలని తాతయ్యతో మద్రాసు వచ్చేవాణ్ణి. ఒకరోజు అమ్మ ఒళ్ళో పడుకోబెట్టుకొని, "నాన్న కష్టపడుతున్నారు. పరాయి ఇంట్లో ఉంటున్నాం. చదువుకోమంటే మాటిమాటికీ వచ్చేస్తే ఎలా" అని బుజ్జగించేది.

ఎంత సంబరపడిపోయిందో!

అవి గడ్డు రోజులు. ట్యూషన్‌కు నెలకు 10 రూపాయలు ఇవ్వడానికి నాన్న చాలా కష్టపడేవారు. డబ్బులు లేనప్పుడు, పదీ పరకా అప్పు కోసం స్నేహితుల దగ్గరకు నన్నే పంపేవారు. అప్పటికే చెల్లెళ్ళు గిరిజా, పార్వతీ, తమ్ముడు జగదీశ్ పుట్టారు. గిరిజ పుట్టినప్పుడు అమ్మకు పునర్జన్మే! నేను కాళహస్తిలో చదువుతున్నప్పుడు, బొంబాయి ఎక్స్‌కర్షన్‌కు వెళ్తున్నారు. 30 రూపాయలు కట్టాలి. అమ్మ తిట్టింది- "నాన్న కష్టపడుతూ ఉంటే 30 రూపాయలు వృథా చేయాలా?" అని. నాన్న నానాయాతనా పడి బొంబాయికి పంపారు. 30 రూపాయల్లో కొంత ఆదా చేసి, చెల్లెళ్ళిద్దరికీ రెండు గౌన్లు తెచ్చాను. అమ్మ కోపమంతా పోయి, ముద్దు పెట్టుకుంది...

అదే... అమ్మకు లోపల బెంగ!

తిరుపతిలో పి.యు.సి. చదువుతూ కూడా శుక్రవారం సాయంత్రానికల్లా నెల్లూరులో అమ్మ చేతిబువ్వకు హాజరైపోయేవాణ్ణి. ఆ అలవాటే... అనంతపురంలో ఇంజనీరింగ్‌లో చేరిన తరువాతా నడిచింది. చదువు మానేసి, ఒక శుభరాత్రి నెల్లూరులో దిగా. అమ్మ తిట్టినతిట్లు అన్నీ ఇన్నీ కావు. "నాన్న కష్టం తెలీని నువ్వేం కొడుకువురా?" అంది. అమ్మ లేకుండా ఉండలేను. నాన్నను ఇబ్బంది పెట్టలేను. చదువు పోయిన ఆ సంవత్సరం నుంచే సంగీతం మీద ఇంట్రస్టు పెరిగింది. చిన్నాచితకా కచ్చేరీలు చేసేవాణ్ణి. ప్రైజులొచ్చేవి. లోలోపల మురిసినా, నాన్న చేతికి అందిరాలేకపోతున్నాననే బాధను కోపం రూపంలో నా మీద అమ్మ చూపించేది.

...బావ పోయాక అక్క ఇంటికి వచ్చింది. అమ్మకు అన్నీ మానసిక ఇబ్బందులే! అన్నయ్యకు పెళ్ళయింది. సొంత కొడుకు కన్నా అబ్బురంగా అమ్మ ఆ పెళ్ళి చేసింది. నేను సినిమాల్లో పాడానన్న సంతోషం పంచుకోక ముందే అన్నయ్య పోయాడు. మళ్ళీ సమ్మెట దెబ్బ! ఎ.ఎం.ఐ.ఇ కూడా పూర్తి చేయకుండా, పాటలు పాడుతూ చెడిపోతానేమోనని అమ్మ లోలోపలే బెంగ పడేది. ...అన్నీ చక్కబడుతున్నాయనీ, నేను పైకి వస్తున్నాననీ, డబ్బు పంపుతున్నాననీ అమ్మ సంతోషపడుతున్నప్పుడే - నేను ఎవరికీ ఇష్టంలేని పెళ్ళి చేసుకున్నా. అమ్మ మరీ డీలా పడిపోయింది. నన్ను ఇంటికి రావద్దంది. తనూ మద్రాసుకు రాలేదు. నాన్న కుంగిపోయారు. జీవితంలో దెబ్బ మీద దెబ్బ తిన్న నాన్నకు నైతిక మద్దతు అమ్మ ఎలా నిభాయించిందో! మా పెద్దమ్మాయి పల్లవి పుట్టగానే అన్నీ సర్దుకున్నాయి. తరువాత అమ్మకు ఏ కష్టమూ రాకుండా చూసుకున్నా. చెల్లెళ్ళిద్దరికీ, అన్నయ్య కూతురికీ పెళ్ళి చేశా. ...నాకు డాక్టరేట్ వచ్చినప్పుడు, ఆ సభకు వచ్చి అమ్మ ఎంత సంబరపడిపోయిందో!

అమ్మ ఏడాదిలో నాలుగు నెలలు నా దగ్గర ఉంటుంది. మిగతా కాలమంతా త్యాగరాజ భిక్షువు (మా నాన్న) ఆత్మ సమక్షంలో! ఆయన దేవళం, మా ఇంట్లో- నెల్లూరులోనే, మా అక్కయ్యతో కలిసి ఉంటుంది. "మణీ! పని తగ్గించుకోరా! టీవీలో, సినిమాల్లో తరచుగా కనబడకు. దిష్టి తగులుతుంది" అంటుంది. అందరితో గర్వంగా "మా మణి సార్థకనామధేయుడు" అంటుంది. మా నాన్న నాకు దేవుడు ఇచ్చిన గొప్ప స్నేహితుడైతే, మా అమ్మ నాకు అటూ ఇటుగా ఆయన ఇచ్చిన వరం, పూజాఫలం. ఊహ తెలియని వయసులో రెండో పెళ్ళికి తలవంచి, ఈ రోజువరకూ ఎవరినీ తల వంచుకోకుండా కాపు కాసిన మా అమ్మ నా శ్రుతీ, నా పాటా, నా లయా! అమ్మా! నీకు జేజేలు.

(తల్లి శకుంతలమ్మతో అనుబంధం గురించి గాయకుడు ఎస్పీబీ గతంలో రాసిన వ్యాసం నుంచి కొన్ని భాగాలు)

"అమ్మ జాగ్రత్తరా..." అన్నారు!



సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులతో ఎస్పీబీ కుటుంబం

అమ్మ పెళ్ళిళ్ళ పేరమ్మ. బంధువుల, స్నేహితుల ఇళ్ళలో ఎందరికి సంబంధాలు కుదిర్చిందో! అది ఆమెకు హాబీ. నాన్న 19 ఏళ్ళు ఉంఛవృత్తి చేసి నెల్లూరులో త్యాగరాజ ఆరాధనోత్సవాలు చేశారు. మొదటి భిక్ష అమ్మే పెట్టాలి. ఆ తర్వాతే నాన్న 'మనసా ఎటులోర్తునే' కీర్తన పాడుతూ, వీధి వీధీ తిరిగి భిక్ష స్వీకరించేవారు. సింహపురీయులకు ప్రతి సంవత్సరం సంగీత సంతర్పణ చేశారు. అనుకోనివిధంగా మూడు మాసాల సుస్తీతో నాన్న కన్నుమూశారు. నాకు మంచి స్నేహితుడూ, అమ్మకు దైవం... ఇక లేరని ఊహించలేని పరిస్థితి! ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చివరి క్షణంలో అమ్మను నేను లోపలికి తీసుకువెళ్లలేదు- నాన్నను ఆ పరిస్థితుల్లో చూడలేదని! ఐ.సి.యు.లో నాన్న నా చెయ్యి పట్టుకొని, "నాన్నా! అమ్మ జాగ్రత్తరా!" అన్నారే తప్ప మారుమాట లేదు. చివరి క్షణంలో నాన్నను చూపనందుకు ఇప్పటికీ అమ్మ నన్ను క్షమించదు. నేను పాడడం మొదలుపెట్టిన కొత్తలో, నెల్లూరులో కచ్చేరీ చేస్తూ ఉంటే అమ్మ చూడడానికి వచ్చింది. శ్రోతలెవరో "ఏం పాడుతున్నాడురా!" అంటూ అభ్యంతరకరమైన మాట ఒకటి జోడించారు. అది విని అమ్మ ఇంటికి వచ్చేసింది. ఇప్పటికీ "మణెయ్యా! నీ కచ్చేరీకి నేను రానురా! అభిమానంతోనైనా వాళ్ళలా అంటూ ఉంటే వినలేను" అంటుంది. వారం వారం ఫోన్ చేసి, "మణికీ, చరణ్‌కీ దిష్టి తీస్తున్నావా?" అని మా ఆవిడను అడుగుతుంది.

నవ్య ఆంధ్రజ్యోతి డాక్టర్
6 మంగళవారం • 5 ఫిబ్రవరి 2019



పక్క తడిపితే?

'బడికెళ్లే ఈడొచ్చింది! పక్క తడపడానికి సిగ్గుగా లేదూ? ఇంకోసారి ఇలా చేస్తే ఏం చేస్తానో చూడు!'

పిల్లలున్న ప్రతి ఇంట్లో వినిపించే బెదిరింపే ఇది!

కానీ, పక్క తడిపే అలవాటు అనారోగ్య లక్షణమా?

లేక సహజసిద్ధమైన అలవాటా?

దీన్ని ఎప్పుడు సమస్యగా భావించాలి?

పసివయసులో మూత్రం మీద నియంత్రణ ఉండదు. మరీ ముఖ్యంగా నిద్రించే సమయంలో పిల్లలు పక్క తడిపేస్తూ ఉంటారు. ఇలా చేయడాన్ని వాళ్లు తప్పుగా కూడా భావించరు. కానీ ఈ లక్షణం ఐదు నుంచి ఏడేళ్ల లోపు వరకూ కొనసాగితే ఫర్వాలేదు. 10% మంది పిల్లలు ఐదేళ్ల తర్వాత కూడా పక్క తడుపుతూ ఉంటారు. వయసుతోపాటు ఈ అలవాటు కూడా తగ్గుతూ పదేళ్ల వయసొచ్చేసరికి 5% మాత్రమే ఉంటుంది. అది కూడా క్రమేపీ తగ్గిపోతుంది. అయితే కొందరు పిల్లల్లో పదో ఏట వరకూ కూడా కొనసాగవచ్చు. అరుదుగా కొందరు పిల్లలు యుక్త వయసులో కూడా పక్క తడుపుతూ ఉంటారు. అయితే ఈ లక్షణం స్వతహాగా అబ్బినదా? లేక అంతర్లీన ఆరోగ్య సమస్యలకు సూచనా? అనేది గమనించాలి. బెడ్ వెట్టింగ్‌ను ప్రైమరీ, సెకండరీ అని రెండు రకాలుగా వర్గీకరించారు వైద్యులు! రెండిట్లోనూ పక్క తడిపే లక్షణం ఉన్నా, రెండిటి మధ్యా కారణాల్లో వైరుధ్యం ఉంటుంది.

పిల్లలే కాదు... పెద్దలు కూడా!

ప్రతి ఒక్కరికీ పెరిగి పెద్దయ్యాక కూడా బెడ్ వెట్టింగ్ అనుభవం కలుగుతుంది. ఇది అత్యంత సహజం. అరుదుగా జరిగే ఈ చర్యకు కంగారు పడవలసిన అవసరం లేదు. గాఢ నిద్రలో ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది.

ప్రైమరీ బెడ్ వెట్టింగ్

పుట్టింది మొదలు ఐదు, ఏడు, పది ఏళ్ల వరకూ కనిపిస్తూ, వయసుతోపాటు తీవ్రత తగ్గిపోతూ ఉంటే ఆ లక్షణాన్ని ప్రైమరీ బెడ్ వెట్టింగ్‌గా భావించాలి. ఇది అనారోగ్య లక్షణం కాదు. 99% పక్క తడిపే పిల్లలు ఈ కోవకు చెందినవారే! కొందరిలో కేవలం హార్మోన్ అసమతుల్యత మూలంగా ఏడేళ్లు దాటినా ఈ ఇబ్బంది కొనసాగుతూ ఉండవచ్చు. ఇది కూడా ఎలాంటి వ్యాధి లక్షణం కాదు. ఇందుకు కారణం మూత్రాన్ని నియంత్రించే 'యాంటీ డయూరిటిక్ హార్మోన్' రాత్రివేళ తగినంత లెవెల్‌కు చేరుకోకపోవడమే! పుట్టిన ఐదేళ్లలోగా ఈ హార్మోన్ సరిపడా స్థాయికి చేరుకుంటుంది. కానీ కొందరు పిల్లల్లో 7, 10, 15 ఏళ్ల వయసుకు చేరుకున్నా హార్మోన్ సరైన స్థాయికి చేరుకోదు. ఇలాంటప్పుడు రాత్రివేళ నిద్రలోనే మూత్రవిసర్జన జరుగుతూ ఉంటుంది.

సెకండరీ బెడ్ వెట్టింగ్


ఐదు లేదా ఏడేళ్ల తర్వాత కొన్ని రోజులు లేదా ఏళ్లపాటు పక్క తడపకుండా తిరిగి బెడ్ వెట్టింగ్ అవుతూ ఉంటే, దాన్ని సెకండరీ బెడ్ వెట్టింగ్‌గా భావించాలి. ఈ కోవకు చెందిన పిల్లలకు పగటి వేళలో కూడా తమకు తెలియకుండానే మూత్ర విసర్జన జరిగిపోతూ ఉండే అవకాశం ఉంది. దీనికి ఆరోగ్యపరమైన అంతర్లీన కారణాలు ఉండవచ్చు. వాటిని కనిపెట్టి చక్కదిద్దగలిగితే పరిస్థితి అదుపులోకి వస్తుంది. అయితే ప్రైమరీ, సెకండరీ... ఈ రెండిట్లో అసలు కారణాన్ని కనిపెట్టాలంటే, ముందుగా సెకండరీ బెడ్ వెట్టింగ్‌కు కారణమయ్యే అంశాలను గమనించాలి. అవేవీ కారణాలు కావని నిర్ధారణ అయిన తర్వాతే ప్రైమరీ రీజన్‌గా భావించి తదనుగుణంగా కొనసాగాలి. సెకండరీ బెడ్ వెట్టింగ్‌కు ప్రధాన కారణాలు ఇవే!

- **చిన్న మూత్రాశయం:** కొందరు పిల్లల్లో పుట్టుకతోనే మూత్రాశయం చిన్నదిగా ఉంటుంది. దాంతో అది త్వరత్వరగా నిండిపోతూ ఈ ఇబ్బందిని కలిగిస్తూ ఉంటుంది.
- **ఓవర్ యాక్టివ్ బ్లాడర్:** కొందరు పిల్లల్లో మూత్రాశయం కదలికలు తీవ్రంగా ఉంటాయి. ఈ కారణం వల్ల కూడా మూత్రవిసర్జన జరిగిపోతూ ఉంటుంది.
- **మూత్రపిండాల్లో రాళ్లు:** మూత్రాశయంలో రాళ్లు ఉన్నా ఈ సమస్య సమసిపోకుండా కొనసాగుతూ ఉండవచ్చు.
- **యూరినరీ ఇన్‌ఫెక్షన్:** తరచుగా తలెత్తే మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా మూత్రం లీక్ అవుతూ ఉండవచ్చు.
- **మలబద్ధకం:** మలబద్ధకం వల్ల మలం గట్టిపడి మూత్రాశయం మీద ఒత్తిడి కలిగిస్తూ ఉండడం మూలంగా కూడా ఈ సమస్య కొనసాగుతూ ఉండవచ్చు.
- మధుమేహం ఉన్నా మూత్రం అతిగా తయారవుతుంది. కాబట్టి మధుమేహం ఉందేమో పరీక్షించాలి.

చికిత్స తేలికే!

ప్రైమరీ, సెకండరీ... ఈ రెండు బెడ్ వెట్టింగ్‌లనూ సరిదిద్దే చికిత్సలున్నాయి. మొదటగా ప్రైమరీ బెడ్ వెట్టింగ్‌కు మందుల అవసరం లేకపోయినా, బిహేవియరల్ థెరపీతో సరిదిద్దవచ్చు. అదెలాగంటే....

- ప్రతి రాత్రి పడుకోబోయేముందు పిల్లల చేత మూత్రవిసర్జన చేయిస్తూ ఉండాలి.
- అర్ధ రాత్రి నిద్ర లేపి, దగ్గరుండి మూత్ర విసర్జన చేయించాలి.
- నిద్రకు ముందు ద్రవాహారాలు ఇవ్వకూడదు.
- చాక్లెట్లు, కారం, మసాలాలు, శీతల పానీయాలను నిద్రకు ముందు దూరంగా పెట్టాలి.
- కొందరు పిల్లలు మూత్రాశయాన్ని పూర్తిగా ఖాళీ చేయరు. కాబట్టి మూత్ర విసర్జన చేసే సమయంలో దగ్గరుండి, పూర్తిగా చేశాడో లేదో అడిగి నిర్ధారించుకోవాలి.
- బెడ్ వెట్టింగ్ చేయని రోజుల్లో చిన్న చిన్న బహుమతులిచ్చి మెచ్చుకోవాలి.



- వరుసగా 3, 4 రోజులపాటు పక్క తడపకపోతే పెద్ద బహుమతి ఇచ్చి ఆత్మవిశ్వాసం పెంచాలి.
- పక్క తడిపిన మరుసటి రోజు ఆ దుప్పట్లను పిల్లల చేత తీయించాలి. ఇలా చేస్తే బాధ్యతగా మసలుకుంటారు. మూత్రవిసర్జన మీద నియంత్రణ కూడా పెరుగుతుంది.
- మలబద్ధకం తలెత్తకుండా పీచుపదార్థం ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వాలి.

తప్పనిసరి అయితేనే మందులు?

ఏడేళ్లు దాటినా పక్క తడిపే అలవాటు తగ్గకపోయినా, ఆ అలవాటుతో పిల్లలు ఆత్మన్యూనతకు లోనవుతున్నా, తల్లితండ్రులకు ఇబ్బందిగా ఉన్నా, సమస్యను అదుపు చేసే మందులు వాడవచ్చు. ఈ మందులు క్రమంతప్పక మూడు నెలలపాటు వాడవలసి ఉంటుంది. అయితే మందులు వాడే ముందు సెకండరీ బెడ్ వెట్టింగ్‌తో సంబంధం ఉన్న కారణాలను విశ్లేషించుకోవాలి. అవేవీ లేకపోతేనే మందులు మొదలుపెట్టాలి.



కొంతమంది పిల్లలు మందులు వాడినంతకాలం బాగానే ఉండి, ఆపగానే తిరిగి పక్క తడపడం మొదలుపెడతారు. అలాంటప్పుడు సెకండ్ కోర్సు మందులు వాడవలసి ఉంటుంది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోతే, మందులు రోజూ వాడడం మానేసి, ఎప్పుడైనా ట్రిప్‌కి వెళ్లినప్పుడు, ఇతరుల ఇళ్లలో ఉండవలసి వచ్చినప్పుడు మాత్రమే వాడమని వైద్యులు సూచిస్తారు.

మందులు ఎప్పుడంటే?

పక్క తడిపే అలవాటు కంటే దాని పర్యవసానాలతో మానసిక కుంగుబాటుకే చికిత్స అవసరమవుతుంది. అలాంటప్పుడు మందులు వాడవలసి ఉంటుంది. ఇలా కాకుండా పిల్లలు ఆ అలవాటుకు డిస్టర్బ్ కాకుండా ఉంటే, పదేళ్ల వయసు వచ్చేవరకూ మందులు అవసరం ఉండదు. పదేళ్ల తర్వాత కూడా కొనసాగితే కచ్చితంగా మందులు మొదలు పెట్టవలసి ఉంటుంది. అయితే ఈ అలవాటు వల్ల ఉద్యోగులైన తల్లితండ్రులకు ఇబ్బందిగా ఉంటే, ఏడేళ్ల వయసు నుంచే మందులు వాడుకోవచ్చు.



బెడ్ వెట్టింగ్ అలారం

వీటిని ఏడేళ్ల నుంచి పదేళ్ల వయసు దాటిన పిల్లలు మొదలు వాడవచ్చు. రాత్రివేళ పిల్లలు పడుకునే ముందు దీన్ని వాళ్ల లోదుస్తులకు తగిలించాలి. కొద్దిగా తడి తగిలిన వెంటనే ఈ అలారం మోగుతుంది. ఆ శబ్దానికి పిల్లలు మేలుకుని బాత్రూమ్‌కి వెళ్లొస్తారు. అలా కొన్ని రోజులపాటు ఈ అలారం ద్వారా మూత్ర విసర్జన సమయంలో నిద్రాభంగం కలుగుతూ ఉండడంతో, పిల్లలు ఆ పరిస్థితికి అలవాటు పడతారు. క్రమేపీ పక్క తడిపే అలవాటు మానుకుంటారు. మూత్రవిసర్జన చేసే పరిస్థితి తలెత్తిన వెంటనే నిద్ర నుంచి మేలుకుంటూ ఉంటారు.



డాక్టర్ వి.వి.ఆర్. సత్య ప్రసాద్
కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
బంజారాహిల్స్, హైదరాబాద్.



కేన్సర్ కేర్

అప్రమత్తతే రక్షణ!

కేన్సర్ వ్యాధి పట్ల సర్వత్రా భయం నెలకొని ఉంది. ఇందుకు కారణం ఆ వ్యాధి గురించిన అవగాహన లేకపోవడమే! కానీ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరుచుకోగలిగితే కేన్సర్ నుంచి రక్షణ పొందడం అసాధ్యమేమీ కాదు.

అపోహలు వీడండి: వ్యాధి ముదరక ముందే గుర్తించి చికిత్స తీసుకుంటే కేన్సర్ నుంచి విముక్తి పొందడం తేలికే! కేన్సర్ మరణాల్లో 30% మరణాలను వ్యాధిని తొలి దశలోనే గుర్తించగలిగితే నియంత్రించవచ్చు.



నివారణ సులువే!

సిరి ధాన్యాల్లో పోషకాలు, ఔషధ గుణాలు అధికం. కాబట్టి వీటిని ఆహారంలో అధికంగా వాడాలి. మాంసాహారం, ఉప్పు కలిగిన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్‌లలో కేన్సర్ కారకాలు ఉంటాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. అలాగే పొగాకులో 80 రకాల కేన్సర్ కారకాలు ఉంటాయి. కాబట్టి పొగాకుకు దూరంగా ఉండాలి. రసాయన పదార్థాల పరిశ్రమలు, రంగుల పరిశ్రమలు, ఎక్స్ రే రేడియేషన్‌లకు దూరంగా ఉండాలి. హెపటైటిస్ బి, సి ఇన్‌ఫెక్షన్ వల్ల కాలేయ కేన్సర్ వచ్చే వీలుంది. గర్భాశయ ముఖద్వార కేన్సర్, హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల వస్తుంది. కాబట్టి వీటి నుంచి రక్షణ కోసం సంబంధిత టీకాలు తీసుకోవాలి.



డాక్టర్ జి.సురేంద్ర బాబు
అమృత చిల్డ్రన్స్ హాస్పిటల్, సిరిసిల్ల.

ఫుడ్ ఫ్యాక్ట్

అమ్మ లాంటి నిమ్మ!

పరగడుపునే నిమ్మరసం తాగితే ఆరోగ్యానికి మేలు అనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఎలాంటి మేలు జరుగుతుందో తెలుసుకుందాం!



- **వ్యాధినిరోధకవ్యవస్థ శక్తిమంతం:** నిమ్మరసంలోని విటమిన్ సి, వ్యాధినిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.
- **రక్తపోటు క్రమబద్ధం:** ప్రతిరోజూ క్రమం తప్పక ఒక నిమ్మకాయ తీసుకుంటే అధిక రక్తపోటు 10% మేరకు తగ్గుతుంది.
- **పొటాషియం పుష్కలం:** రోజంతటికీ సరిపడా పొటాషియం అందాలంటే రోజుకొక నిమ్మ కాయ తీసుకోవాలి.
- **జీర్ణశక్తి అమోఘం:** గ్లాసుడు నీళ్లలో ఒక నిమ్మకాయ పిండుకుని తాగితే శరీరంలోని టాక్సిన్లన్నీ బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా జీర్ణశక్తి మెరుగవుతుంది.
- **కాలేయం శుభ్రం:** పలు రకాల జీవక్రియలకు కేంద్రమైన కాలేయం శుభ్రపడాలంటే నిమ్మరసం తాగాలి.
- **బరువు అదుపులో:** నిమ్మరసం ఆకలిని అదుపు చేస్తుంది. పలు రకాల పదార్థాలను తినాలనే కోరికను చంపుతుంది. దాంతో అనవసరపు ఆహారాన్ని తగ్గించి సన్నబడతాం!

హెల్తీ డ్రింక్

కొబ్బరినీళ్లతో కొత్త జీవం

వేసవి వచ్చిందంటే శీతల పానీయాలను ఆశ్రయిస్తాం! తీపిగా, చల్లగా గొంతు దిగే శీతల పానీయాలతో ఉపశమనం కలిగినట్టు అనిపిస్తుంది. కానీ, నిజానికి వాటి వల్ల ఒరిగే దుష్ప్రయోజనాలు చెప్పలేనన్ని. కాబట్టి దాహం తీర్చడంతోపాటు వేసవి నుంచి తట్టుకునే శక్తినిచ్చే పోషకభరిత కొబ్బరినీళ్లను ఎంచుకోవాలి. ఎందుకంటే....



- కొబ్బరినీళ్లతో జీర్ణశక్తి పెరుగుతుంది.
- బరువు తగ్గుతాం!
- శక్తి భర్తీ అవుతుంది.
- చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- కండరాలు బలపడతాయి.
- శరీరం నుంచి విషాలు విసర్జింపబడతాయి.
- రక్తపోటు తగ్గుతుంది.
- గుండె కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి.

సెక్సువల్ హెల్త్

సెక్స్‌కు పరిమితులున్నాయా?

డాక్టర్! మాకు కొత్తగా పెళ్లైంది. అయితే ఎంత తరచుగా సెక్స్‌లో పాల్గొనాలనే విషయంలో మా దంపతులిద్దరికీ ఎన్నో అనుమానాలున్నాయి. తరచుగా పాల్గొనటం ఆరోగ్యకరం అని ఆయన అంటున్నారు. వారంలో రెండు సార్లు పాల్గొన్నా ఫరవాలేదనేది నా అభిప్రాయం. అసలు సెక్స్‌కు పరిమితులున్నాయా?



వారంలో ఒకసారి లేదా అసలు సెక్స్‌లో పాల్గొనని వారితో పోలిస్తే, వారంలో రెండుసార్లు సెక్స్‌లో పాల్గొన్న వారిలో 'ఇమ్యునో గ్లోబ్యులిన్ ఎ' అనే యాంటీబాడీస్ 30% పెరిగినట్టు పలు పరిశోధనల్లో తేలింది. రోగనిరోధకశక్తి సామర్థ్యంలో ఇమ్యునో గ్లోబ్యులిన్ ఎ కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి తేలికగా ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, వారంలో కనీసం రెండు సార్లైనా సెక్స్‌లో పాల్గొనాలి. అయితే అంతకుమించి పాల్గొన్నంతమాత్రాన ఆరోగ్యపరంగా ఎలాంటి నష్టమూ ఉండదు. పార్ట్‌నర్ ఇష్టపడుతూ ఉన్నప్పుడు సహకరించటంలో తప్పు లేదు. సెక్స్ విషయంలో దంపతులిద్దరికీ భిన్నమైన ఇష్టానిష్టాలు ఉన్నప్పుడు కలిసి చర్చించుకుని, ఆనందకరమైన లైంగిక జీవితాన్ని సాగించాలి. లేనిపోని అనుమానాలతో దాంపత్య జీవితానికి పరిధులు విధించుకోవటం అవివేకం. కాబట్టి అర్థం లేని అనుమానాలకు తావివ్వకుండా ఆనందకరమైన లైంగిక జీవితాన్ని ఆస్వాదించండి.

డాక్టర్ షర్మిలా మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్
mili77@gmail.com
9676762665 (కన్సల్టేషన్ కోసం)



వ్యాధికారక క్రిములని చంపి, ఆరోగ్యాన్ని కాపాడవలసిన 'లింఫోసైట్స్'కు కేన్సర్ సోకితే 'లింఫోమా' అంటారు. వ్యాధినిరోధక వ్యవస్థ కుదేలయ్యే ఈ రుగ్మతను ముందుగానే గుర్తిస్తే చికిత్సతో నయం చేయడం సులువే!

హెల్త్ కేర్

లక్షణాలను బట్టే... 'లింఫోమా'!

రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పని చేయాలంటే, తెల్ల రక్తకణాలైన లింఫోసైట్స్ ఆరోగ్యంగా ఉండాలి. ఈ కణాలు లింఫ్‌నోడ్స్, ప్లీహం, మెడ క్రింది వినాళ గ్రంథి, ఎముక మజ్జ, ఇతరత్రా శరీరావయవాల్లో తయారవుతూ ఉంటాయి. ఆయా ప్రదేశాల్లో కేన్సర్ తలెత్తితే 'లింఫోమా'గా భావించాలి. లింఫోమాలో హడ్కిన్స్, నాన్ హడ్కిన్స్ అనే రెండు రకాలుంటాయి. ఈ కేన్సర్ లక్షణాలను తేలికగానే కనిపెట్టవచ్చు. కాబట్టి ఈ లక్షణాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవేంటంటే....

- మెడ, చంక, గజ్జల్లో నొప్పి లేని వాపులు
- ప్లీహం పెరగడంతో పొట్టలో నొప్పి
- జ్వరం, రాత్రుళ్లు చమటలు
- నీరసం, శక్తి తగ్గడం
- అకారణంగా బరువు తగ్గడం
- దురదలు



పరీక్షలు అవసరం!

రక్త పరీక్షలు, బయాప్సీ, ఎముక మజ్జ పరీక్ష, సెరెబ్రోస్పైనల్ ఫ్లూయిడ్ పరీక్ష, మాలిక్యులర్ ఇమేజింగ్... ఇలా పలు పరీక్షలతో లింఫోమా దశ, తీవ్రత, విస్తారాలను నిర్ధారించుకోవచ్చు. లింఫోమా రకం, లింఫోమా దశ (ఏ ప్రాంతాలు దెబ్బతిన్నాయి?) అనే దాన్ని బట్టి చికిత్స చేయవలసి ఉంటుంది. చికిత్స తదనంతరం క్రమం తప్పకుండా థైరాయిడ్, కాలేయం, మూత్రపిండాల పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. పాప్‌స్మియర్, మమ్మోగ్రఫీ, కోలోరెక్టల్ స్క్రీనింగ్, ప్రోస్టేట్, ఎముక సాంద్రత పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుంటూ ఉండాలి.

లింఫోమా తదనంతర జీవితం

- ఒకేసారి ఎక్కువ పరిమాణంలో భోజనం చేయకుండా, తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు తింటూ ఉండాలి.
- నోట్లో పుండ్లు ఉంటే మెత్తని ఆహారం తినాలి. మసాలా ఆహారం మాని, పళ్లరసాలు తాగాలి.
- ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి.
- లింఫోమా తిరగబెడుతుందేమో అనే ఆందోళన, కుంగుబాటుకు లోనవకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తూ ప్రశాంతంగా ఉండడం ఎంతో అవసరం.

డాక్టర్ అనిల్ అర్బంది
హెమటో ఆంకాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



డైలీ సుడోకు - 443

					5		4	
		5		4		6		
4	3	8	2					
				2			6	
7		3				1		2
	4			8				
					2	7	9	4
		2		3		5		
	6		7					

ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 442 సమాధానం

3	2	5	4	9	8	1	7	6
7	1	8	5	6	2	3	4	9
9	6	4	3	1	7	8	2	5
8	9	6	2	3	1	4	5	7
2	5	3	7	4	9	6	8	1
1	4	7	6	8	5	2	9	3
5	7	1	8	2	3	9	6	4
6	8	9	1	5	4	7	3	2
4	3	2	9	7	6	5	1	8

హార్మోనల్ హెల్త్



ఇంత ఖర్చు భరించవలసిందేనా?

డాక్టర్! నా వయసు 23 ఏళ్లు. నా అంగం హఠాత్తుగా కుంచించుకుపోయింది. స్తంభనాలు మామూలుగానే ఉన్నాయి. స్తంభించినప్పుడు అంగం 5 అంగుళాల పరిమాణం ఉన్నా, మామూలు స్థితిలో చూస్తే, పొడవు తగ్గినట్టు స్పష్టంగా కనిపించడంతో కంగారు మొదలైంది. సెక్సాలజిస్టుని కలిస్తే, అంగం లోపలి కణజాలం పాడైపోయిందని, నెలకు 17 వేల రూపాయల మందులు సూచించారు. నాకంత ఆర్థిక స్థోమత లేదు. నన్ను ఏం చేయమంటారు?

- ఓ సోదరుడు, వరంగల్.

అంగస్తంభనాలు, స్తంభించినప్పుడు అంగ పరిమాణం ఇంతకుముందులాగే ఉంటే మీకు సమస్య లేనట్టే! లేని సమస్యకు అంత ఖరీదైన మందులు వాడనవసరం లేదు. మీ అంగం కుంచించుకుపోయింది అంటున్నారు. నిజానికి చలికాలంలో వాతావరణ మార్పుల వల్ల అంగం కొంత కుంచించుకుపోయినట్టు కనిపించడం సహజం. చల్లని వాతావరణానికి అంగంలోని స్పాంజ్ లాంటి కణజాలం కుంచించుకుపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఇది సహజం. అయితే ఈ తేడాను మీరు కొత్తగా గమనించి కంగారుకు లోనయి ఉంటారు. కాబట్టి భయాన్ని వదిలేయండి. వైద్యులు సూచించిన మందులు కూడా వాడవలసిన అవసరం లేదు. లైంగిక కోరిక కలిగినప్పుడు అంగం స్తంభిస్తున్నా, స్తంభించిన పురుషాంగం కనీసం మూడున్నర అంగుళాల మేర పెరుగుతున్నా కంగారు పడవలసిన పని లేదు. అంగంతోపాటు, వృషణాలు కూడా చల్లని వాతావరణానికి కుంచించుకుపోవడం అత్యంత సహజం. కాబట్టి ఈ మార్పులకు భయపడకూడదు.

డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్.
8332850090 (కన్సల్టేషన్ కోసం)



ఎస్పీ బాలుకు మాతృవియోగం





నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శకుంతలమ్మ (89) సోమవారం ఉదయం నెల్లూరులోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. స్వతహాగా సంగీత విధూషీమణి అయిన శకుంతలమ్మ సంగీత విద్వాంసుడు, హరికథా పితామహులలో ఒకరైన పండితారాధ్యుల సాంబమూర్తి ఇల్లాలు. వీరి కుమారుడే ఎస్పీ బాలు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న బాలు మంగళవారం ఉదయం చెన్నై చేరుకుంటారని, 10.30 గంటలకు నెల్లూరు చేరుకుంటారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉదయం 11 గంటలకు శకుంతలమ్మ అంత్యక్రియలు జరిపేందుకు బంధుమిత్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. శకుంతలమ్మ పెద్దలు కుదిర్చిన సాంబమూర్తిని వివాహం చేసుకున్న తరువాత నెల్లూరులో స్థిరపడ్డారు. తమిళనాడులోని పల్లిపట్టు తాలుకా, కోనేటంపేట ఆమె స్వగ్రామం. నాన్న రామారావు ఇచ్చిన ప్రోత్సాహంతోనే సంగీతం నేర్చుకున్నారు. పండితారాధ్యుల సాంబమూర్తి హరికథలు, భాగవతాలు చెబుతూ త్యాగరాజ కీర్తనలతో సంగీత కచేరీలు నిర్వహించేవారు. అప్పట్లో కార్వేటినగరం రాజావారు రాజుకుమార్‌స్వామి రాజా ఆదేశాల మేరకు కోనేటంపేటలో ఆధ్యాత్మిక సంగీత కచేరీలు నిర్వహించేవారు. 20 రోజులు అక్కడ నిర్వహించి ఉండటం వలన రామారావు ఇంట్లోనే సాంబమూర్తికి బస ఏర్పాటు చేశారు. ఆ పరిచయం తోనే పెద్దలు శకుంతలమ్మను సాంబమూర్తికి ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు. 1943లో వివాహం కాగా, 1947లో నెల్లూరు తిప్పరాజువారివీధిలో కాపురం పెట్టారు. అప్పటి నుంచి ఆ ఇల్లు కళాకారులతో సంగీత సభలా ఎప్పుడూ ప్రజ్వరిల్లుతూ ఉండేది. త్యాగరాజ స్వామి పేరు మీద ఒక సంఘాన్ని ఏర్పరచి ప్రముఖుల సహకారంతో 1965 డిసెంబరు 15న భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సంఘాన్ని మరో ప్రముఖ సంగీత పండితులు యనమండ్ర వెంకటేశ్వరరావుతో కలిసి స్థాపించారు. త్యాగయ్యలా జోలె పట్టుకుని ప్రతి ఇల్లు, ప్రతి వీధి తిరుగుతూ సంకీర్తనలు చేస్తూ సింహపురి వీధిలో భిక్షాటన చేస్తూ అలా వచ్చిన నగదు, వస్తు సంపదతోనే త్యాగరాజస్వామి ఉత్సవాలు నెల్లూరులో నిర్వహిస్తూ ఉండేవారు. దాని వెనుక శకుంతలమ్మ ప్రోత్సాహం, ఆదరణ, వారి కృషి అప్పట్లో బయట ప్రపంచానికి తెలియకపోయినా సంగీత కళాకారులకు ఇప్పటికీ చిరస్మరణీయమే. వీరికి ఆరుగురు సంతానం. పెద్దకుమారుడు ఎస్పీ బాలు, రెండో కుమారుడు జగదీష్, నలుగురు కుమార్తెలు గిరిజ, పార్వతి, శైలజ, వసంత. అందరూ సంగీతం నేర్చుకున్న కళాకారులే. బాలు, శైలజ, వసంత మాత్రం పూర్తిస్థాయిలో సంగీతం వైపు వెళ్లారు. ఆ తరువాత కాలంలో వసంత కుటుంబానికి పరిమితం కాగా, బాలు, శైలజలు మాత్రం నేటికీ తమ సంగీత సాధనను పంచుతున్నారు.

శైలజను సినీ నటుడు శుభలేఖ సుధాకర్‌కి ఇచ్చి వివాహం చేశారు. బాలు మాత్రం తండ్రికి తగ్గ తనయుడిగా, తల్లి శకుంతలమ్మ సంగీత వారసత్వాన్ని రెండూ కలబోసి మంచి పేరు తెచ్చుకోవటమే కాకుండా ప్రపంచ రికార్డుకి చేరువయ్యారు. ఎంత ఎత్తు ఎదిగినా బిడ్డలు నిత్యం శకుంతలమ్మతో ఫోన్‌లో సన్నిహితంగా ఉంటూనే కుశల ప్రశ్నలు, ఆరోగ్య సమాచారం మాట్లాడేవారు. రోజుకోసారి బాలు ఫోన్ చేసి పలకరించటం ఆ తల్లి గర్వంగానూ, ఆనందంగానూ చెప్పుకునేది.

- ఆంధ్రజ్యోతి, నెల్లూరు



యవ్వనంగా ఉండాలా..?

- మెహ్రీన్

"యవ్వనంగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? ప్రతి ఒక్కరూ తమ వయసుకన్నా తక్కువగా కనిపించాలనే ఉబలాటపడుతుంటారు. అలాంటివారు చిన్న ట్రిక్ ఫాలో అయితే చాలు" అని అన్నారు మెహ్రీన్. ఇటీవల 'ఎఫ్2'లో 'హనీ ఈజ్ బెస్ట్' మేనరిజమ్‌తో అందరినీ ఆకట్టుకున్న మెహ్రీన్ తన ఆహారపు అలవాట్లను గురించి సోషల్ మీడియాలో పంచుకున్నారు. "నేను తాగే ఏకైక డ్రింక్ కొబ్బరినీళ్లు. నా డైటీషియన్ రాశీ చౌదరి డైటింగ్ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటుంది. కొబ్బరిబొండాం తాగాక తప్పకుండా మలాయ్ తినమని చెబుతుంది. చాలా మంది మలాయ్ అనగానే 'అమ్మో ఫ్యాట్' అని అనుకుంటారు. కానీ ఫ్యాట్ గురించి ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మలాయ్‌లో ఉండే హెల్దీ ఫ్యాట్ మనల్ని ఆరోగ్యవంతంగా, యవ్వనంగా ఉంచుతుంది" అని తెలిపారు.

పెళ్లి మూడ్‌లో సౌందర్య



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తనయ, దర్శకురాలు సౌందర్య ఇప్పుడు పెళ్లి మూడ్‌లో ఉన్నారు. ఆమె వివాహం గురించి గత కొంతకాలంగా వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఇప్పటిదాకా పెళ్లి గురించి రజనీకాంత్ కుటుంబం ఎక్కడా నోరు విప్పలేదు. ఈ నేపథ్యంలో సోమవారం సౌందర్య తన పెళ్లి గురించి ట్వీట్ చేశారు. "ఇంకో వారమే ఉంది. పెళ్లికూతురి స్థానాన్ని ఆస్వాదిస్తున్నాను. ఆశీర్వాదాలు దక్కాయి. విశాగన్‌ను వివాహం చేసుకోబోతున్నాను" అని ఆమె ట్వీట్ చేశారు. ఆమె పెళ్లి చేసుకోనున్న విశాగన్ వనంగాముడి వ్యాపారవేత్త. 2018లో విడుదలైన 'వంజగర్ ఉలగం' అనే చిత్రంతో హీరోగానూ కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. వీరి వివాహం ఈ నెల 11న జరగనుంది. ఈ నేపథ్యంలో పోయస్‌గార్డన్‌లోని తమ నివాసం ముందు ఈ నెల 10, 12న సెక్యూరిటీ కావాలని వధువు తల్లి, రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్ చెన్నై తేనాంపేట పోలీసులకు లేఖ అందించారు. సౌందర్య రజనీకాంత్‌కు ఇది రెండో వివాహం. ఇంతకు ముందు ఆమెకు అశ్విన్ రామ్‌కుమార్‌తో వివాహం జరిగింది. అయితే మనస్పర్థల కారణంగా వారిరువురు విడాకులు తీసుకున్నారు. వారికి వేద్ కృష్ణ అనే తనయుడు కూడా ఉన్నారు. గ్రాఫిక్స్ డిజైనర్‌గా పరిశ్రమకు పరిచయమైన సౌందర్య 'బాబా', 'మజా', 'సండైకోళి', 'శివాజీ' చిత్రాలకు పనిచేశాను. రజనీకాంత్ హీరోగా నటించిన 'కొచ్చడయాన్' చిత్రంతో ఆమె దర్శకురాలిగా మారారు. ధనుష్ హీరోగా నటించిన 'వీఐపీ2'కు కూడా ఆమె దర్శకత్వం వహించారు.

మ్యూజికల్ లవ్‌స్టోరీతో..


శేఖర్ కమ్ముల, సునీల్

'ఫిదా'('2017)తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం నూతన నటీనటులతో ఓ మ్యూజికల్ లవ్‌స్టోరీ తెరకెక్కిస్తున్నారు. ఎమిగోస్ క్రియేషన్స్ సమర్పణలో ఏషియన్ గ్రూప్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సోమవారం శేఖర్ కమ్ముల పుట్టినరోజు వేడుకను సెట్‌లో నిర్వహించారు. సునీల్ నారంగ్, పి. రామ్మోహన్‌రావు, సదానంద్, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొని శేఖర్ కమ్ములకు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాన్సర్‌కి తలొగ్గలేదు!

"నిజమే... నాకు క్యాన్సర్ వచ్చింది. అయితే... దానికి నేను తలొగ్గలేదు! క్యాన్సర్ నన్ను చంపలేదు. అది నన్ను జయించలేదు" అని గాయని, నటి మమతా మోహన్‌దాస్ అన్నారు. టెన్ ఇయర్స్ ఛాలెంజ్... ప్రస్తుతం ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తున్న ఛాలెంజ్ ఇది! పదేళ్ల కిందటి తమ ఫొటోని.. ఇప్పటి ఫొటోని... సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, సినిమా తారలందరూ ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నారు. సోమవారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భాని పురస్కరించుకుని మమతా మోహన్‌దాస్ టెన్ ఇయర్స్ ఛాలెంజ్‌లో పార్టిసిపేట్ చేశారు. ఈ ఛాలెంజ్‌లో పాల్గొనడానికి ఈ రోజు కోసమే ఎదురు చూశానన్నారు. ఇంకా మమతా మోహన్‌దాస్ మాట్లాడుతూ "నా జీవితాన్ని మార్చేసిన ఏడాది 2009. మా కుటుంబ ప్రణాళికలనూ మార్చింది. గడచిన పదేళ్ల జీవితం చాలా సవాళ్లను ఎదుర్కొన్నాను. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే... క్యాన్సర్‌పై అవిశ్రాంతంగా పోరాటం చేసి, బలంగా నిలబడి, క్యాన్సర్ నుంచి బయట పడినందుకు గర్వంగా ఉంది. చాలా సంవత్సరాల పాటు సానుకూల దృక్పథంతో బలంగా నిలబడటం చాలా కష్టం. ఆ కష్టాన్ని నేను ఎదుర్కొగలిగాను అంటే... మా అమ్మానాన్న, కొంతమంది కజిన్స్, కొలీగ్స్ నాకు అండగా నిలబడ్డారు" అన్నారు.



మమతా మోహన్‌దాస్

నిఖిల్ 'ముద్ర' మారింది



నిఖిల్ కొత్త సినిమా 'ముద్ర' టైటిల్ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దర్శక, నిర్మాతలు టైటిల్ మార్చాలని నిర్ణయించుకుని ఈ సినిమాకు 'అర్జున్ సురవరం' టైటిల్‌ను ఖరారు చేశారు. టి.ఎన్ సంతోశ్ దర్శకుడు. లావణ్య త్రిపాఠి కథానాయిక. బి.మధు సమర్పణలో కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోమవారం చిత్ర యూనిట్ కొత్త టైటిల్ లోగోను ఆవిష్కరించారు. 'అర్జున్ లెనిన్ సురవరం' అనే కుర్రాడి కథ ఇది. అతడు జర్నలిస్టుగా సమాజంలోని సమస్యలపై పోరాడుతుంటాడు' అని నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. ఇటీవల యూరప్‌లో చేసిన పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 29న సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

అది సహజీవనం కూడా కాదు... పేరు లేని బంధం!

- శరత్‌బాబు


రమాప్రభ

"నాకు తన(రమాప్రభ)తో ఉన్న బంధానికి పేరు లేదు. అది సహజీవనం కూడా కాదు. నేను ఎవరి ఆస్తిలోనూ చిల్లిగవ్వ కూడా తీసుకోలేదు. ఎవరి పేరు చెప్పుకొని ఎదగలేదు. ఎంతో మంది పేరున్న వ్యక్తులే తమ వారసుల్ని సినిమా రంగంలో నిలబెట్టుకోలేకపోయారు. వాళ్లందరి కన్నా తనేం గొప్పది కాదు.. నన్ను ఇండస్ట్రీలో నిలబెట్టడానికి" అని శరత్‌బాబు అన్నారు. తన ఆస్తిని శరత్‌బాబు లాక్కున్నారని ఇప్పటికే పలుమార్లు సీనియర్ నటి రమాప్రభ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వాటికి శరత్‌బాబు ఓ చానెల్‌లో స్పందించారు. ఆయన మాట్లాడుతూ "నాకెప్పుడూ స్వార్థపూరిత ఆలోచనలు లేవు. మాది సంప్రదాయ కుటుంబం. సిల్వర్‌స్పూన్‌తో పుట్టాను. ఎవరితోనూ ఫుడ్ కోసం పరిచయాలు పెంచుకోవాల్సిన అవసరం లేదు. బెడ్ కోసమే అయితే నేను తనతో ఉండాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నన్ను ఇష్టపడేవాళ్లు చాలా మంది ఉన్నారు. అయినా తనతో పరిచయం ఏర్పడేటప్పటికే నాకు స్టార్‌డమ్ ఉంది. బాలచందర్ సినిమాలు చేశాను. ఏవీఎం సంస్థలో 'నోము'లాంటి సినిమాలు చేశాను. అప్పుడు నా వయసు 22 ఏళ్లు. తను నాకన్నా 5-7 ఏళ్లు పెద్దది. అప్పటికే పెళ్లయిన స్త్రీ. నాకు ప్రపంచం గురించి సరైన అవగాహన లేదు. ఆ సమయంలో తనతో కలిసి ఉండాలన్న నిర్ణయం తీసుకోవడం నా పొరపాటు. అనుభవరాహిత్యంతో అలా చేశాను. తనతో ఉన్న 1977-87 మధ్య కాలంలో నా ఇన్‌కమ్‌ట్యాక్స్ రికార్డు చూసినా, తెలిసిన వారిని అడిగినా నేనెంత బిజీగా ఉండేవాడినో అందరూ చెబుతారు. ఎప్పుడూ ఔట్‌డోర్‌కి వెళ్లేవాడిని. ఒక వ్యక్తిని ఎసెస్ చేసే సమయం అప్పట్లో నాకు లేదు. వాగ్వివాదాలు జరిపే సమయం కూడా లేదు" అని అన్నారు. ఆస్తుల గురించి మాట్లాడుతూ "మేం కలిసినప్పుడు తనకున్న ఆస్తి ఆళ్వార్‌పేట్‌లో ఒక ఇల్లు. ఎగ్మోర్ బెనిఫిట్ సొసైటీ ఫైనాన్స్‌తో ఉన్న ఇంకో ఇల్లు. అందులో తొలి భర్త పేరు కూడా ఉందని కొన్నేళ్ల తర్వాత చూశాను. ఇంకో విషయం ఏంటంటే తనకున్న ఆ ప్రాపర్టీని 87లో అనుకుంటా.. అమ్మి... మూకాంబికా కాంప్లెక్స్‌లో తన పేరు మీద ఒక కమర్షియల్ ఫ్లాట్ కొనిచ్చా. దాంతో పాటు భగవంతం స్ట్రీట్‌లో కళా ఫ్లాట్స్‌లో తన పేరు, తన తమ్ముడి పేరుతో ఒక ఫ్లాటు, తమ్ముడి పేరుతో మాత్రం మరో ఫ్లాట్ కొనిచ్చా. చెన్నైలో ఉమాపతి స్ట్రీట్‌లో ఓ ఇండిపెండెంట్ హౌస్ నేను తన పేరు మీద కొన్నా. ఆ ఇండిపెండెంట్ హౌస్ కొనడానికి నేను.. నా సొంత పొలాన్ని విక్రయించేశాను. అప్పుడు నేను అమ్మిన పొలం విలువ ఇప్పుడు రూ.60కోట్లు. ఆమె ఆస్తులు ఏమయ్యాయో రికార్డులు చూసినా, వాళ్ల ఆడిటర్‌ని అడిగినా అన్నీ తెలుస్తాయి. నా జీవితంలో అది తుఫాను సమయం. అందుకే ఆ రోజులను గుర్తుచేసుకున్నా ఏమీ గుర్తు రావు. అందుకే ఒకసారి ఫ్లైట్‌లో తను నా పక్కన వచ్చి కూర్చుంటే నేను అక్కడి నుంచి లేచి వెళ్లా. తను కనిపిస్తే నేను నెర్వస్‌గా ఉంటానని అనడం అబద్ధం. పరిశ్రమలో నాకు మంచి పేరు ఉంది. అది నా ప్రవర్తనతో తెచ్చుకున్న పేరు. నా దృష్టిలో భార్యంటే భోగిమంటల్లో వేసే ముళ్లకంపలా ఉండకూడదు. హోమగుండంలో వేసే గంధపు చెక్కలా ఉండాలి. ముళ్లకంపలా గుచ్చుకుంటూ చుట్టూ ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయకూడదు. సువాసనలు వెదజల్లుతూ చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆనందకరంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యంగా మార్చాలి" అని చెప్పారు.

శత్రువూ ముఖ్యమే!

- సాయికృష్ణ పెండ్యాల



"నేను పద్దెనిమిదేళ్లుగా పంపిణీ రంగంలో ఉన్నాను. 'దండుపాళ్యం 3'తో నిర్మాతగా మారాను. 'కురుక్షేత్రం', 'మారి 2' చిత్రాల తర్వాత నిర్మాతగా నేను విడుదల చేస్తున్న నాలుగో చిత్రమిది. ప్రేక్షకులకు డబ్బింగ్ సినిమా చూస్తున్నామనే భావన కలగకూడదని డబ్బింగ్‌కి బాగా ఖర్చుపెట్టాను" అని సాయికృష్ణ పెండ్యాల అన్నారు. శివ కార్తికేయన్ హీరోగా, సమంత, కీర్తి సురేశ్ హీరోయిన్లుగా నటించిన అనువాద చిత్రం 'సీమరాజా'ను ఈ నెల 8న తెలుగులో విడుదల చేస్తున్నారీయన. ఈ సందర్భంగా మాట్లాడుతూ "అల్లరి చిల్లరగా తిరిగే ఓ రాజ వంశీకుడు.. తాతల పరిపాలనా దక్షతను తెలుసుకుని తమ ఊరి సమస్యను ఎలా చేధించాడు? అనేది చిత్రకథ. 'మనిషి బతకడానికి స్నేహితుడు ఎంత ముఖ్యమో.. శత్రువూ అంతే ముఖ్యం' అనే డైలాగ్ నచ్చి సినిమా హక్కులు తీసుకున్నా. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే బావోద్వేగాలు చిత్రంలో ఉన్నాయి. ఇందులో సమంత నటన, ఆమె చేసే కర్రసాము పోరాటం... యువరాణికి కీర్తి సురేశ్ అభినయం... సిమ్రాన్ విలనిజం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. తెలుగు రాష్ట్రాల్లో 300 - 400 థియేటర్లలో విడుదల చేస్తున్నాం" అన్నారు.



"కొన్ని పనులు చేస్తున్నప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. ఆనందాన్ని మించిన ఆధ్యాత్మికభావన, ఏకాగ్రత అలవడుతాయి. ఈ మధ్య నేను అలాంటి ఓ విషయాన్ని గమనించాను" అని అన్నారు రాశీ ఖన్నా. ఆమె ప్రస్తుతం కోలీవుడ్‌లో బిజీగా ఉన్నారు. 'అయోగ్య', 'సైతాన్ కా బచ్చా' చిత్రాలు తమిళంలో ఆమె చేతిలో ఉన్నాయి. రాశీ ఖన్నా ఈ మధ్య పిలేట్స్ వర్కవుట్లు చేయడం మొదలుపెట్టారు. దాని గురించి చెబుతూ "గత కొంతకాలంగా నేను పిలేట్స్ చేస్తున్నాను. ఈ వర్కవుట్ల వల్ల నా మనసు చాలా ప్రశాంతంగా ఉంటోంది. అంతే కాదు ఒకరకమైన ఆధ్యాత్మిక భావన ఏర్పడుతోంది. ఆలోచనలు కూడా అటూ ఇటూ వెళ్లడం లేదు. కుదురుగా నా శ్వాసమీద దృష్టి పెట్టగలుగుతున్నా. శరీరం చాలా తేలికగా అనిపిస్తోంది. ఇలాంటి అద్భుతమైన భావన నాకు ఇంతకు ముందు అనుభవంలో లేదు. ఇకపై దీన్ని విడిచిపెట్టదలచుకోలేదు" అని చెప్పారు.

దృష్టి పెడుతున్నా

- రాశీ ఖన్నా

అడవిలో పాట్లు...

శ్రీనివాసరెడ్డి, అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. కనగాల రమేశ్ చౌదరి దర్శకుడు. విక్కీరాజ్ నిర్మాత. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా టీజర్‌ను ఇటీవల ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో శివాజీరాజా ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళ్లి అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతే.. అక్కడినుంచి ఎలా బయటపడ్డారన్నది సినిమా ఇతివృత్తం" అని అన్నారు. "మలేషియాలో తెరకెక్కించిన పతాక సన్నివేశాలతోపాటు స్నేహా కపూర్ చేసిన ఐటమ్ సాంగ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి" అని నిర్మాత తెలిపారు.


స్నేహా కపూర్

ఎలా ప్రశ్నించాడు?


అక్షిత, మనీశ్‌బాబు, హసీనా మస్తాన్

సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, ప్రభుత్వ విధానాలపై ఓ విద్యార్థి నాయకుడు ఏ విధంగా పోరాడాడు? ఎలా ప్రశ్నించాడు? అనే కథతో రూపొందుతున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. మనీశ్‌బాబును హీరోగా రాజా వన్నెంరెడ్డి దర్శకత్వంలో పి. సత్యారెడ్డి నిర్మిస్తున్న చిత్రమిది. అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా హీరోయిన్లు. సినిమా లోగోను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాతో హీరోగా పరిచయమవుతున్న మనీశ్‌బాబు సక్సెస్ కావాలని, మరిన్ని చిత్రాలు చేయాలని ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన నిర్మాతలు సి. కల్యాణ్, బెల్లంకొండ సురేశ్, టి. ప్రసన్నకుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దాసరి కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. "నేటి తరానికి తగ్గట్టు ఉంటుందీ సినిమా. మనీశ్‌బాబు అద్భుతంగా నటించాడు" అని రాజా వన్నెంరెడ్డి అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో హాస్యం!



సాన్వీ మేఘనా, మాగంటి శ్రీనాథ్

మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘనా జంటగా మహంకాళి శ్రీనివాస్ నిర్మించిన చిత్రం 'బిలాల్ పూర్ పోలీస్‌స్టేషన్'. నాగసాయి మాకం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గోరటి వెంకన్న కీలక పాత్ర పోషించారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి మార్చి రెండో వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ "నేటి సమాజం ఎదుర్కొంటున్న ఒక సమస్యను ఇతివృత్తంగా తీసుకుని సినిమా రూపొందించాం. పూర్తి వినోదాత్మక సాగుతూనే ఆలోచిపజేసేలా ఉంటుంది" అని తెలిపారు. దర్శకుడు నాగసాయి మాకం మాట్లాడుతూ "బిలాల్ పూర్ ఊరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వింత కేసులు నేపథ్యంలో వినోదాత్మకంగా సాగే చిత్రమిది. సినిమా చూస్తున్న వాళ్లకు తమ ఊరిలో జరిగే సంఘటనలు గుర్తొస్తాయి. సినిమా ఆద్యంతం సహజమైన పాత్రలు, సన్నివేశాలతో సాగుతుంటుంది" అని చెప్పారు.

ఇంటర్లో మేథ్స్, ఎకనామిక్స్, కామర్స్ కాంబినేషన్‌కు ఈ మధ్య కాలంలో క్రేజ్ పెరిగింది. సైన్స్ గ్రూపులతో సమానంగా ఆదరణ పొందుతోంది. మరో రకంగా చూసుకుంటే, సైన్స్ అంటే ఇష్టం లేకున్నా మేథ్స్‌పై మక్కువ ఉన్న వారిని ఈ కాంబినేషన్ ఆకట్టుకుంటోంది. అన్నింటికీ మించి కామర్స్‌కు ఎనలేని ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు చార్టర్డ్ అకౌంటెన్సీ వైపు మొగ్గు చూపే అవకాశం కలుగుతోంది. దరిమిలా ఇంటర్‌లో లాంగ్వేజెస్‌ను పక్కనబెట్టి, గ్రూపులోని ఈ సబ్జెక్టులకు ఎలా ప్రిపేరైతే మంచి మార్కులు పొందవచ్చో అకడమిక్ నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూద్దాం.

ఇంటర్ ఎంఇసి

మంచి మార్కులకు మెరుగులు



మేథ్స్

ఇంటర్ మొదటి ఏడాదిలో 100 మార్కులకు 2 పేపర్లు (1ఎ, 1బి) ఉంటాయి. రెండో ఏడాదిలోనూ ఇదే విధంగా(2ఎ, 2బి) ఉంటాయి. మేథ్స్ పేపర్ సెక్షన్-ఎ, సెక్షన్-బి, సెక్షన్-సిలలో ప్రశ్నలు ఉంటాయి. వరుసగా 7 మార్కుల ప్రశ్నలు, 4 మార్కుల ప్రశ్నలు చివర్లో 2 మార్కుల ప్రశ్నలు రాయాలి. ప్రతి ప్రశ్నకు సమాధానంగా మొదట ఇచ్చిన డేటా, చివర్లో కంక్లూజన్ రాసినందుకు ప్రత్యేక మార్కులు ఉంటాయి. కాబట్టి వీటిపై శ్రద్ధ పెట్టాలి. డెఫినిషన్స్, థియరీకి సంబంధించిన చిన్న ప్రశ్నలు బాగా చదవండి. ఫార్ములా ఉన్న ప్రశ్నలకు తప్పనిసరిగా ఫార్ములా రాస్తూ అవసరమైన ప్రతిచోట డయాగ్రమ్స్ గీయాల్సి ఉంటుంది.

మేథ్స్-1ఎ

- Functions, Vector Algebra, Matrics, Trigonometric ratios వంటి చాప్టర్ల నుంచి రెండు మార్కుల ప్రశ్నలు వస్తాయి.
- Mathamatical Induction Chapterలో n^{th} term of A.P. & G.P, ఫార్ములాస్ పై పట్టు సాధించాలి. ఈ ప్రశ్న కంక్లూజన్ స్టెప్ పై దృష్టి పెట్టాలి.
- Functions Theorems బాగా ప్రాక్టీస్ చెయ్యాలి. దోషం లేకుండా రాయాలి.
- Matricesలో Definitions, Determinant Problems Consistant, Inconsistant Problems, CRAMER'S Rule, Matix Inversion Method, Gouss Jordan Problems బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Addition of Vectorsలో Collinear, Coplanarకి సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధిస్తూ Product of Vectorsలో Distance b/w Skew Lines Problems, Vector Triple Product Theorem బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Trigonometry Formulas పై బాగా పట్టు సాధించాలి.
- Properties of Triangles చాప్టర్‌లో Sides ఇచ్చినప్పుడు In Radius, Ex Radius, Circum Radiusలు కనుగొనుట (Vice Versa) బాగా ప్రాక్టీస్ చేయాలి.

మేథ్స్-1బి

- మేథ్స్-1బిలో 2 మార్కుల ప్రశ్నలు బాగా రాయాలంటే Stright lines, Limits and Continuity, Derivatives, Application of Derivatives నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి కాబట్టి వీటిని బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Locus, Transformation of Axes, Limits & Continuity, Derivative of The Funtion using first Priniciple Problems పై శ్రద్ధ పెడితే 4 మార్కుల సెక్షన్‌లో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Straight Linesలో Circum Center, Ortho Centre Problems, Foot of the Perpendicular, Image Theorems బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Pair of Straight Lines చాపర్టలో Theorems, Homogenising Conceptsకి సంబంధించిన ప్రాబ్లమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Angle b/w Two Lines by Using DR's & DC's పై శ్రద్ధ పెట్టాలి.
- Application of Derivatives నందు Tangent and Normal Concept లో Angle b/w Two Curves పై శ్రద్ధ పెడుతూ Maxima & Minima Conceptకి సంబంధించిన Cone, Cylinder, Sphere related problems బాగా ప్రాక్టీస్ చేయాలి. ఈ చాప్టర్‌లోని సమాధానాలకు అవసరమైన చోట యూనిట్లు (ప్రమాణాలు) రాయాలి.
- జూనియర్ ఇంటర్ calculus ప్రశ్నలకు సమాధానాల కోసం Trigonometry, Derivatives formulasపై పట్టు సాధించాలి.

మేథ్స్-2ఎ

- 2 మార్కుల ప్రశ్నలకు Complex Numbers, Permutations and Combinations, మొదలైన చాప్టర్ల నుంచి ఎక్కువగా వస్తాయి.
- Quadratic Equations, Complex Numbers, Partial Fractions పై శ్రద్ధ పెడితే 4 మార్కుల సెక్షన్‌లో గరిష్ఠ మార్కులు సాధించవచ్చు.
- Permutations & Combinations Chapterలో Sum of the digits, Rank of the given word problems పై శ్రద్ధ పెట్టండి. Combinations conceptకి సంబంధించి team selection problemsపై పట్టు సాధించాలి. ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు స్టెప్స్ రాయాలి.డైరెక్ట్ స్టెప్స్ రాయకూడదు. అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన Palindrome మొదలైన కాన్సెప్ట్ మీద లెక్కలు తప్పని సరిగా చేయాలి.
- Theory of Equations Chapterలో relation between the roots and coefficients, multiple roots, Reciprocal Equation concept కి సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి.
- Binomial Theoremలో Rational index problemsపై పట్టు సాధించాలి. number of terms in a Binominal and Trinomial expansions, General term, Indipendent term, Middle term, Binomial Coefficentsకి సంబంధించిన ప్రాబ్లమ్స్‌పై పట్టు అవసరం.
- Probability Chapterలో Addition Theorem, Multiplication Theorem, Bay's Theorem, వీటికి సంబంధించిన అప్లికేషన్స్‌పై పట్టు సాధించాలి.

మేథ్స్-2బి

- మేథ్స్-2బిలో 2 మార్కుల ప్రశ్నలకు Circles, Consic Section, Integrations బాగా ప్రాక్టీస్ చేయాలి.
- Circles, Integrations, Definite Integrations Chapters నుంచి 55 మార్కులు వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- Circles, System of Circles, Conic Sectionపై శ్రద్ధ పెట్టాలి.
- Circlesలో Concyclic Points, Direct Com Tangents, Transverse Common Tangents of given Two Circles సమస్యలపై పట్టు సాధించాలి. Relative Positions of Two Circles పై గూడా దృష్టి పెట్టాలి.
- Conic Sectionలో Parabola Standard Form, Properties of Ellipse, Hyper bolaపై పట్టు అవసరం
- Differential Equations Chapterలో ఉన్న నాలుగు Methods (Variable - Separable, Homogeneous, Non-Homogeneous, Linear Differential Equations), Order & Degree of Differential Equations పై పట్టు సాధించాలి.

కామర్స్

- వ్యాపార, వాణిజ్య రంగాలకి సంబంధించిన అనేక విషయాలను పరిచయం చేసే వేదిక కామర్స్. వివిధ వ్యాపార సంబంధిత వ్యవహారాలు ఎలా నిర్వహిస్తారనేది ఈ సబ్జెక్టు చర్చిస్తుంది.
- కామర్స్ సబ్జెక్ట్‌లో 50 మార్కులకు థియరీ, 50 మార్కులకు అకౌంట్స్ కలిపి 100 మార్కులకు పేపర్ ఉంటుంది.
- కామర్స్ మొదటి సంవత్సరంలో వ్యాపార భావనలు, వివిధ రకాల వ్యాపార సంస్థలు, కంపెనీ నిర్మాణం, వ్యాపార ఆర్థిక వనరులు, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు, వ్యాపారంలో ఉద్భవిస్తున్న ధోరణులు, భహుళ జాతీయ సంస్థలు.
- కామర్స్ ద్వితీయ సంవత్సరంలో వ్యవస్థాపకుడు, వ్యవస్థాపకత, స్వదేశీ, విదేశీ వర్తకం, వ్యాపార సేవలు, ఫైనాన్షియల్ మార్కెట్లు, వినియోగదారుల రక్షణ వంటి అంశాలు ఉంటాయి.
- అకౌంటింగ్‌లో మొదటి సంవత్సరంలో అకౌంటింగ్ భావనలు, ఖాతాల నిర్వహణ, జంటపద్దు విధానంలో ఖాతాల నిర్వహణ, చిట్టాలు, బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీ ముగింపు లెక్కలు ఉంటాయి.
- సెకండ్ ఇయర్‌లో కన్‌సైన్‌మెంట్ ఖాతాలు, భాగస్వామ్య ఖాతాలు, మరియు కంపెనీ ఖాతాలు వంటివి ప్రధానంగా ఉంటాయి. అకౌంటింగ్‌లో అధ్యాయాల మధ్య సంబంధం ఉండదు. అందువల్ల జాగ్రత్త వహించాలి.
- సెక్షన్-1లో మొత్తం మూడు 10 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థి వాటిలో రెంటికి సమాధానాలు రాయాలి.
- సెక్షన్-2లో ఆరు 5 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వాటిలో నాలుగు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- సెక్షన్-3లో ఎనిమిది 2 మార్కుల ప్రశ్నలు అడుగుతారు. వాటిలో ఐదింటికి సమాధానాలు రాయాలి.
- 2 మార్కులు, 10 మార్కులు, 5 మార్కుల ప్రశ్నలు - ఈ వరుసక్రమంలో సమాధానాలు రాయడం మంచిది.
- 5, 10 మార్కుల ప్రశ్నలకు జవాబులను పాయింట్లవారీగా రాసుకుంటే మంచి మార్కులు లభిస్తాయి.
- 10, 5 మార్కుల ప్రశ్నలు రాసేటప్పుడు సబ్ హెడ్డింగ్‌లను పెన్సిల్‌తో అండర్‌లైన్ చేయాలి. మంచి పాయింట్స్ వచ్చినప్పుడు వాటని కూడా అండర్‌లైన్ చేస్తే పేపర్ ప్రజంటేషన్ నీట్‌గా ఉంటుంది. ఈ ప్రశ్నలకు జవాబులో భాగంగా ఇంట్రడక్షన్ రాస్తే ఇంకా మంచిది.
- కామర్స్ ప్రశ్నల మధ్యలో అకౌంట్స్ ప్రశ్నలు రాయకూడదు. మొదట అకౌంట్స్, తదుపరి కామర్స్ ప్రశ్నలకు సమాధానాలు రాస్తే బాగుంటుంది.
- ప్రశ్నలో డిఫైన్ అని అడిగిన పక్షంలో డెఫినిషన్ రాసితీరాల్సిందే.
- బ్లూ లేదా బ్లాక్‌పెన్ మాత్రమే ఉపయోగించాలి. స్కెచ్ పెన్‌లు వద్దు.
- మంచి మార్కుల కోసం సొల్యూషన్ చేసే ముందు, ప్రాబ్లమ్‌ని జాగ్రత్తగా చదివి అవగాహన చేసుకోవాలి.
- సొల్యూషన్ చేసే క్రమంలో అమౌంట్స్‌ని జాగ్రత్తగా రాసుకోవాలి. రాంగ్ అమౌంట్స్ పడకుండా జాగ్రత్తపడాలి.
- అకౌంట్స్ పార్ట్‌లో మీరు బాగా పర్‌ఫెక్ట్‌గా ఉన్న ప్రాబ్లమ్‌తో స్టార్ట్ చేయాలి. 5 మార్క్స్‌లో ప్రాబ్లమ్స్ అటెంప్ట్ చేయటానికే ఇంపార్టెన్స్ ఇవ్వాలి. 2 మార్క్స్‌లో ప్రాబ్లమ్స్ అటెంప్ట్ చేసి థీయరి క్వశ్చన్స్ రాయటం మంచిది.
- 20 మార్క్స్ ప్రాబ్లమ్ (జూనియర్ ఇంటర్ వారికి ఫైనల్ అకౌంట్స్) (సీనియర్ ఇంటర్ వారికి పార్టనర్‌షిప్ అకౌంట్స్) సొల్యూషన్ చేసేటప్పుడు పక్కపక్కన ఉండేలా చూసుకోవాలి. దీంతో సమయం ఆదా అవుతుంది.
- ప్రతి ప్రాబ్లమ్‌కి పెన్సిల్‌తో నీట్‌గా ప్రొఫార్మాస్ గీసి, హెడ్డింగ్స్ రాయటానికి బ్లాక్ పెన్ ఉపయోగించాలి. ప్రాబ్లమ్ సొల్యూషన్ చేయటానికి బ్లూపెన్ వాడాలి.
- అకౌంట్స్ పార్ట్‌లో ఎక్కువ మంది విద్యారులు కాలిక్యులేషన్స్ విషయంలో తప్పులు చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ ఎగ్జామ్స్‌లో కాలిక్యులేటర్లను అనుమతించరు. ఈ విషయం గుర్తుంచుకోవాలి.
- అమౌంట్స్‌ని ఒక ఆర్డర్‌లో రాసుకుంటే కాలిక్యులేషన్స్ ఈజీగా ఉంటాయి. పొరపాట్లు దొర్లవు.
- **జూనియర్ ఇంటర్‌లో....** ఫైనల్ అకౌంట్స్ చాప్టర్‌లో రాని బాకీలు, రాని బాకీల నిధి, స్థిరాస్థులపై తరుగుదల లాంటి సర్దుబాట్ల విషయంలో జాగ్రత్త వహించాలి.
- మూడు వరుసల నగదు చిట్టా చేసేటప్పుడు ఎదురు పద్దుల విషయంలో జాగ్రత్తగా తప్పనిసరి.
- బ్యాంకు నిల్వల సమన్వయ పట్టీలో నగదు పుస్తకంలో జరిగిన తప్పులను అలాగే పాస్‌పుస్తకంలో జరిగిన తప్పులను లెక్కలో తీసుకునేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలి.
- సహాయక చిట్టాల తయారీ విషయంలో వర్తకపు డిస్కౌంట్‌ని లెక్కించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- వ్యక్తిగత ఖాతాను తయారు చేసేటప్పుడు ప్రారంభ నిల్వ విషయంలో అలాగే ఖాతా ముగింపు విషయంలో లెక్కలో ఇచ్చిన సమాచారాన్ని జాగ్రత్తగా గమనించాలి.
- **సీనియర్ ఇంటర్‌లో....** భాగస్వామ్య ఖాతాల తయారుచేసేటప్పుడు గుడ్‌విల్ ఖాతా, మూలధన ఖాతాలు, పునర్మూల్యాంకన ఖాతా విషయంలో జాగ్రత్త వహించాలి.
- కన్‌సైన్‌మెంట్ ఖాతాలు తయారీలో. ముగింపు సరుకు లెక్కింపు విషయంలో కేర్‌ఫుల్‌గా ఉండాలి.
- వ్యాపారేతర సంస్థల ఖాతాల విషయంలో ఆదాయ వ్యయాల ఖాతా తయారుచేసేటప్పుడు రాబడి అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. మూలధన అంశాలను వదిలివేయాల్సి ఉంటుంది.
- తరుగుదల ఖాతాలలో ఆస్థి ఖాతా తయారు చేసేటప్పుడు తరుగుదల ఎన్ని నెలలకు లెక్కించాలి అనే విషయంలో అలాగే వర్తకపు బిల్లులకు సంబంధించి డిసౌంట్ లెక్కించేటప్పుడు జాగ్రత్తగా పరిశిలించాలి.
- ఒంటిపద్దు విధానం చాప్టర్‌లో లాభనష్టాల నివేదిక తయారీలో ముగింపు మూలధనంతో ప్రారంభించాలి.

ఎకనామిక్స్

- చాలామంది ఎకనామిక్స్ అనగానే సోషల్ అనుకుంటారు. పదో తరగతి సోషల్‌కి ఇంటర్‌లోని ఎకనామిక్స్‌కు అసలు సంబంధం లేదు. ఎకనామిక్స్‌ని పిల్లలు హాయిగా చదవవచ్చు.
- ఫస్టియర్‌లో ఎకనామిక్స్ సిలబస్‌లో పది యూనిట్లు ఉన్నాయి. ఉపోద్ఘాతం, వినియోగ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ సిద్ధాంతం, పంపిణి సిద్ధాంతం, జాతీయ ఆదాయం, స్థూల ఆర్థిక అంశాలు, ద్రవ్యం-బ్యాంకింగ్-ద్రవ్యోల్బణం, ఆర్థికశాస్త్రం-గణాంక శాస్త్రం.
- సెకండియర్‌లో ఆర్థికవృద్ధి, ఆర్థికాభివృద్ధి, జనాభా, మానవ వనరుల అభివృద్ధి, జాతీయ ఆదాయం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, తృతీయ రంగం, సేవల రంగం, ప్రణాళిక-ఆర్థిక సంస్కరణలు, పర్యావరణం-సుస్థిర ఆర్థికాభివృద్ధి, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, లక్షణాలు వంటి అంశాలుంటాయి.
- మెదటి ఏడాదిలో 100 మార్కులకు, రెండో ఏడాదిలో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలంటే ఫస్టియర్‌కు సంబంధించిన వినియోగ సిద్ధాంతాలు, డిమాండ్, ఉత్పత్తి, విలువ సిద్ధాంతం, జాతీయ ఆదాయం, స్థూల ఆర్థిక అంశాలు లాంటి చాప్టర్లపై పట్టు ఉండాలి.
- ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఆర్థిక వృద్ధి - ఆర్థికాభివృద్ధి, జనాభా మానవ వనరుల అభివృద్ధి, జాతీయ ఆదాయం, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, ప్రణాళికలు, పర్యావరణం చాప్టర్ల మీద మంచి పట్టు ఉండాలి.

జూనియర్ ఇంటర్

- మంచి మార్కులు సంపాదించాలనే విద్యార్థులకు ముందుగా సమాధానాలపై పట్టు ఉండాలి.
- ఎస్సేలు రాసేటప్పుడు ఇంట్రడక్షన్, డెఫినిషన్స్ తప్పులు లేకుండా చూసుకోవాలి. టేబుల్స్ & డయాగ్రమ్స్ తప్పులు లేకుండా వేయాలి.
- ముందుగా ఎస్సే ప్రశ్నలు (10 మార్కులు) ప్రశ్నలు రాయాలి. ఆ తరువాత వెరీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (2 మార్కులు), చివరగా షార్ట్ ఆన్సర్ ప్రశ్న(5 మార్కులు)లు రాస్తే సమయం సరిపోతుంది.
- డయాగ్రమ్స్ ఉన్న ప్రశ్నలు రాస్తే వాల్యుయేషన్‌లో ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది.
- క్వశ్చన్ నంబర్లు కచ్చితంగా కనిపించేలా వేయాలి.

సీనియర్ ఇంటర్

- రెండో సంవత్సరానికి ప్రాణం సైడ్ హెడ్డింగ్స్ టెక్స్ట్‌బుక్‌లో ఉన్నవి వ్రాసి అండర్‌లైన్ చేయాలి.
- ఎస్సే ప్రశ్నలు (10 మార్కులు) ప్రశ్నలు ముందు రాయాలి. ఆ తరవాత వెరీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు (2 మార్కులు), చివర్లో షార్ట్ ఆన్సర్ (5 మార్కులు) ప్రశ్నలు వ్రాయాలి.
- ఆర్థికవృద్ధి - ఆర్థికాభివృద్ధి, జనాభా మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయరంగం. పారిశ్రామికరంగం, జాతీయ ఆదాయం చాప్టర్ల నుంచి ఎస్సేలు వచ్చే అవకాశం ఉంది.
- మిగిలిన చాప్టర్ల నుంచి 5 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. పై చాప్టర్ల నుంచి కూడా రావచ్చు. వెయిటేజ్‌ని కచ్చితంగా ఫాలో అవుతారు అని చెప్పలేం అందుకని ఏ చాప్టర్ నుంచైనా ప్రశ్న అడగవచ్చు. ఎక్కువ మార్కులు సంపాదించాలంటే అన్ని చాప్టర్లపై పట్టు ఉండాలి.
- టేబుల్స్ & డేటా తప్పులు లేకుండా వేయాలి.

సి.ఎ.రాధ
అకడమిక్ అడ్వయిజర్,
మాస్టర్ మైండ్స్



Scholarship Alert

College Board India Scholars Program

Category: Means cum Merit
Description: College Board is providing scholarship to meritorious Indian students coming from under-privileged section of society, to study in any one of the ten partner universities. Class 12 students need to appear for SAT exam in March 2019.
Eligibility: Class 12 students who are studying in India and have family income less than 6 lakh can appear for the test.
Prizes & Rewards: Exam fee of SAT exam (worth INR 7000) is exempted for all class 12 students with family income less than 6 Lakh. Students who score very well and have family income less than 4 Lakh are eligible to get full tuition scholarship to study in any partner university.
Last Date to apply: February 08, 2019
ApplicationMode: Applications are invited online only.
Short Source URL:
http://www.b4s.in/AJ/CBI1

HP Udaan Scholarship Program 2018-19

Category: Mean cum Merit Based
Description: HP Inc. India is giving this scholarship to students of economically weaker section, pursuing their higher studies in post-matric courses, under-graduation and diploma programs from any accredited institute. A total of 750 scholars will be selected, where 50% seats are reserved for the female candidates.
Eligibility: Students who have cleared class 10 in 2018 and currently enrolled for 1-year diploma/ITI or 2- year HSC/Diploma/ITI programs. Students who have cleared class 12 in 2018 and currently enrolled for 3-year diploma or 3-year UG programs. Candidates must have minimum 60% marks in last qualifying examination & having family income less than INR 4L p.a. are eligible.
Prizes & Rewards: For class 11-12/ITI/Diploma, INR 20K p.a.; for 3-years degree/diploma, INR 30K p.a.; one-time INR 20K for 1 Year ITI/Diploma.
Last Date to apply: February 26, 2019
ApplicationMode: Online applications only.
Short URL:
http://www.b4s.in/AJ/HUS2

CLP India Scholarship Scheme 2019

Category: Means Based
Description: CLP India has announced scholarships for the students pursuing their higher education from class 10 to post graduation, including diploma and vocational training. This scheme provides a partial financial support to aspiring students for their study with added emphasis on girl students.
Eligibility: Candidates residing in CLP plant locations in 7 states, includingTelangana and pursuing class 10-12, graduation, diploma, vocational training and post-graduation. Candidates must have scored 50% in their previous annual examination.
Prizes & Rewards: Up to INR 6000 for class 10-12 and up to INR 18000 for higher studies.Special incentive of up to INR 5000 for girls and INR 2500 for boys is also available. Total 850 students will receive scholarships.
Last Date to apply: March 31, 2019
ApplicationMode: Online applications are accepted.
Short Source URL:
http://www.b4s.in/AJ/CIS10



Courtesy: www.buddy4study.com

హైదరాబాద్ నుంచి జెద్దాకు విమానం

న్యూఢిల్లీ: గల్ఫ్ ప్రాంతానికి మరో సర్వీసును ప్రకటించింది స్పైస్‌జెట్. వచ్చే నెల 25 నుంచి హైదరాబాద్- జెద్దా నగరాల మధ్య డైలీ నాన్‌స్టాప్ విమాన సేవలను ప్రారంభించబోతున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మార్గంలో 189 సీట్ల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737 మాక్స్ విమానాన్ని నడపనుంది. ప్రారంభ ఆఫర్‌గా హైదరాబాద్- జెద్దా చార్జీని రూ.13,499 (పన్నులతో కలిపి), జెద్దా-హైదరాబాద్ టిక్కెట్ ధరను రూ.10,799గా ప్రకటించింది సంస్థ. స్పైస్‌జెట్‌కిది తొమ్మిదో అంతర్జాతీయ విమాన సర్వీసు. ప్రతి రోజు ఉదయం 7.10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి అదే రోజు 11.05 గంటలకు (స్థానిక కాలమానం) జెద్దా చేరుకుంటుంది.

'పావు' తగ్గొచ్చు!

ఆర్‌బీఐ రెపో రేట్లపై ఎస్‌బీఐ రీసెర్చ్

న్యూఢిల్లీ: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను పావు (0.25) శాతం తగ్గించవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేస్తోంది. "ఈసారి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ తన వైఖరిని మెరుగుపరిచినప్పటికీ వడ్డీ (రెపో) రేట్లను మాత్రం ఏప్రిల్ సమీక్షలోనే తగ్గించవచ్చని భావిస్తున్నాం. అయితే ఈసారే పావు శాతం తగ్గించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని తాజా నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష మంగళవారం ప్రారంభంకానుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమీక్ష నిర్ణయాలను 7వ తేదీన ప్రకటించనుంది. ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టాక జరగనున్న తొలి సమీక్ష ఇదే. ఈసారి సమీక్షలోనే రెపో రేట్లను తగ్గించేందుకు ఆర్‌బీఐకి చాలా అంశాలు దోహదపడనున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ అంటోంది.

హైదరాబాద్‌లోనే ఇంటి ధర తక్కువ

- పూర్తైన గృహాలపైనే మక్కువ
- 99ఎకర్స్.కామ్ నివేదిక



హైదరాబాద్ : దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే ఇంకా ఇళ్ల ధరలు అత్యంత అందుబాటు ధరల్లో (అఫర్డబుల్) లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ పరిణామాలను పరిశీలించే '99ఎకర్స్‌కామ్' పోర్టల్ తన తాజా త్రైమాసిక నివేదికలో ఈ విషయం పేర్కొంది. నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగం ఇందుకు బాగా దోహదం చేస్తోంది. బిల్డర్లు కూడా ప్రజల కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకుని రూ.40 లక్షల లోపు ధరలు ఉండే ఇళ్లు లేదా ఫ్లాట్లనే నిర్మిస్తున్నారు. దీంతో గత ఏడాది జూలై-సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇళ్ల ధర సగటున రెండు శాతం వరకు పెరిగిందని ఆ నివేదిక పేర్కొంది. రెరా చట్టం కింద నమోదైన ఆస్తులు, ఆర్థిక కారిడార్లకు, ఇంటి నుంచి ఆఫీసులు, ఇతర ప్రధాన ప్రాంతాలకు చేరుకునేందుకు మంచి రవాణా సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లో ఇళ్లకు కొనుగోలుదారులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇంకా నిర్మాణం పూర్తయినా లేదా పూర్తయ్యేందుకు దగ్గరలో ఉన్న ఇళ్లు, ఫ్లాట్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో హైదరాబాద్ స్థిరాస్తి రంగంలో నిర్మించిన వెంటనే అమ్ముడుపోయే ఇళ్లు, ఫ్లాట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నివేదికలోని ప్రధాన అంశాలు

- రియల్టీ మార్కెట్‌లో రికవరీ కొనసాగుతోంది
- 2018క్యూ3లో దేశవ్యాప్తంగా 34,893 కొత్త ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్
- రెరా చట్టంతో కొనుగోలుదారుల్లో పెరిగిన నమ్మకం
- రూ.40 లక్షల లోపు ఇళ్లకే ఎక్కువ గిరాకీ
- ముంబైలో నిర్మాణం పూర్తయిన లేదా పూర్తి కావచ్చిన గృహాలకే డిమాండ్
- డిసెంబరు త్రైమాసికానికి తెలంగాణలో రెరా కింద 16కు మించని ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లు

దేశ వ్యాప్తంగా...

హైదరాబాద్‌తోపాటు దేశంలోని మిగతా ఏడు ప్రధాన నగరాల్లోని స్థిరాస్తి రంగం తీరుతెన్నులనూ 99ఎకర్స్‌కామ్' తన త్రైమాసిక నివేదికలో పేర్కొంది. గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే నాలుగో త్రైమాసికంలో మార్కెట్ మెరుగుపడింది. 2017 డిసెంబరుతో పోలిస్తే అమ్ముడుపోని యూనిట్ల సంఖ్య 5.20 లక్షల నుంచి 4.68 లక్షలకు తగ్గింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లపై జీఎస్‌టీ భారం ప్రస్తుత 12 శాతం నుంచి ఐదు శాతానికి ఎప్పుడు తగ్గిస్తారా? అని కొనుగోలుదారులు ఎదురు చూస్తున్నట్టు నివేదిక పేర్కొంది.

రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్).. ఒకప్పుడు టెలికాం రంగంలో సంచలనం. పదిహేనేళ్ల క్రితం మొబైల్ టెలిఫోన్ సేవలను అందించటంలో ఎవరికి అందనంత ఎత్తులో ఉన్న కంపెనీ. ఇది గతం. ప్రస్తుతం రోజువారీ కార్యకలాపాల కోసం మరొకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి. అనిల్ అంబానీ నిర్వహణలోని ఆర్‌కామ్, ఆర్‌పవర్, ఆర్‌ఇన్‌ఫ్రా ఇలా ఏ ఒక్కటి కూడా గడచిన కొన్నేళ్లుగా లాభాలు ఆర్జించిన పరిస్థితే లేదు. వ్యాపార నిర్వహణ కోసం తీసుకున్న రుణాలను చెల్లించలేక ఆర్ కామ్ దివాలా దశకు చేరింది. దీంతో కంపెనీకి రుణాలిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆస్తుల విక్రయం ద్వారా బకాయిలు పూర్తిగా వసూలవుతాయో లేదోనని రుణదాతలు భయపడుతున్నారు.



వామ్మో ఆర్‌కామ్..

ఒకే రోజు షేరు 35 శాతం పతనం

- కర్పూరంలా కరిగిన మార్కెట్ విలువ
- నాడు షేరు ధర రూ.800... నేడు రూ.7.55
- దివాలా ప్రక్రియను ఎంచుకున్న బోర్డు

న్యూఢిల్లీ: రుణదాతలకు అప్పులు చెల్లించేందుకు ఆస్తులను విక్రయించాలని నిర్ణయించినప్పటికీ సాధ్యంకాలేదని అనిల్ అంబానీ సారథ్యంలోని ఆర్‌కామ్ గత వారం ప్రకటించింది. రుణాలను చెల్లించలేకపోవటంతో తాము దివాలా ప్రొసీడింగ్స్‌ను ఎంచుకుంది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముసాయిదాకు అనుగుణంగా రుణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. దివాల పరిష్కార చర్యలకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆర్‌కామ్ ప్రకటించటంతో సోమవారం స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు కుప్పకూలింది. బీఎస్ఈలో ఆరంభం నుంచి పతనబాటలో సాగిన షేరు ఒక దశలో 48.27 శాతం మేర పడిపోయి రికార్డు కనిష్ఠ స్థాయి రూ.6కు చేరింది. చివరకు 34.91 శాతం నష్టపోయి రూ.7.55 వద్ద క్లోజైంది. ఎన్ఎస్ఈలో కూడా కంపెనీ షేరు అదే ధోరణిలో సాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 34.91 శాతం నష్టంతో రూ.7.55 వద్ద ముగిసింది. బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,087.98 కోట్ల నుంచి రూ.1,120.02 కోట్లకు పడిపోయింది. బీఎస్ఈలో మొత్తం 4.25 కోట్ల షేర్లు ట్రేడవగా ఎన్ఎస్ఈలో 37 కోట్ల షేర్లు చేతులు మారాయి. పదేళ్ల క్రితం ఆర్‌కామ్ షేరు సుమారు రూ.800 స్థాయిలో ఉండటం గమనార్హం.

రుణ భారం 46,000 కోట్లు

ప్రస్తుతం ఆర్‌కామ్ రుణ భారం రూ.46,000 కోట్లు. 2017 జూన్ 2 నుంచే వ్యూహాత్మక రుణ పరిష్కార ప్రణాళికను ప్రారంభించింది. ఒక దశలో ముకేశ్ అంబానీ కంపెనీ ఆర్‌జియో.. అనిల్ అంబానీని గట్టెక్కించేందుకు రూ.25,000 కోట్లతో స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. అయితే రెగ్యులేటరీ అనుమతులు రాకపోవటంతో సంక్షోభంలోకి జారుకుంది. ఈ 18 నెలల్లో ఆస్తులు, స్పెక్ట్రమ్ విక్రయం వంటి వాటి ద్వారా బయటపడాలని భావించినప్పటికీ ప్రయోజనం కలుగలేదు.

ఇతర కంపెనీలదీ అదేబాట

ఆర్‌కామ్‌తోపాటు అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ పవర్, రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ఆర్‌పవర్ షేరు ఏకంగా 35.10 శాతం నష్టంతో రూ.17.10 వద్ద, ఆర్‌క్యాపిటల్ 19.80 శాతం నష్టపోయి రూ.151.70 వద్ద, ఆర్‌ఇన్‌ఫ్రా షేరు 14.87 శాతం క్షీణించి రూ.227.25 వద్ద, రిలయన్స్ నావల్ షేరు 14.72 శాతం నష్టపోయి రూ.10.08 వద్ద క్లోజయ్యాయి.

సుప్రీం నోటీసులు

ఆర్‌కామ్ ఛైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీం కోర్టు సోమవారం నాడు నోటీసులు జారీ చేసింది. అనిల్ అంబానీపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలంటూ ఎరిక్సన్ ఇండియా.. సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. రూ.550 కోట్ల బకాయిలు చెల్లించకుండా రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌తో డీల్ కుదుర్చుకుందని, ఈ కేసులో న్యాయస్థానం బకాయిలు చెల్లించాలని ఆదేశించినా ఆర్‌కామ్ పట్టించుకోలేదని పేర్కొంది. కోర్టు ధిక్కార నేరం కింద అనిల్ అంబానీని జైలుకు పంపించాలని కోరింది. దీంతో సుప్రీం కోర్టు.. అనిల్ అంబానీకి నోటీసులు జారీ చేసింది. కాగా కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు రిజిస్ట్రీ దగ్గర బకాయిల చెల్లింపు నిమిత్తం రూ.118 కోట్లు డిపాజిట్ చేసేందుకు ఆర్‌కామ్‌కు జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్ నేతృత్వంలోని బెంచ్ అనుమతినిచ్చింది. రెండు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ఈ మొత్తాలను చెల్లించేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆర్‌కామ్ తెలిపింది.

మీ అభ్యంతరాలు చెప్పండి

ఎరిక్సన్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశం

ఆర్‌కామ్ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎరిక్సన్ ఇండియాకు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) సూచించింది. ఈ నెల 8వ తేదీలోగా పిటిషన్ దాఖలు చేయాలని ఎన్‌సీఎల్‌ఏటీ ఛైర్మన్ జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బెంచ్ ఆదేశించింది. ఎన్‌సీఎల్‌ఏటీ లేదా సుప్రీం కోర్టు తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఆర్‌కామ్ ఆస్తులను కార్పొరేట్ రుణ గ్రహీత, వాది, ప్రతివాది (ఎరిక్సన్ ఇండియా), గ్యారంటర్లు లేదా థర్డ్ పార్టీ సంస్థలు.. విక్రయించటం, బదలాయించటం లాంటివి చేపట్టరాదని స్పష్టం చేసింది. ఎన్‌సీఎల్‌టీ జారీ చేసిన ఉత్తర్వులు వ్యతిరేకంగా మూడు రిలయన్స్ గ్రూప్ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకోవటాన్ని వ్యతిరేకిస్తూ ఎరిక్సన్ ఇండియా.. ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించింది.

ఆర్‌కామ్‌కు రూ.2,000 కోట్లు తిరిగిచ్చేయండి

లెవీల నుంచి ఆర్‌కామ్ స్పెక్ట్రమ్‌ను మినహాయిస్తూ టెలికాం ట్రిబ్యునల్ టీడీశాట్ ఆదేశాలు జారీ చేసింది.ఆర్‌కామ్‌కు అదనపు స్పెక్ట్రమ్ కేటాయింపు విషయంలో లెవీలు విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీశాట్ కొట్టివేసింది. అంతేకాకుండా ఆర్‌కామ్‌కు రూ.2,000 కోట్లు తిరిగి చెల్లించాలని టెలికాం శాఖను కోరింది. సీడీఎంఏలో 5 మెగాహెట్జ్, జీఎస్ఎం బ్యాండ్‌లో 6.2 మెగాహెట్జ్ వరకు స్పెక్ట్రమ్‌ను ఏ టెలికాం సంస్థ అయినా ఉంచుకునే అవకాశం ఉంటుంది. దీనిపై వన్‌టైమ్ స్పెక్ట్రమ్ చార్జ్ (ఓటీఎస్‌సీ) లెవీల నుంచి మినహాయింపులను టీడీశాట్ ఇస్తుంది. ఆర్‌కామ్ స్పెక్ట్రమ్ కేటాయింపులో ఓటీఎస్‌సీ లెవీని విధించటాన్ని టీడీశాట్ తప్పుబట్టింది. అంతేకాకుండా ఈ మొత్తాలను ఆర్‌కామ్‌కు చెల్లించాలని టెలికాం శాఖను ఆదేశించింది.



మార్కెట్లోకి కొత్త క్విడ్

ప్రారంభ ధర రూ.2.67 లక్షలు

న్యూఢిల్లీ: ఫ్రెంచ్ ఆటో దిగ్గజం రెనో.. సరికొత్త క్విడ్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో ఆధునిక భద్రతా సదుపాయాలున్నాయని కంపెనీ తెలిపింది. దీని ధర రూ.2.67 లక్షల నుంచి రూ.4.63 లక్షల (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) వరకు ఉంది. 0.8 లీటర్, 1 లీటర్ పెట్రోల్ ఇంజన్లతో మాన్యువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్‌లతో కొత్త క్విడ్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. పాదచారుల భద్రతా, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్‌తో కూడిన యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, డ్రైవర్ ఎయిర్ బ్యాగ్, డ్రైవర్‌తో పాటు కోడ్రైవర్ సీట్ బెల్ట్ రిమైండర్, స్పీడ్ అలర్ట్ వంటివి అన్ని వేరియంట్లలో స్టాండర్డ్‌గా ఉన్నాయని కంపెనీ పేర్కొంది. 17.64 సెంటీమీటర్ టచ్ స్క్రీన్ మీడియా, నావిగేషన్ సిస్టమ్ కూడా ఇందులో ఉంది.

బజాజ్ ఆటో విక్రయాల్లో 15 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో జనవరి విక్రయాలు 15 శాతం పెరిగి 4,07,150 యూనిట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలకు 3,53,147 వాహనాలను విక్రయించింది. గతనెలలో సంస్థ మోటార్ సైకిళ్ల అమ్మకాలు 21 శాతం పెరిగి 3,50,460 యూనిట్లకు చేరుకోగా.. వాణిజ్య వాహన విక్రయాలు మాత్రం 12 శాతం తగ్గి 56,690 యూనిట్లకు పరిమితమయ్యాయి. కాగా, 1,75,689 వాహనాలను ఎగుమతి చేసింది.

ఏఐలో మనమే ముందు..

- 2021నాటికి జీడీపీలో 60 శాతం కృత్రిమ మేధ ప్రభావం
- కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వాద్వాన్

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): దేశంలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) వ్యాప్తి వేగవంతంగా జరుగుతోందని, త్వరలోనే అమెరికా, చైనా తర్వాత దీని వినియోగంలో మనమే ముందుంటామని కేంద్ర వాణిజ్య శాఖ సెక్రటరీ అనూప్ వాద్వాన్ తెలిపారు. మన ఐటీ నిపుణులు భావి టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో ముందుంటారన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) నిర్వహిస్తున్న ఇండియా సాఫ్ట్-2019 సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా అనూప్ వాద్వాన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశ జీడీపీలో ఏఐ వ్యాప్తి ప్రభావం ఎనిమిది శాతంగా ఉందని, 2021నాటికి ఇది 60 శాతానికి పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వాద్వాన్

దేశంలో ఐటీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రస్తుతం భారత్ నుంచి నుంచి సుమారు 125 దేశాలకు ఐటీ ఉత్పత్తుల ఎగుమతి జరుగుతోందని చెప్పారు. స్టార్టప్‌లు ఏఐ, రోబోటిక్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఈ-గవర్నెన్స్, ఆరోగ్యం వంటి వాటిలో ఆవిష్కరణలకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. తెలంగాణ ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో టీహబ్ ద్వారా అనేక అంకుర సంస్థలు ప్రారంభమయ్యాయన్నారు. ఈఎస్‌సీ ఛైర్మన్ మన్‌దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ ఈఎస్‌సీ 2001లో ప్రారంభించిన ఇండియా సాఫ్ట్ 19వ వార్షిక సమావేశాన్ని నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు.

ఎగుమతులు 31,400 కోట్ల డాలర్లకు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ ఎగుమతులు 31,400 కోట్ల డాలర్లు దాటవచ్చని అనూప్ వాద్వాన్ తెలిపారు. 2013-14 సంవత్సరంలో ఈ స్థాయి గరిష్ఠ ఎగుమతులు నమోదయ్యాయన్నారు.

రూ.1,050 కోట్లు

ఎస్సెల్ ప్రమోటర్ సంస్థలు విక్రయించిన షేర్ల విలువ

న్యూఢిల్లీ: ఎస్సెల్ గ్రూపునకు చెందిన ప్రమోటర్ సంస్థలు ఆరు లిస్టెడ్ గ్రూపు సంస్థల్లో రూ.1,050 కోట్లకు పైగా విలువైన షేర్లను విక్రయించాయి. ఈ ఏడాది జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ మధ్యకాలంలో బహిరంగ మార్కెట్లో ఈ షేర్ల అమ్మకం జరిగింది. ఎస్సెల్ గ్రూపునకు చెందిన పలు ప్రమోటర్ గ్రూపు సంస్థలు షేర్ల విక్రయానికి సంబంధించిన వివరాలను వివిధ రెగ్యులేటరీ సంస్థలకు సమర్పించడంతో ఈ విషయం వెలుగు చూసింది. కంపెనీలు సమర్పించిన వివరాల ప్రకారం.. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీ, జీ మీడియా కార్పొరేషన్, సిటీ నెట్‌వర్క్స్ లిమిటెడ్, జీ లెర్న్ కంపెనీల్లో షేర్లను విక్రయించారు. ఫ్లాగ్‌షిప్ సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమోటర్ సంస్థలైన సిక్వేటర్ మీడియా సర్వీసెస్, ఎస్సెల్ కార్పొరేట్ ఎల్ఎల్‌పీలు వరుసగా 1.69 శాతం, 0.85 శాతం వాటాలను విక్రయించడం ద్వారా ఎస్సెల్ గ్రూప్ రూ.874.11 కోట్లు సమీకరించగలిగింది.

ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) కొత్త ఛైర్మన్‌గా కె ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కుమార్ ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. కుమార్ ఇప్పటి వరకు ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (అగ్రి బ్యాంకింగ్)గా పని చేశారు. ఇప్పటి వరకు ఛైర్మన్‌గా ఉన్న వి నరసిరెడ్డి స్థానంలో కుమార్ ఈ నెల 2న బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపాలతోపాటు ఐటీ, ఐటీ ఆధారిత సమ్మిళిత ఆర్థిక విషయాల్లో కుమార్‌కు విశేషం అనుభవం ఉంది.

లారస్ లాబ్స్ సీఈఓకు అవార్డు



ముంబై: ప్రతిభావంతులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇచ్చే 'ఈవై ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డులకు హైదరాబాద్‌నకు చెందిన రెండు ఫార్మా కంపెనీల సీఈఓలు ఎంపికయ్యారు. లారస్ లాబ్స్ కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ చావా సత్యనారాయణ, ఇంటాస్ ఫార్మాసూటికల్స్ వైస్ ఛైర్మన్, ఎండీ బినీష్ చుద్గర్‌లను 2018 సంవత్సరానికిగాను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ నేతృత్వంలోని ఎనిమిది మంది నిపుణుల కమిటీ, ఫ్యూచర్ గ్రూపు వ్యవస్థాపకులు, సీఈఓ కిశోర్ బియానీ, టైటాన్ కంపెనీ ఎండీ భాస్కర్ భట్, ఐషర్ మోటార్స్ ఎండీ, సీఈఓ సిద్ధార్థ లాల్‌తో సహా 16 మందిని ఈ అవార్డుల కోసం ఎంపిక చేసింది. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీని లైఫ్‌టైమ్ అవార్డుకు ఎంపిక చేశారు. మొత్తం 240 నామినేషన్ల నుంచి వీరిని ఎంపిక చేసినట్టు ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ తెలిపింది.

113.31 సెన్సెక్స్	18.60 నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
36,582.74	10,912.25	33,375	40,110	71.80	61.93
		ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	345	55 పైసలు	

2020 మార్చినాటికి 3 సాధారణ బీమా కంపెనీల విలీనం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని (పీఎస్‌యూ) మూడు సాధారణ బీమా కంపెనీల విలీనం 2020 మార్చి నాటికి పూర్తవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల విలీనం చేయనున్నట్టు 2018-19 బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే ఈ విలీనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే 2019-20 తాత్కాలిక బడ్జెట్‌లో మాత్రం ఈ కంపెనీల విలీనం వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ విలీన ప్రక్రియ కొనసాగుతోందని, దీని పూర్తి చేసేందుకు అవసరమైన వివిధ చర్యలు తీసుకుంటున్నట్టు అందులో వెల్లడించారు. 2017 మార్చి 31 నాటికి ఈ మూడు కంపెనీల వద్ద 200కు పైగా బీమా ఉత్పత్తులున్నాయి. వీటి మొత్తం ప్రీమియం రూ.41,461 కోట్లు ఉండగా.. మార్కెట్ వాటా 35 శాతంగా ఉంది. అంతేకాకుండా ఈ కంపెనీల ఉమ్మడి నెట్‌వర్త్ రూ.9,243 కోట్లు, ఉద్యోగుల సంఖ్య దాదాపు 44,000 వరకు ఉంది. మూడు కంపెనీల కలయిక ద్వారా దేశంలోనే అతిపెద్ద సాధారణ బీమా కంపెనీ ఏర్పాటుకానుంది. దీని విలువ రూ.1.2-1.5 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. 2017 సంవత్సరంలోనే న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలు స్టాక్ మార్కెట్లో నమోదయ్యాయి.

ఆర్ఐఎల్ మద్దతు.. చివర్లో ర్యాలీ



113 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం 400 పాయింట్ల మేరకు ఊగిసలాడినా చివర్లో ఆర్ఐఎల్ షేరు అందించిన మద్దతు కారణంగా లాభాలతో ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షకు ముందు విదేశీ సంస్థలు అప్రమత్త వైఖరి ప్రదర్శించడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. వడ్డీ రేట్ల ప్రభావానికి లోనయ్యే షేర్లు నష్టపోగా బడ్జెట్ అందించిన ఉత్సాహంతో వినియోగ విభాగానికి చెందిన కంపెనీల షేర్లు లాభాలతో ట్రేడయ్యాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడిన షేరుగా ఆర్ఐఎల్ 140 పాయింట్ల మేరకు ర్యాలీకి మద్దతు ఇచ్చింది. ఈ షేరు 3.52 శాతం లాభంతో రూ.1291.15 వద్ద ముగిసింది. మొత్తం మీద బీఎస్ఈ సెన్సెక్స్ 113.31 పాయింట్ల లాభంతో 36622.77 వద్ద ముగియగా నిఫ్టీ 18.60 పాయింట్ల లాభంతో 10912.25 పాయింట్ల వద్ద ముగిసింది. వినియోగ విభాగానికి చెందిన కంపెనీలు, ప్రైవేటు బ్యాంకులపై ఇన్వెస్టర్లు అధికంగా దృష్టి పెట్టారని, మార్కెట్ ఇప్పుడు ఆర్‌బీఐ పాలసీ కోసం ఎదురు చూస్తున్నదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం అధిపతి వినోద్ నాయర్ అన్నారు. అమెరికా ఆర్థిక వృద్ధితో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా వడ్డీరేట్ల పెంపునకు విరామం ఇస్తున్నట్టు ఫెడరల్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ చేసిన ప్రకటనతోను, చైనాలోను, ఇతర వర్ధమాన మార్కెట్లలోను నెలకొన్న మాంద్యం కారణంగాను భారత మార్కెట్ ఆకర్షణీయంగా కనిపిస్తున్నదని ఆషికా గ్రూప్ ఈక్విటీ పరిశోధన విభాగం ప్రెసిడెంట్ పరాస్ బోత్రా అన్నారు.

- సెన్సెక్స్‌లో లాభపడిన షేర్లలో ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, కోటక్ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్తాన్ యూనిలీవర్ 3 శాతానికి పైబడి లాభపడ్డాయి.
- పవర్‌గ్రిడ్, యెస్‌బ్యాంక్, ఎన్‌టీపీసీ, సన్ ఫార్మా, మహీంద్రా, ఐటీసీ, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్ 3 శాతానికి పైబడి నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి.
- నిరాశావహమైన మూడో త్రైమాసికం ఫలితాల కారణంగా ఐడీబీఐ షేరు 6 శాతం నష్టపోయింది. బీఎస్ఈలో ఈ షేరు 4.07 శాతం నష్టంతో రూ.50.65 వద్ద ముగిసింది.

లాభపడిన డీహెచ్ఎఫ్ఎల్

వరుసగా ఐదు రోజుల నష్టాలకు తెరదించి డీహెచ్ఎఫ్ఎల్ షేరు సోమవారం 4 శాతం లాభపడింది. బీఎస్ఈలో ఒక దశలో 13 శాతం మేరకు నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.97కి దిగజారినా చివరికి 4.17 శాతం లాభంతో రూ.116.10 వద్ద ముగిసింది.

ఎన్నికల తర్వాత ఐపీఓకు ఏబీడీ

» రూ.700- 800 కోట్ల సేకరణ లక్ష్యం
» పీఈలకు వాటా విక్రయంతో

రూ.600 కోట్లు సేకరించనున్న సంస్థ

ముంబై: కిశోర్ ఛాబ్రియాకు చెందిన లిక్కర్ తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ (ఏబీడీ).. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రావాలనుకుంటోంది. తద్వారా ప్రైమరీ మార్కెట్ నుంచి రూ.700-800 కోట్ల మేర నిధులు సేకరించే యోచనలో ఉంది. జేఎం ఫైనాన్షియల్, క్రెడిట్ స్విస్‌లకు ఐపీఓ నిర్వహణ బాధ్యతలు కట్టబెట్టింది. అయితే, ఐపీఓకు ముందే సంస్థలో కొంత వాటా విక్రయం ద్వారా రూ.600 కోట్ల వరకు సేకరించేందుకు ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలతో చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతున్న స్టాక్ మార్కెట్లు లోక్‌సభ ఎన్నికల తర్వాత నిలకడగా ఉండవచ్చని ఏబీడీ ఆశాభావం వ్యక్తం చేసింది. మార్కెట్లో పరిస్థితులు సర్దుకున్నాకే పబ్లిక్ ఆఫరింగ్‌కు రావాలనుకుంటున్నట్టు తెలిపింది. 2016లోనూ ఐపీఓకు వస్తున్నట్టు ప్రకటించిన ఏబీడీ.. ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతిపాదనను విరమించుకుంది. మూడో అతిపెద్ద లిక్కర్ తయారీ సంస్థ అయిన ఏబీడీకి 10.5 శాతం మార్కెట్ వాటా ఉంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా సంస్థ ప్రమోటర్ కిశోర్ ఛాబ్రియా తన 97 శాతం వాటాలో 10 శాతాన్ని విక్రయించనున్నారు.

లక్ష్మీ విలాస్ బ్యాంకు నష్టం రూ.373 కోట్లు

చెన్నై: డిసెంబరు త్రైమాసికంలో లక్ష్మీ విలాస్ బ్యాంకు రూ.373.48 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. ఏడాది క్రితం ఇదే కాలం నష్టం రూ.39.23 కోట్లతో పోలిస్తే బ్యాంకు నష్టం బాగా పెరిగింది. ఏడాది క్రితంతో పోలిస్తే 2018-19 మొదటి తొమ్మిది నెలలకు నష్టం రూ.37.38 కోట్ల నుంచి రూ.629.66 కోట్లకు చేరింది. మూడో త్రైమాసిక ఆదాయం రూ.817.57 కోట్ల నుంచి రూ.762.47 కోట్లకు తగ్గగా.. తొమ్మిది నెలలకు రూ.2,647.51 కోట్ల నుంచి రూ.2,350.48 కోట్లకు తగ్గింది.

ఫ్యూచర్ రిటైల్ ఆదాయం 5,306 కోట్లు

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికానికి ఫ్యూచర్ రిటైల్ రూ.201.43 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో లాభం రూ.183.14 కోట్లు ఉంది. మొత్తం ఆదాయంరూ.4,696 కోట్ల నుంచి రూ.5,306 కోట్లకు చేరింది. హోమ్ రిటైల్ వ్యాపారాన్ని వేరు చేయడం వంటి కారణాల వల్ల అంతక్రితం ఏడాది 9 నెలలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల ఫలితాలను పోల్చలేమని వివరించింది.

ఐడీబీఐ బ్యాంక్‌కు మొండి బకాయిల దెబ్బ

క్యూ3లో రూ. 4,185 కోట్లకు చేరిన నష్టాలు

న్యూఢిల్లీ: ఎల్ఐసీ హస్తగతమైన ఐడీబీఐ బ్యాంక్‌కు డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలోనూ భారీ నష్టాలు తప్పలేదు. గత ఏడాది ఇదేకాలంలో రూ.1,524.31 కోట్లున్న నష్టాలు, ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికంలో మూడింతలు పెరిగి రూ.4,185.48 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో బ్యాంక్ ఆదాయం, రూ.7,125.20 కోట్ల నుంచి రూ.6,190.94 కోట్లకు తగ్గిపోయింది. స్థూల మొండి బకాయిల(ఎన్‌పీఏ) భారం 24.72 శాతం నుంచి 29.67 శాతానికి పెరగడం, బ్యాంక్ లాభాలను బాగా దెబ్బతీసింది. దీంతో ఎన్‌పీఏల కేటాయింపుల భారం రూ.3,649.82 కోట్ల నుంచి రూ.5,074.80 కోట్లకు చేరింది. అయితే ఇదే కాలంలో బ్యాంక్ మొత్తం రుణాల్లో, నికర ఎన్‌పీఏలు 16.02 శాతం నుంచి 14.01 శాతానికి తగ్గాయి. కొత్తగా చేరే ఎన్‌పీఏల భారం, ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి తగ్గడం ఇందుకు బాగా దోహదం చేసిందని బ్యాంక్ పేర్కొంది. బ్యాంక్ ఈక్విటీలో ఎల్ఐసీ 51 శాతం వాటా తీసుకోవడం ఇటీవలే పూర్తయింది. దీంతో గత నెల 21న ఎల్ఐసీ నుంచి బ్యాంక్‌కు రూ.21,624 కోట్ల మూలధన నిధులు లభించాయి.

క్యూ3లో వర్ల్‌పూల్ లాభం రూ. 61 కోట్లు

రూ.407 కోట్లతో ఆధునికీకరణ, విస్తరణ

న్యూఢిల్లీ: వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.60.62 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 14 శాతం ఎక్కువ. ఇదేకాలంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.979.26 కోట్ల నుంచి రూ.1,238 కోట్లకు చేరింది. ముడి సరుకుల ధరలు, డాలర్-రూపాయి మారకం రేట్లలో తీవ్ర ఆటుపోట్లున్నా మూడో త్రైమాసికంలో కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు సాధించినట్టు వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అరవింద్ ఉప్పల్ చెప్పారు. పండగల సీజన్ కొనుగోళ్లు ఊపందుకోవడం, అమ్మకాలను పెంచిందని కంపెనీ ఎండీ సునీల్ డిసౌజా తెలిపారు. సోమవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో పుదుచ్చేరిలోని ప్లాంట్‌తోపాటు మహారాష్ట్రలోని రంజన్‌గావ్ ప్లాంట్లలో వచ్చే ఐదేళ్లలో రూ.407 కోట్ల పెట్టుబడితో విస్తరణ, ఆధునికీకరణ చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

10800 వద్ద రికవరీ

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలో 80 పాయింట్లు రియాక్షన్‌లో పడి 10800 వరకు దిగజారినా చివరి సెషన్‌లో మంచి రికవరీతో డే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. రిలీఫ్ కొనుగోళ్ల మద్దతు లభించిందనడానికి ఇది సంకేతం. నిఫ్టీ 10800 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసి మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది. మరోసారి ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయి 11000 వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. రానున్న కొద్ది రోజుల్లో గరిష్ఠ స్థాయిల్లో మద్దతు తీసుకోవాలి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10940 **మద్దతు** : 10860

- రికవరీని కొనసాగిస్తే మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10940కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఉంటుంది.
- బలహీనతకు లోనై మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 10860 కన్నా దిగువకు వస్తే మైనర్ ఇంట్రాడే కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌గా భావించాలి.
- బ్యాంక్ నిఫ్టీ 27000 వద్ద మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది.

■ వి.సుందర్ రాజా

ముగింపు సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుక్ల పాడ్యమి
నక్షత్రం : ధనిష్ఠ
పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిధున రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ : 10912.25 (+18.60)
ట్రెండ్ మార్పు వేళలు : 12.46 గంటలు
ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్ నిస్తేజంగా 1.30 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 1.45 వరకు, తిరిగి ద్వితీయార్ధంలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.
ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్ 9.30 సమయంలో ప్రారంభ స్థాయి/సగటు (ఏటీపీ) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషను తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఏటీపీ కన్నా పైన ఉన్న స్థాయిలో లాంగ్ పొజిషను తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.
నిరోధం : 10950, 10985
మద్దతు స్థాయిలు : 10870, 10835
ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా ఆదాయంలో 37% వృద్ధి

ముంబై: మూడో త్రైమాసికం(అక్టోబరు-డిసెంబరు)లో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాభం 6 శాతం పెరిగి రూ.219 కోట్లుగా నమోదైంది. నిర్వహణ ఆదాయం మెరుగుపడటం ఇందుకు దోహదపడింది. అంతకు ఏడాది క్రితం ఇదే కాలానికి సంస్థ రూ.207 కోట్ల లాభం గడించింది. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో సంస్థ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 37 శాతం వృద్ధి చెంది రూ.1,835 కోట్లకు చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాల్లో (ఏప్రిల్-డిసెంబరు) ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా ఆదాయం 11 శాతం పెరిగి రూ.4,904 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం కంపెనీ చేతిలో 24 ప్రాజెక్టులున్నాయి. అందులో 7 బీఓటీ ప్రాజెక్టులు కాగా.. మరో ఏడు ఐఆర్‌బీ ఇన్విట్స్ నిర్వహణలో ఉన్నాయి.

నోవార్టిస్ లాభంలో 31 శాతం క్షీణత

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి ఔషధాల తయారీ సంస్థ నోవార్టిస్ ఇండియా రూ.12.87 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (రూ.18.74 కోట్లు)తో పోల్చితే 31 శాతం క్షీణత నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం రాబడి రూ.156.10 కోట్ల నుంచి రూ.135.62 కోట్లకు తగ్గింది.

26% పెరిగిన జీఎస్‌కే ఫార్మా లాభం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో జీఎస్‌కే ఫార్మా లాభం 26 శాతం పెరిగి రూ.112.97 కోట్లుగా నమోదైంది. ఏకకాల లాభంగా అందుకున్న రూ.28 కోట్లు ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.89.69 కోట్లు. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.825.35 కోట్లకు చేరింది. ప్రాధాన్యతా బ్రాండ్లపై అధికంగా దృష్టి పెట్టే సరికొత్త వాణిజ్య వ్యూహం కంపెనీకి కలిసి వచ్చిందని మేనేజింగ్ డైరెక్టర్ వైదీశ్ అన్నారు. ఈ షేరు బీఎస్ఈలో సోమవారం 0.35 శాతం నష్టంతో రూ.1402.30 వద్ద ముగిసింది.

సుందరం ఫాస్టనర్స్

టీవీఎస్ గ్రూప్‌నకు చెందిన సుందరం ఫాస్టనర్స్ లాభం డిసెంబరు త్రైమాసికంలో 21.3 శాతం పెరిగి రూ.111.18 కోట్లకు చేరింది. స్టాండ్ అలోన్ ఆదాయం రూ.1021.46 కోట్లుంది. ఎగుమతి అమ్మకాలు కూడా పెరిగాయి.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)


ACI INFOCOM .6(.6)327
ADITYA SPIN. 4.73(4.97)12785
AGRO TECH FO 584.6(573.5)1149
AISHWARYA TE 2.5(2.5)1971
ALPHAGEO (I) 459.35(449.65)629
ALU FLUORIDE 88.6(93.25)9092
AMAR RAJA BA 771.3(767.3)16129
ANDHRA BANK 24.9(25.5)79748
ANDHRA CEMEN 4.51(4.74)3521
ANDHRA PETRO 56.4(57.7)42486
ASTRA MICRO 77(77.55)4202
AUROB.PHARMA 766.3(798.55)157791
AVANTEL LTD 228.05(221)471
AVANTI FEEDS 332.15(346.55)38383
B.N.RATHI SE 24.5(24)348
BALAJI AMINE 398.15(403.85)3315
BAMBINO AGRO 182(188.9)3368
BARTRONICSIN 6.35(6.51)983
BCG 2.99(3.08)21274
BHAGIRA.CHEM 395.65(420.5)3088
BHAGYA INL 34.4(33.1)100
BHARATFIN 939.35(948.9)12343
BNR UDYOG 17.65(17.34)15
CAMBRIDGE 45.75(45)12
CAT TECHN. .52(.54)300
CCHL 6.9(6.95)8163
CCL PRODUCTS 267.6(270.4)2663
CELESTIAL 6.57(6.79)2036
CIL SECURITS 14.99(14.99)101
COROM INTER 457.55(455.05)3561
CYBERMATE 1.82(1.8)49350
CYIENT 610.25(608.55)12600
DANLAW TECH. 88.9(85.8)876
DIAMONPOWER 1.36(1.43)3901
DIVI'S LAB. 1610.85(1531.75)129206
DIVYA.GRANIT 91(92.05)30
DQ ENT 6.55(7)6090
DR.REDDY'S 2742.2(2786.9)97819
EMPEE SUGARS 1.26(1.32)12830
EVEREST ORG. 165.75(172.85)512
FACOR ALLOYS 1.92(2.03)1973
FIRSTOBJ 8.42(8.86)11801
GATI LTD. 70.65(72.7)5377
GAYATRI PROJ 168.85(170.8)699
GENNEX LAB 3.2(3.19)44759
GMR INFRASTR 15(15.05)1223068
GODAVARI DRU 22.05(22.3)287
GOLDSTONE EN 14.23(13.91)15775
GRANULES (I) 85.2(89.1)129938
GVK POWERINF 5.99(6.55)355315
HBL P SYS 25.55(26.6)8968
HERITGFOOD 492.35(491.75)307
HIND.FLUROCA 13.95(14.65)1190
I.C.S.A. IND 1.79(1.79)100
IKF TECHNO .27(.28)600
INCAP LTD. 36.15(38)75
IPAPPM 453.45(474.25)17558
IVRCL LTD .9(.9)70169
KAKATIYA CEM 169.7(172.05)1507
KALLAM 17.1(16.8)247
KAVERI SEED 577.85(595.8)21437
KCP LTD 86.45(85.8)203
KERNEX MICRO 23.45(24)1209
KNR CONST 209.2(206.85)2905
KREBS BIOCHM 93.8(101.75)453
LOKESH MACH 40.4(41.6)728
LOTUS CHOC 24.7(24.7)106
MADHUCON PRJ 6.13(5.71)2012
MOLD-TEK TEC 42.15(43)136
MOSCHIP SEMI 20.55(20.65)11613
MSR INDIA 9.53(9.08)2306
N C L IND. 116.6(119.05)540
NACLIND 27.25(27.25)1600
NATCO PHARM 682.35(693.2)4490
NCC 79(79.25)810306
NEHA INTER. 4.08(4.28)1906
NETTLINX LTD 41.95(42.8)102
NEULAND LAB. 517.2(538.25)127
NIHAR INFO 11.26(11.85)831
NILE LTD. 306.85(309.15)1974
NTL 1.47(1.4)750
OIL COUNTRY 13.06(13.59)4829
OLECTRA 205.75(219.05)11614
PADMALAYA TE 2(2)1258
PALRED 37.5(38.25)1752
PANYAM CEMEN 9.97(10.26)9854
PENNAR STEEL 35.15(35.65)11890
PHYTOCHEM I. 40.6(41.1)670
PITTIENG 55.85(57.1)1715
POKARNA LTD 172.15(172.75)1633
PRAJAY ENGS. 7.92(8.17)2003
PREMIER EXPL 222.75(232.5)3887
PRSMJOHNSN 64.8(67.4)35294
RAIN 108.6(114.3)39801
RAJ PACKAGIN 25.55(27.5)4
RAJVIR IND 17.8(18.7)20
REG.CERAMIC 3.53(3.71)299
RESTILE CER. 4.28(4.29)503
SAGAR CEM. 595.3(599.5)81
SAMKRG PIST. 173.25(178.5)1074
SAMPRE NUTRI 40.25(42.35)320
SANGHI IND. 54.5(56.5)5601
SATVAH.ISPAT 9.09(9.68)3055
SAVEN TECHNO 23.45(24.55)5930
SIBAR AUTO 29(27.7)1001
SMS PHARMACE 68.45(67.9)475
SREE RAYALA 145.2(146.5)640
STEEL EXCH 11.56(10.56)6309
SUJANA INDUS .28(.29)6525
SURANATP 4.4(4.44)2005
SURYACHAKRA .3(.3)1510
SURYAMBA SP 65(65)21
SUVEN LIFE S 199.9(194.6)40607
TAJ GVK HOTL 173.85(177.65)2327
TANLA 35.75(37.6)14132
TCI INDUS. 940(910)1
TRANSCORP IN 21.5(23.95)2940
TRANSGENE BI 5.14(5.24)45303
TRANSPORT CO 286.95(280.9)997
USHER AGRO 2.62(2.5)35017
VICEROY HOTE 2.84(2.98)7250
VIJAY TEXTIL 39(35.6)156
VIMTA LABS 246.65(253.55)12501
VIRAT CRANE 27.95(28)1127
VIRINCHI 73.15(72.9)4966
VISAKA IND. 366.35(371.35)671
VISTA PHARMA 25(25.1)7443
VIVIMED LABS 23.4(23.9)36898
VST INDUS. 3200(3234.45)73
WATERBASE 145.75(151)48822
XLENERGY 1.03(1.03)215
ZEN TECH 73.3(75.1)1740
ZENOTECH 24.05(24.45)37326

ఎన్ఎస్ఈ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా


AARTIDRUGS 590.25(594.5)28916
AARTIIND 1721.3(1632.35)247617
ABAN 63.75(66.5)537811
ABB 1273.3(1272.2)93140
ABFRL 207.15(208.95)977516
ABGSHIP 1.8(1.85)5160
ACC 1406.1(1455.55)531657
ADANIENT 123.1(143)9832462
ADANIPORTS 335.65(338.45)4517829
ADANIPOWER 39.75(44.2)18224407
ADANITRANS 215.4(215.15)195995
AEGISCHEM 198.25(199.5)160136
AHLUCONT 279.65(275.3)3654
AIAENG 1625.15(1599.85)10408
AJANTPHARM 959.55(982.8)23508
AKZOINDIA 1713.7(1729.55)16671
ALBK 43.55(44.4)2481746
ALLCARGO 102.45(103.45)65119
ALOKTEXT 3.65(3.8)3313597
AMARAJABAT 772(769.6)431313
AMBUJACEM 212.5(212.5)816759
AMTEKAUTO 2.85(2.95)125196
ANANTRAJ 32(33.9)309554
ANDHRABANK 25(25.45)623264
APARINDS 605.25(614.85)19759
APLLTD 587.25(591.85)14150
APOLLOHOSP 1296.75(1341.25)548166
APOLLOTYRE 200.15(207.85)2328060
ARVIND 87.65(88.45)1267516
ASHIANA 114.15(111.8)22772
ASHOKA 119.2(121.15)263770
ASHOKLEY 82.3(83.55)17072907
ASIANPAINT 1446.35(1457.2)735159
ASTRAL 1130.25(1106.9)24575
ASTRAZEN 1599.65(1653.95)11526
ATUL 3526.65(3512.2)8153
AUROPHARMA 763.95(797.8)2659793
AXISBANK 720.5(717.25)8195956
BAJAJ-AUTO 2642.5(2602.75)817279
BAJAJCON 353.45(354.8)30120
BAJAJELEC 474(467)109887
BAJAJFINSV 6009.2(6096.95)128108
BAJAJHIND 7.65(7.9)1431739
BAJAJHLDNG 2993.5(2865.9)583619
BALKRISIND 806.9(820.9)486561
BALLARPUR 3.15(3.55)1154151
BALMLAWRIE 184.15(186.9)27353
BALRAMCHIN 102.35(102.6)1231353
BANKBARODA 110.3(111.1)15219147
BANKINDIA 93.25(94.85)9729435
BASF 1365.55(1347.6)4961
BATAINDIA 1185.65(1143.95)982691
BBTC 1192.3(1205.95)111441
BEML 796.9(799.2)2054410
BERGEPAINT 309.25(325.4)3585984
BFUTILITIE 190.6(196.35)243519
BGRENERGY 52(53.4)38177
BHARATFIN 938.2(947.8)516843
BHARATFORG 487.65(495.45)602203
BHARTIARTL 306.55(311.85)3511129
BHEL 64.95(64.35)6807730
BIOCON 652.45(666.25)931368
BIRLACORPN 477.6(487.05)5597
BLISSGVS 156.2(144.3)285791
BLUEDART 3170.9(3182.2)2158
BLUESTARCO 592.95(600.35)14063
BOMDYEING 115.05(114.4)749088
BOSCHLTD 19048.1(19316.15)9148
BPCL 338.55(341.2)3456122
BRFL 7.55(7.9)119345
BRIGADE 207.9(211.1)26863
CADILAHC 318.9(323.6)994074
CANBK 235(238.05)4995591
CANFINHOME 267.4(274.9)255218
CARERATING 986.3(998.45)19436
CASTEXTECH .9(.95)97706
CASTROLIND 155.9(160.8)913018
CCL 269.1(269.9)27940
CEATLTD 1079.3(1104.25)359601
CENTRALBK 30.25(30.9)296832
CENTURYPLY 162.15(167.45)63414
CENTURYTEX 764.9(791.65)773778
CERA 2373.15(2433)4739
CESC 681.7(694.9)187889
CHAMBLFERT 165.05(173)152490
CHENNPETRO 230.1(238)454342
CHOLAFIN 1221.8(1216.35)274098
CIPLA 509.6(521.35)1480952
CLNINDIA 382.95(385.65)3699
COALINDIA 222.1(223.2)3417620
COLPAL 1289.45(1293.45)255403
COROMANDEL 458.95(456.75)100770
CORPBANK 25.8(25.9)134113
COX&KINGS 156.5(154.65)23501
CRISIL 1635.55(1659.85)2149
CUB 188.6(189.45)448316
CUMMINSIND 794.35(795.9)767868
CYIENT 611.45(606.65)157730
DABUR 447.45(451.85)2210541
DBCORP 179.05(179.1)32627
DBREALTY 24.6(25.55)112951
DCBBANK 178.6(177.25)969139
DCMSHRIRAM 335.05(336.7)42515
DEEPAKFERT 114.65(117.9)248915
DELTACORP 230.15(233.05)406918
DEN 71.9(71.7)679189
DENABANK 11.9(12.2)1982737
DHANUKA 434(437.95)11904
DHFL 115.5(111.2)116877027
DISHTV 23.45(24.4)17684185
DIVISLAB 1609.45(1532.35)2399611
DLF 163.6(165.7)5652935
DREDGECORP 394.95(406.7)126726
DRREDDY 2735.2(2791.25)2149582
DYNAMATECH 1353.15(1366.6)451
ECLERX 1021.65(1038.4)3026
EDELWEISS 137.85(146.9)2067154
EICHERMOT 20128.3(19663.4)162129
EIDPARRY 197.6(200.75)86592
EIHOTEL 193.4(194.55)82528
ELECTCAST 20(21.45)179882
ELGIEQUIP 237.1(240)113428
EMAMILTD 408.15(414.5)60211
ENGINERSIN 113.6(115.45)675292
EROSMEDIA 72.75(76.05)200082
ESCORTS 678.55(677.95)1186691
ESSDEE 14.8(15.05)2613
ESSELPACK 105(108.2)123661
EVEREADY 211.9(215.25)292744
EXIDEIND 224.3(227.05)7547054
FCONSUMER 46.25(43.55)4243358
FDC 165.55(166.35)24882
FEDERALBNK 88.05(86.25)7935374
FINCABLES 410.95(415.65)21128
FINPIPE 503.7(512.45)12770
FLFL 429.5(426.8)131353
FORTIS 134.85(135.2)255545
FSL 48.9(50.75)2371845
GAIL 329.75(333.5)1682947
GATI 70.35(72.8)290427
GDL 108.3(108.3)60691
GEPIL 761.85(774.2)5505
GESHIP 300.1(300.45)56684
GET&D 292.3(296.7)12241
GILLETTE 6492.75(6504.15)3000
GLAXO 1404.1(1407.55)61773
GLENMARK 646.3(661.85)537394
GLOBOFFS 12.75(13.15)10657
GMDCLTD 82.6(83.95)60462
GMRINFRA 15(15.05)24877435
GODFRYPHLP 949.05(942.75)349544
GODREJCP 699.75(710.65)652170
GODREJIND 506.5(505.6)294569
GODREJPROP 764.7(750.1)182127
GPPL 82.85(85)58197
GRANULES 85.5(89.2)1233003
GREAVESCOT 120.8(122)97852
GREENPLY 131.7(131)62406
GRINDWELL 536.55(540.4)12647
GRUH 209.6(211.6)1059209
GSFC 92.9(96.15)602445
GSKCONS 7535.1(7491.25)17462
GSPL 170.9(177.45)646728
GUJFLUORO 867.9(881)38676
GULFOILLUB 878.05(890)19680
GVKPIL 6(6.55)2455077
HATHWAY 32(32)7796518
HAVELLS 735.55(737.15)2228722
HCC 11.6(12.3)3799305
HCL-INSYS 19.2(19.95)536282
HCLTECH 1044.8(1043.85)2066972
HDFC 1978.5(1961.25)1421635
HDFCBANK 2104.9(2090.45)1984572
HDIL 25.65(26.85)3292459
HEIDELBERG 143.1(147.1)42247
HEROMOTOCO 2780.15(2807.25)991486
HEXAWARE 354.9(349.6)2070572
HFCL 22.3(22.55)1362469
HIMATSEIDE 189.55(197.75)59095
HINDALCO 204.2(211.4)6196724
HINDCOPPER 45(45.95)415215
HINDPETRO 226.5(234)6437470
HINDUNILVR 1802.6(1799.3)1116390
HINDZINC 254.7(254.7)906406
HMT 17.7(17.9)2905
HMVL 109(115.95)27897
HONAUT 21341.7(21695.35)1227
HOTELEELA 13(13.35)139752
HSIL 264.3(259.1)625675
HTMEDIA 40.3(39.6)105533
IBREALEST 72.35(75.1)1697682
IBULHSGFIN 650.75(678.65)15121938
ICICIBANK 354.55(354.65)17039321
ICRA 2922.4(2997.9)1855
IDBI 50.5(52.75)18989573
IDEA 30.05(30.9)18195808
IDFC 36.9(38.6)3636501
IFBIND 780.65(797.75)3440
IFCI 13(13.5)3038639
IGARASHI 500.9(506.15)13517
IIFL 381.9(419.1)260590
IL&FSTRANS 6.9(7.25)143660
INDHOTEL 144.9(143.75)1057135
INDIACEM 78.8(81.35)5185953
INDIANB 214.7(224)1446292
INDOCO 178.3(177.45)14370
INDUSINDBK 1504.65(1515.15)2054061
INEOSSTYRO 616.85(626.85)2935
INFRATEL 295.05(296.2)2318471
INFY 755.9(757.05)3945391
INGERRAND 565.35(576.6)4954
INOXLEISUR 262.65(260.65)58673
INOXWIND 64.85(68.05)45543
INTELLECT 164.55(171.35)780669
IOB 13.2(13.7)372523
IOC 135.9(137.2)4992704
IPAPPM 453.95(473.6)85158
IPCALAB 740.9(760.6)76224
IRB 139.2(145)1340808
ITC 277.1(280.85)6056619
J&KBANK 38.55(39.2)423276
JAGRAN 101.15(101.05)79667
JAICORPLTD 97.25(100.15)624862
JBCHEPHARM 311.8(309.7)11498
JBFIND 17.1(17.95)74600
JCHAC 1773(1795.5)471
JETAIRWAYS 243.4(255.15)5627563
JINDALPOLY 240.5(250)39543
JINDALSTEL 130.85(129.7)12672881
JISLJALEQS 54.55(59.25)14425269
JKCEMENT 699.5(712.15)10493
JKIL 108.9(106.6)197467
JKLAKSHMI 301.05(299.25)115591
JKTYRE 90.55(92.1)367359
JMFINANCIL 76.7(79.7)250390
JPASSOCIAT 5.95(6.75)36558327
JPINFRATEC 3(3.15)944926
JPPOWER 1.8(1.85)4289835
JSWENERGY 67.85(67.95)449996
JSWHL 2630.05(2680.3)642
JUBILANT 735.05(714.4)427653
JUBLFOOD 1396.5(1357.95)3611293
JUSTDIAL 481.45(476.05)862004
JYOTHYLAB 183.95(184.95)145810
KALPATPOWR 367.2(370.3)147194
KANSAINER 458.15(457.9)76860
KEC 244.75(247.75)85598
KESORAMIND 64.65(68.85)165909
KIRLOSENG 173.1(172.15)8474
KITEX 100.5(102.5)23009
KOLTEPATIL 263.4(269.25)61570
KOTAKBANK 1272.2(1255.7)1379319
KPIT 113.75(114.55)1146840
KRBL 367.25(359.05)487080
KSCL 577.25(595.9)368407
KSK 1.1(1.15)116356
KTKBANK 116.95(118)986378
KWALITY 6.25(6.55)806934
L&TFH 127.55(130.3)6905425
LAKSHVILAS 58.95(62.95)1302084
LAOPALA 211.55(212.5)6192
LAXMIMACH 5320.8(5401.75)1555
LICHSGFIN 455.9(460.15)1894538
LT 1307.4(1324.6)2308931
LUPIN 855.9(883.1)1352120
M&M 674.45(688.4)2652101
M&MFIN 402.2(416.6)1199682
MAGMA 98.9(102.95)60029
MAHINDCIE 237.5(241.75)767728
MAHLIFE 375(382.3)28111
MANAPPURAM 92.1(93.8)1517519
MANPASAND 67.75(73.05)535343
MARICO 367.75(376.45)2084615
MARKSANS 24.9(25.3)818393
MARUTI 6988.2(6962.3)658776
MAYURUNIQ 370.3(381.45)11240
MCLEODRUSS 96.25(97.6)82305
MERCK 3250.95(3296.95)12808
MHRIL 199.15(201.35)31889
MINDACORP 140.3(144.85)50415
MINDTREE 889.8(899.65)1004135
MMTC 25.85(26.45)485823
MOIL 164.5(161.35)227727
MONSANTO 2592.35(2614.7)2054
MOTHERSUMI 138.3(139.3)5279832
MOTILALOFS 621.9(629.75)69033
MPHASIS 1016.55(1009.75)124350
MRF 59906.55(61275.7)7858
MRPL 65.25(67.5)759183
MTNL 13(13.7)765809
MUTHOOTFIN 502.05(492.55)498204
NATCOPHARM 681.6(691.4)72544
NATIONALUM 58.9(59.15)3271951
NAUKRI 1727.75(1730.35)324757
NAVKARCORP 45.65(46.65)71148
NCC 79.25(79.3)7534840
NETWORK18 35.6(36.3)159033
NHPC 25.2(25.4)2799812
NIITTECH 1309.85(1319.45)353635
NITINFIRE 1.35(1.35)370917
NLCINDIA 62(63.9)235734
NMDC 95.35(95.35)5323370
NTPC 137.25(140.15)5596920
OBEROIRLTY 454.3(454.2)234707
OFSS 3796.2(3794.8)27244
OIL 171.1(171.55)947598
OMAXE 213.15(213.2)195229
ONGC 146.25(141.8)9532350
ORIENTBANK 94.25(94.75)4334861
ORIENTCEM 65.75(69.95)41593
ORISSAMINE 761.8(769.75)2998
PAGEIND 24201.45(24039.05)29121
PARSVNATH 5.9(6.15)96700
PCJEWELLER 69.95(71.55)6371752
PEL 2107.9(2155.3)549669
PERSISTENT 639.85(618.8)376544
PETRONET 210(221.1)7360609
PFC 100.95(104.25)5446277
PFIZER 3055.9(3039.25)10478
PFS 14.7(15)371715
PGHH 9877.1(9898.6)2467
PHOENIXLTD 594.55(623.9)41536
PIDILITIND 1121.2(1122.8)740899
PIIND 837.2(847.55)15070
PNB 73.15(73.9)22905988
POWERGRID 184.6(190.2)2069251
PRAJIND 120.95(128.85)1809248
PRESTIGE 199.7(200.9)129618
PRSMJOHNSN 64.95(67.45)465361
PTC 75.65(76.5)331354
PUNJLLOYD 2.5(2.6)271537
PURVA 70.5(72.5)71361
PVR 1577.15(1569.6)228250
RADICO 437.2(427.65)500642
RAIN 108.45(114.15)246528
RAJESHEXPO 597.7(618.6)487694
RALLIS 159.7(161.2)362271
RAMCOCEM 597.6(602.3)142380
RAMCOSYS 234.1(234.4)5984
RATNAMANI 871.2(874.65)4072
RAYMOND 743.05(742.65)456333
RCF 59.55(60.85)734851
RCOM 7.55(11.6)378845417
RECLTD 121.3(125.05)3359965
REDINGTON 69.15(72.6)155019
RELAXO 720.1(747.75)38735
RELCAPITAL 151.65(189.1)36816466
RELIANCE 1290.9(1249.95)11670570
RELINFRA 227.1(267.1)16577801
RENUKA 9.85(10.1)441616
REPCOHOME 389(394.45)637966
RIIL 303.05(312.45)193534
RKFORGE 485.8(495.6)30538
RNAVAL 10.05(11.8)4152398
ROLTA 4.75(5)254626
RPOWER 17.2(26.4)86170048
RTNPOWER 3.35(3.6)3460716
RUCHISOYA 6.9(7.2)923035
SADBHAV 194.25(196.1)36294
SADBHIN 89.05(92.35)6618
SAIL 45.75(46.25)9813307
SANOFI 6444.5(6533.2)1998
SBIN 283.95(284.4)20642919
SCHAEFFLER 5350.55(5393.95)2322
SCHNEIDER 88.65(91.55)31114
SCI 39.45(40.25)266751
SHARDACROP 320.3(322.45)7852
SHILPAMED 375.5(382.8)7242
SHK 163.45(168.55)7852
SHOPERSTOP 500.2(512.95)40623
SHREECEM 15906.9(15782)13365
SHRIRAMCIT 1650.35(1729.6)6513
SIEMENS 1023.3(1031.1)284828
SIMPLEXINF 150.6(155.95)9554
SINTEX 9.2(9.8)2149972
SITINET 5.95(6.35)192495
SJVN 25.5(24.95)849619
SKFINDIA 1928.3(1909.4)18516
SMLISUZU 583.65(591.15)4489
SNOWMAN 30.1(30.9)220020
SOBHA 477.05(478.45)126087
SOMANYCERA 336.9(345.15)16006
SONATSOFTW 325(326.6)49059
SOUTHBANK 13.2(13.1)17469442
SPARC 153.55(157.95)527442
SREINFRA 24.85(28.7)9138082
SRF 1968.05(1966.45)443620
SRTRANSFIN 1024.75(1047.1)775225
STAR 436.25(445.8)1841977
STCINDIA 112.9(117.05)57199
SUNDARMFIN 1408.15(1412.9)4730
SUNDRMFAST 522.15(526.9)29657
SUNPHARMA 414.8(423.25)3679517
SUNTV 524.1(532.15)1014065
SUPREMEIND 990.25(1004.1)57041
SUVEN 200.35(193.6)342247
SUZLON 4.75(4.9)22092957
SWANENERGY 97.85(97.8)222445
SYMPHONY 1214.35(1205)7423
SYNDIBANK 36.65(37.3)8848309
SYNGENE 597.15(595.7)53633
TAKE 134.9(136.6)101369
TATACHEM 657.35(668)418631
TATACOFFEE 88.35(89.35)113373
TATACOMM 494.7(498.95)250250
TATAELXSI 888.65(889.3)649150
TATAGLOBAL 199.85(204.1)1115503
TATAMOTORS 180.25(181.65)11854351
TATAMTRDVR 93.15(94.1)2015682
TATAPOWER 70.55(71.5)3028680
TATASPONGE 753.55(760.85)88912
TATASTEEL 476.05(474.7)10972029
TATASTLBSL 28.5(29.35)312668
TBZ 57.35(58.75)172774
TCS 2050.25(2029.95)1590764
TECHM 749.15(746.6)1518373
TEXRAIL 59.85(56)2371444
THERMAX 1092.65(1095.75)7599
THOMASCOOK 214.3(219.2)93663
TIDEWATER 5124.2(5120.85)281
TIMKEN 575(570.65)10943
TITAN 1025.75(991.55)9556052
TNPL 207.95(212.2)21858
TORNTPHARM 1839.05(1798.7)352471
TORNTPOWER 243.55(246.75)868024
TREEHOUSE 3.8(3.95)29745
TRIDENT 64.85(65.5)204146
TRITURBINE 104.95(105.9)104545
TTKPRESTIG 7815.55(7773.45)7227
TTML 3.4(3.65)1727623
TV18BRDCST 32.05(32.6)2337580
TVSMOTOR 499.65(516.65)2229833
TVSSRICHAK 2345.75(2352.65)849
TVTODAY 351.1(352.95)8491
UBL 1438.85(1447.15)383584
UCOBANK 18.55(19)223380
UFLEX 252.4(250.75)117809
ULTRACEMCO 3447.5(3483.65)320227
UNICHEMLAB 194.75(199.4)40810
UNIONBANK 79.45(81.45)6977579
UNITECH 1.45(1.5)1317822
UPL 770.9(779.85)1254011
VAIBHAVGBL 656.4(669.2)1861
VAKRANGEE 44.8(45.05)19854611
VEDL 161.35(162.15)24578563
VIDEOIND 2.7(2.75)171133
VIJAYABANK 42.5(43.2)1517890
VINATIORGA 1598.45(1579.2)20792
VIPIND 498.05(496.2)291509
VOLTAS 544(553.65)900993
VRLLOG 263.05(268.85)12518
VSTIND 3204.15(3212.45)2648
VTL 1065.15(1086.4)5382
WABAG 295.2(295.7)116527
WABCOINDIA 6119.1(6189.2)2314
WELCORP 102.35(103.9)257523
WELSPUNIND 58.35(59.4)896166
WHIRLPOOL 1518.75(1539.75)112329
WIPRO 371.25(371.55)3143722
WOCKPHARMA 422(449.75)1757302
WONDERLA 288.6(288.9)6370
ZEEL 347.75(354.4)25098014
ZEELEARN 25.65(27.75)347252
ZYDUSWELL 1309.6(1335.6)6809

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,400	33,780	34,410	33,600	33,280
క్రితం ముగింపు	34,430	---	34,400	33,720	33,410
22 క్యారెట్లు	31,850	31,300	31,650	31,220	31,810
క్రితం ముగింపు	31,880	---	31,640	31,220	31,940
వెండి (కిలో)	41,500	41,700	41,300	41,500	43,700
క్రితం ముగింపు	41,600	---	41,700	41,500	43,800

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	400	చిత్తూరు	438
వరంగల్	402	చెన్నై	445
విజయవాడ	399	నమక్కల్	430
గోదావరి	399	బెంగళూరు	430
విశాఖపట్నం	405	ముంబై	453

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	74	విజయవాడ	78
కరీంనగర్	74	గుంటూరు	79
వరంగల్	72	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	74	చిత్తూరు	88
కర్నూలు	74	నెల్లూరు	88
విశాఖపట్నం	78	అనంతపురం	89
గోదావరి	76		

హరితహారం భేష్.. యూపీ కితాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపులో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని, హరితహారంలో భాగంగా కోట్లాది మొక్కలు నాటాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రశంసనీయమని యూపీ అటవీ అధికారులు కొనియాడారు. యూపీ గ్రీన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివాస్ రంజన్ నేతృత్వంలో 10 మంది ఉన్నతాధికారులు సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో తెలంగాణ అటవీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. హరితహారం అమలు తీరుపై సుదీర్ఘంగా ఐదున్నర గంటల పాటు అధ్యయనం చేశారు. హరితహారం మాదిరిగా తమ రాష్ట్రంలోనూ గ్రీన్ ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు యూపీ గ్రీన్ మిషన్ డైరెక్టర్ బివాస్ రంజన్ తెలిపారు.

● మా కాలేజీలు మూసేస్తాం: 10 కాలేజీలు

రాష్ట్రంలో పది ఇంజనీరింగ్ కాలేజీలు తమ సంస్థలను మూసేయడానికి అనుమతినివ్వాలంటూ జేఎన్‌టీయూకి దరఖాస్తు చేసుకున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడాదికేడాది అడ్మిషన్లు తగ్గడంతో పాటు అఫిలియేషన్ పొందేందుకు జేఎన్‌టీయూ పెట్టిన నిబంధనలు కూడా కాలేజీల మూసివేతకు కారణమవుతున్నాయి.

● తొలి త్రైమాసికానికి జీపీఎఫ్‌పై 8% వడ్డీ

ఈ ఏడాది తొలి త్రైమాసికానికి జీపీఎఫ్ సొమ్ముపై ఉద్యోగులకు 8 శాతం వడ్డీ లభించనుంది. జీపీఎఫ్ సహా విద్యుత్ విభాగం పీఎఫ్, ఎమర్జెన్సీ కట్ అండ్ కంపల్సరీ సేవింగ్, గవర్నమెంట్ డిస్టిలరీస్ ఎంప్లాయీస్ పీఎఫ్, స్టేట్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ ఫండ్, ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్‌లలోని నిల్వలకూ ఇదే వడ్డీ రేటు వర్తిస్తుందని సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

● రేపటి నుంచి హెచ్‌డబ్ల్యూవో ఆప్షన్ల సవరణ

బీసీ సంక్షేమశాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టుల భర్తీలో భాగంగా వెబ్ ఆప్షన్లను సవరించుకునేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించినట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీ వాణీప్రసాద్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లలో తప్పులు సవరించుకోవాలని సూచించారు.

● షేక్ హ్యాండ్‌లా చెక్‌డ్యాంలు: ప్రకాశ్

'షేక్ హ్యాండ్'లా వీలున్న చోట చెక్‌డ్యాంలు నిర్మించాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్ సూచించారు. జహీరాబాద్ ప్రాంతంలోని గొట్టిగానిపల్లెలో ఒకే వాగుపై 12 చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఇప్పుడు ఆ గ్రామంలో నీటి వనరుల లభ్యత పెరిగి ఏటా రెండు పంటలు పండిస్తున్నారని చెప్పారు. చెక్‌డ్యాంల నిర్మాణంపై సాగునీటి పారుదల శాఖ ఇంజనీర్లకు సోమవారం జలసౌధలో వర్క్‌షాప్ నిర్వహించారు. రిటైర్డ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ విజయ్ ప్రకాశ్ నేతృత్వంలోని బృందం అధ్యయనం చేసిన సాంకేతిక అంశాలను ఇంజనీర్లకు వివరించారు.

● అర్చకత్వం వంశపారంపర్య హక్కు: రంగరాజన్



అర్చకత్వానికి వంశపారంపర్య హక్కు కల్పించాలని దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీఎస్ రంగరాజన్ ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. ఆదాయం లేని ఆలయాల్లో అర్చకత్వాన్ని వంశపారంపర్య హక్కుగా కాకుండా.. ఒక అవకాశంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. 2007లోని చట్టానికి ప్రస్తుత ప్రభుత్వం అభ్యంతరం చెప్పడం దారుణమన్నారు. వంశపారంపర్య అర్చకత్వాన్ని ఆమోదించడంలో రెండేళ్లుగా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు రెండు నాల్కల ధోరణి విడనాడాలని, చిన్న దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అర్చకులను ఆదుకునేలా సర్వీసు నిబంధనలను వెంటనే అమలు చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

● నేడు ఎమ్మెల్యేలతో రాహుల్ భేటీ!

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. ఈ భేటీకి హాజరుకావాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, కార్యనిర్వాహక అధ్యక్షులు రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమ్ కుమార్‌లకూ ఆహ్వానం అందింది. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, బీజేపీ-టీఆర్ఎస్ మైత్రీబంధం, సంస్థాగతంగా పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు.

● 'పౌరసత్వ' సవరణ బిల్లును తేవొద్దు: తమ్మినేని

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవేశపెట్టే పౌరసత్వ చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సీపీఎం నిర్వహించిన ఆందోళనలో భాగంగా సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నాలో ఆయన పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడంతోపాటు లౌకిక విలువలను కాపాడుకోవాలని, వాటికి విఘాతం కలిగించే ఏ చర్యనైనా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

● ఎంపీ కవితకు కేరళ అసెంబ్లీ ఆహ్వానం

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో కేరళ అసెంబ్లీ నిర్వహించనున్న సదస్సులో ప్రసంగించాలని నిజామాబాద్ ఎంపీ కవితకు ఆహ్వానం అందింది. ఈ మేరకు కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనాలని ఆమెకు ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పి.శ్రీరామకృష్ణన్ సోమవారం ఒక లేఖ రాశారు. ఈ నెల 23న తిరువనంతపురంలోని కేరళ లెజిస్లేటివ్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ సదస్సులో 'కాస్ట్ అండ్ ఇట్స్ డిస్కంటెంట్స్' అంశంపై ప్రసంగించాలని లేఖలో కోరారు.

● గాంధీని అవమానించినా స్పందించరా?: పొన్నం

జాతిపిత మహాత్మాగాంధీని అవమానించిన హిందూ మహాసభ నేతలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మహాత్మాగాంధీ వర్ధంతి రోజైన జనవరి 30న హిందూ మహాసభ నేత పూజా షకుల్ పాండే.. జాతిపితను ఘోరంగా అవమానించారన్నారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ నేతలతో కలిసి గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. షకుల్ పాండేను వెంటనే జైలుకు పంపకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంతకుముందు గాంధీభవన్ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు పొన్నం, అంజన్ కుమార్ యాదవ్, కోదండరెడ్డి, జి.నిరంజన్ తదితరులు మౌనదీక్ష చేపట్టారు.

● అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ: డీకే అరుణ

అధిష్ఠానం ఆదేశిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రచార కమిటీ కో చైర్మన్ డీకే అరుణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి.. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. విభజన హామీల్లో ఏ ఒక్కదాన్నీ సాధించలేని టీఆర్ఎస్.. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ప్రజల్ని మరోసారి మోసం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలిపించి ఇవ్వాలని కోరారు. కమిటీ కో చైర్మన్‌గా నియమించినందుకు ఆమె రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బిల్లులు పాస్ చేయకూడదా?: హైకోర్టు

▸▸ పంచాయతీల విలీన రిట్లపై తీర్పు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో ఎటువంటి బిల్లులు పాస్ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధం ఉందా..? అని హైకోర్టు ప్రశ్నించింది. ఒకసారి చట్టసభలో బిల్లు పాసయ్యాక గవర్నర్ ఆమోదంతో అది చట్టంగా మారుతుందని తెలిపింది. చట్ట సభల్లో బిల్లులకు సంబంధించి రికార్డులు ఇవ్వాల్సిందిగా కోర్టులు ఆదేశాలు ఇవ్వజాలవని పేర్కొంది. రాష్ట్రంలోని పలు పంచాయతీలను మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లలో విలీనం చేయడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సీజే రాధాకృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం తన తీర్పును వాయిదా వేసింది.

● అనర్హత వేటుపై హైకోర్టుకు యాదవరెడ్డి

పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారనే అభియోగాలపై తనపై వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కె. యాదవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. టీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేసినట్లుగా ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదనీ, కేవలం మీడియాలో చూసి తెలుసుకున్నట్లు తెలిపారు. తాను ఏ పార్టీలోనూ చేరలేదన్నారు. తాను పార్టీ మారుతున్నట్లుగా ఎక్కడా చెప్పలేదనీ, దీనిపై వచ్చిన వార్తలన్నీ వట్టి పుకార్లే అన్నారు.

● ప్రశాంత్ భూషణ్‌పై ఏజీ కోర్టు ధిక్కార వ్యాజ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ సోమవారం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై కోర్టు ధిక్కార వ్యాజ్యం దాఖలు చేశారు. సీబీఐ మాజీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు నియామక వ్యవహారంలో సుప్రీంకోర్టును అప్రతిష్ఠపాల్జేసేవిధంగా వ్యాఖ్యలు చేసినందుకు ఈ పిటిషన్ దాఖలు చేశారు. నాగేశ్వరరావు ఎంపికలో ఉన్నత స్థాయి కమిటీ సమావేశానికి సంబంధించి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తప్పుడు మినిట్స్ సమర్పించినట్లుగా భూషణ్ ఆరోపించారని ఆయన అన్నారు.





లాఠీచార్జి చేస్తున్న పోలీసులు. రాళ్ల దాడిలో గాయపడ్డ సీఐ (ఇన్‌సెట్)

'కోయిలకొండ'ను మహబూబ్‌నగర్‌లోనే ఉంచాలి

40 గ్రామాల ప్రజల ఆందోళన.. రాళ్ల దాడిలో సీఐకి గాయాలు

మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న కోయిలకొండ మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేయబోయే నారాయణపేట జిల్లాలో కలపొద్దని పార్టీలకతీతంగా ప్రజలు చేస్తున్న ఆందోళన రణరంగంగా మారింది. సోమవారం దమ్మాయిపల్లి చౌరస్తా వద్ద 40 గ్రామాల ప్రజలు రోడ్డుపై బైఠాయించి అక్కడే వంటలు చేసుకొని భోజనాలు చేసి నిరసన తెలిపారు. సుమారు వేయిమంది ఆందోళనకు దిగడంతో.. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతున్నదంటూ పోలీసులు వారికి నచ్చజెప్పారు. అయినా వారు వినకపోవడంతో కొందరు మహిళలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇంతలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులపై రాళ్లు విసరడంతో.. భూత్పూర్ సీఐ పాండురంగారెడ్డి తలకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. -కోయిలకొండ

ఇక ఎన్జీవోలతోనూ ఇంటర్న్‌షిప్

▸▸ పెద్ద కంపెనీలతోనే చేయాలనేమీ లేదు

▸▸ విద్యార్థుల సంఖ్య దృష్ట్యా నిబంధనలు సులభతరం: ఏఐసీటీఈ

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో భాగంగా ఇక పెద్ద పెద్ద పరిశ్రమలు, కంపెనీల్లోనే ఇంటర్న్‌షిప్ చేయాల్సిన అవసరం లేదు. స్వచ్ఛంద సేవా సంస్థ(ఎన్జీవో)లు, చిన్న కంపెనీలతో చేసే వెసులుబాటును ఏఐసీటీఈ కల్పించింది. ఇంటర్న్‌షిప్ చేయాల్సిన విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ మేరకు నిబంధనలు సులభతరం చేసినట్లు ఏఐసీటీఈ డిప్యూటీ డైరెక్టర్ నీతూ భగత్ తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు. పీహెచ్‌డీ చేసే విద్యార్థులు ఎక్కువగా లేకపోవడంతో.. వారిని ప్రోత్సహించేందుకు ఏఐసీటీఈ ప్రత్యేకంగా స్కాలర్‌షిప్ అందిస్తుందని నీతూ భగత్ తెలిపారు. ఫుల్‌టైం పీహెచ్‌డీ చేస్తూ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా పనిచేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. రొబోటిక్స్, డేటా అనాలసిస్ వంటి వినూత్న కోర్సులను ప్రవేశపెట్టాలనుకునే ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అదే సమయంలో నూతన ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించామన్నారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. కాలేజీలకు, పరిశ్రమలకు మధ్య అంతరం చాలా పెరిగిందన్నారు. మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే ఆన్‌లైన్ కోర్సులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీల్లో నగదు రహిత విధానం అమలు కోసం సాంకేతిక విద్యాశాఖ, యస్ బ్యాంక్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది.

మాక్ టెస్ట్‌లకు ఎన్టీఏ మొబైల్ యాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) సరికొత్త మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు హెచ్చార్డీ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు బదులిచ్చారు. జేఈఈ, నీట్ వంటి పరీక్షలను ఎన్టీఏ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఇటీవల కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్రం తీసుకున్న చర్యలను సత్యపాల్ సింగ్ వివరించారు. ఇప్పటికే 4వేలకు పైగా టెస్ట్ ప్రాక్టీసు కేంద్రాలు(టీపీసీ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో లక్షకుపైగా విద్యార్థులు నమోదైనట్లు తెలిపారు.

ఫిబ్రవరి 1నాటికి ఐదెకరాల్లోపు ఉంటేనే!

'పీఎం-కిసాన్'కు అర్హతపై కేంద్రం స్పష్టత.. మరో ఐదేళ్ల వరకు కొత్తవారికి నో చాన్స్

▸▸ భూమిని బదిలీ చేసుకునే వారికి నిరాశే

▸▸ కఠిన నిబంధన విధించిన కేంద్ర ప్రభుత్వం

▸▸ వారసత్వ బదిలీకి మాత్రం వెసులుబాటు

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

"ఐదెకరాల భూమి ఉన్న రైతులకు రూ.6 వేల పెట్టుబడి సాయం"

- కేంద్ర ప్రభుత్వం 'పీఎం-కిసాన్' పేరిట కొత్తగా ప్రవేశపెట్టిన పథకమిది.

"5 ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్నవారు.. కొంత మొత్తాన్ని మరొకరి పేరుమీద బదిలీ చేస్తే ఇద్దరూ లబ్ధిదారులు కావచ్చుకదా!"

-కొందరు ఆశాజీవుల ఆలోచన ఇది.

ఇటువంటి ఆలోచనల్ని కేంద్ర ప్రభుత్వం ముందుగానే పసిగట్టిందేమో.. వీటికి అవకాశం లేకుండా నిబంధనలు విధించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నాటికి రెవెన్యూ రికార్డుల్లో ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులే పీఎం- కిసాన్ పథకంలో లబ్ధిదారులు అవుతారని తేల్చేసింది. అంతేకాదు.. రానున్న ఐదేళ్ల వరకు ఈ పథకంలో లబ్ధిదారులను కొత్తగా నమోదు చేసే అవకాశం లేకుండా కఠిన నిబంధన విధించారు. అయితే వారసత్వ భూ బదిలీకి మాత్రం వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్.. అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు. ఫిబ్రవరి 1వ తేదీ తర్వాత ఎలాంటి భూ బదిలీలు చేసుకున్నా.. పీఎం- కిసాన్ పథకంలో చేర్చేదిలేదని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడే కాదు.. రాబోయే ఐదేండ్ల వరకు కూడా కొత్త లబ్ధిదారుల ఎన్‌రోల్‌మెంట్ ఉండదని తేల్చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఫిబ్రవరి 1వ తేదీ వరకు 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల వివరాలు సేకరించాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. కాలక్రమంలో భూమి యజమాని వారసులు ఈ పథకంలో లబ్ధిదారులుగా చేరే అవకాశాన్ని మాత్రం కల్పించారు. ఈ మేరకు ఆయా రైతుల వివరాలు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి రెవెన్యూ శాఖకు లేఖ రాశారు.

ప్రత్యేక పోర్టల్..

'పీఎం- కిసాన్' పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తోంది. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాలు తయారుచేసి.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఇక రూ.6 వేల నగదును మూడు విడతల్లో ఇవ్వాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం మార్చి 31వ తేదీ లోపు మొదటి కిస్తీ డబ్బును రైతుల ఖాతాల్లో వేయనుంది. ఆన్‌లైన్‌లో కేంద్ర ప్రభుత్వ ఖాతా నుంచి లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి నగదు బదిలీ చేయనున్నారు. కాగా పీఎం-కిసాన్ పథకంపై తెలంగాణ సీఎస్ ఎస్.కె.జోషితో చర్చించేందుకు కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు.

తొలి విడతకు ఆధార్ ఐచ్ఛికమే..

పీఎం-కిసాన్ పథకం కింద సాయం పొందేందుకు తొలి విడతలో ఆధార్ నంబరు కచ్చితంగా ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసింది. డిసెంబరు ఆధార్‌కు బదులుగా డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను చూపాలని తెలిపింది. అయితే రెండో విడత నుంచి సహాయం పొందాలంటే మాత్రం కచ్చితంగా ఆధార్ నంబరును అనుసంధానం చేయాల్సిందేనని స్పష్టం చేసింది.

లాబీయింగ్ చేసే వారికే కాంగ్రెస్‌లో పదవులు

హరీశ్‌తో పోలిస్తే కేటీఆర్ ఫెయిర్: జగ్గారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్న కసితో 35 ఏళ్ల పని చేశా. ఇప్పుడా కసి నాలో పోయింది. కాంగ్రెస్‌లో లాబీయిస్టులకే పదవులు వస్తున్నాయి" అని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ అంటే తనకు పిచ్చి అని, పార్టీ మారేది లేదని అన్నారు. "టీఆర్ఎస్ పెట్టడం వల్ల తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. నన్ను జైల్లో పెట్టడం వల్ల నా కూతురు రాజకీయ వారసులిగా తెరపైకి వచ్చింది" అని వివరించారు. తనకు విభేదాలన్నీ హరీశ్‌రావుతోనేనన్నారు.

మమతపై మౌనమేల కేసీఆర్?: విజయశాంతి



ఫెడరల్ ఫ్రంట్ అంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు కోరిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు ఆమెకు మద్దతివ్వకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి ప్రశ్నించారు. ప్రధాని మోదీ తప్పులను కేసీఆర్.. కేసీఆర్ తప్పులను మోదీ దాస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీకి మద్దతిచ్చే ప్రయత్నాల్లో కేసీఆర్ ఉన్నారన్నారు. కేసీఆర్ బీజేపీకి బీ-టీంలా వ్యవహరిస్తున్నారని వీహెచ్ విమర్శించారు.

వలపు వల వేసి పిలిచి.. కొట్టి చంపాడు!

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల అప్పును తిరిగి చెల్లించకపోవడం. మెదక్‌లో జయరామ్‌కు టెట్రాన్ పాలిలెన్స్ అనే పరిశ్రమ ఉంది. దాంట్లో ఉద్యోగుల జీతాల వివాదం తలెత్తినప్పుడు జయరామ్‌కు రాకేశ్ రూ.4.5 కోట్లు ఆర్థిక సాయం చేశాడు. దానికి వడ్డీ కడుతూ వస్తున్న జయరామ్.. ఇటీవల చెల్లించడం లేదు. ఈ విషయాలను రాకేశ్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జయరామ్‌తో పరిచయం నుంచి హత్య వరకూ క్రమాన్ని పోలీసుల విచారణలో రాకేశ్ వెల్లడించాడు. టెట్రాన్ పరిశ్రమ వివాదం క్రమంలోనే శిఖాచౌదరితో రాకేశ్‌కు పరిచయం ఏర్పడింది. తర్వాత శిఖా, రాకేశ్ మధ్య మరింత దగ్గర బంధం ఏర్పడింది. వీరిద్దరూ పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు. ఆ తర్వాత జయరామ్, శిఖా మధ్య ఉన్న బంధం గురించి తెలుసుకున్న రాకేశ్ ఆమెకు దూరంగా జరుగుతూ వచ్చాడు. శిఖా జోలికి రావొద్దని రాకేశ్‌కు జయరామ్ పలుమార్లు చెప్పినట్టు సమాచారం. ఇక అప్పటి నుంచి తన వద్ద తీసుకున్న రూ.4.5 కోట్లతోపాటు శిఖా చౌదరి విలాసాల కోసం తాను ఖర్చు చేసిన మరో రూ.1 కోటిని తిరిగి చెల్లించాలని రాకేశ్ అడుగుతూవచ్చాడు. దాంతో, జయరామ్ రాకేశ్ ఫోన్లను ఎత్తడం మానేశాడు. ఈ క్రమంలో జనవరి 24న అమెరికా నుంచి వచ్చిన జయరామ్.. 31న విజయవాడ వెళ్లి కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్లతో మాట్లాడి కొంత సొమ్మును తెచ్చి అప్పు తీరుస్తానని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు విజయవాడ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆ సమయంలోనే, వాట్సాప్ వలపు వల విసిరి జనవరి 31న జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నంబరు 10లోని తన విల్లాకు పిలిపించుకున్నాడు. ఆ విల్లా తనదని జయరామ్‌కు తెలియదని, అది తనదేనని సదరు వాట్సాప్ యువతి చెప్పడంతో అక్కడికి వచ్చాడని పోలీసుల విచారణలో రాకేశ్ చెప్పినట్లు సమాచారం.

శిఖా చౌదరిపై రాకేశ్ నిఘా

శిఖా చౌదరి కదలికలను తెలుసుకోవడానికి రాకేశ్ ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమించుకున్నాడు. గచ్చిబౌలిలో ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉండే ఓ వాచ్‌మన్‌కు నెలకు రూ.15 వేలు చెల్లించేవాడు. జనవరి 30న జయరామ్ ఆ ఇంటికి వెళ్లాడు. ఈ విషయాన్ని వాచ్‌మన్ రాకేశ్‌కు చెప్పాడు. శిఖా చౌదరి విషయంలో జయరామ్ అడ్డుగా ఉండడంతో రాకేశ్ అతడిపై పగ పెంచుకున్నాడు.

చిత్రహింసలు పెడుతూ.. చిత్రీకరిస్తూ..

జయరామ్ తన ఇంటికి వచ్చిన తర్వాత రాకేశ్ ఆయన్ను బంధించాడు. చిత్రహింసలు పెట్టాడు. దాన్ని భరించలేక ఆయన కోస్టల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్‌కు ఫోన్‌చేశారు. రూ.6 లక్షలు ఏర్పాటు చేయాలని కోరారు. హోటల్ దసపల్లాలో రాకేశ్ అనుచరుడికి ఆ డబ్బు అందజేశారు. ఈ డబ్బును స్వాధీనం చేసుకున్న అతడు రాకేశ్‌కు ఫోన్ చేశాడు. దాంతో, తాను రూ.5 కోట్లు డిమాండ్ చేస్తే రూ.6 లక్షలు ఇవ్వడమేమిటని జయరామ్‌ను రాకేశ్ మళ్లీ వేధించాడు. దాంతో ఆయన ఎదురు తిరిగారు. మాటామాటా పెరిగి వాగ్యుద్ధం జరిగింది. ఈ వివాదంతో రెచ్చిపోయిన రాకేశ్ జయరామ్‌పై దాడి చేశాడు. పిడిగుద్దులు కురిపించాడు. దాంతో, ఆయన తలపై గాయాలయ్యాయి. బుగ్గలు కందిపోయాయి. అప్పటికే జయరామ్ గుండెకు మూడు స్టెంట్లు వేసి ఉండడంతో బీపీ పెరిగిపోయి కుప్పకూలిపోయాడని, ముక్కు నుంచి రక్తస్రావమై చనిపోయాడని సమాచారం. అంతకుముందు జయరామ్‌ను చిత్రహింసలకు గురి చేసిన రాకేశ్.. వాటిని తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ వీడియోను పంపి జయరామ్ కుటుంబసభ్యులను బ్లాక్‌మెయిల్ చేయాలన్న ఆలోచనతో రాకేశ్ అలా చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. జయరామ్ మరణించడంతో రాకేశ్ ఆ వీడియోను డిలీట్ చేసినట్లు సమాచారం. ఆ వీడియోను పోలీసులు డేటారిట్రీవ్ ద్వారా పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. జయరామ్ హత్యకేసులో ఆ వీడియో కీలక సాక్ష్యంగా పోలీసులు భావిస్తున్నారు. రాకేశ్ చెప్పిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏపీ పోలీసు బృందం రాకేశ్ నివాసానికి వచ్చింది. సుమారు 45 నిమిషాలపాటు సోదాలు నిర్వహించింది. కిచెన్‌లో భోజనం చేసిన ఐదు ప్లేట్లను పోలీసులు గుర్తించారు. రాకేశ్ రెడ్డి, జయరాం కాకుండా ఇంకెవరెవరు ఇంట్లో ఉన్నారని ఆరా తీస్తున్నారు. హత్య జరిగిన రోజు మధ్యాహ్నం రాకేశ్ తన స్నేహితుడి హోటల్ నుంచి భోజనం తెప్పించుకున్నాడని అక్కడి పార్సిల్ కాగితాలు చెబుతున్నాయి.

ఎవరు ఈ 'రీనా'?

జయరామ్ హత్య కేసులో తాజాగా రీనా అనే పేరు వినిపిస్తోంది. అసలు రీనా ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే, అది రాకేశ్ 'సృష్టి' అనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. జయరామ్ బలహీనతల గురించి పక్కాగా తెలుసుకున్న రాకేశ్ రీనా పేరుతో వాట్సాప్ చాటింగ్ చేసినట్టు సమాచారం. డీపీగా అందమైన అమ్మాయి ఫొటో పెట్టాడు. హాయ్.. హల్లో.. నుంచి మొదలైన ఈ చాటింగ్ జయరామ్‌ను ఇంటికి రప్పించుకునేదాకా సాగింది. గన్‌మెన్, డ్రైవర్ లేకుండా రావాలని అందులో చెప్పినట్టు తెలిసింది. ఈ చాటింగ్ అంతా రాకేశ్ చేస్తున్నా.. జయరామ్ మాత్రం రీనా చేస్తోందన్న భ్రమలో మునిగిపోయినట్టు తెలిసింది. రోడ్డు నంబర్ 10లోని ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత కానీ అది రాకేశ్ ఇల్లు అని జయరామ్ గుర్తించలేదని సమాచారం.

శిఖా చౌదరిది క్రిమినల్‌మైండ్!

▸▸ జయరాం భార్య పద్మశ్రీ

శిఖా చౌదరిది క్రిమినల్ మైండ్ అని జయరాం భార్య పద్మశ్రీ అన్నారు. ఎక్స్‌ప్రెస్ టీవీలో చేరాక కూడా ఆమె ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, అందుకే తప్పించారని చెప్పారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పద్మశ్రీ విలేకరులతో మాట్లాడారు. జయరామ్‌కు 2015 నుంచి ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. ఆయన బంధువుల నుంచే జయరామ్‌కు ప్రాణహాని ఉందన్నారు. హత్య కేసు దర్యాప్తును పారదర్శకంగా చేయాలన్నారు. కాగా, పద్మశ్రీ విలేకరులతో మాట్లాడుతుండగా.. జయరామ్ బంధువులు అడ్డుకున్నారు.

పోలీసుల క్రిమినల్ ఐడియా!

▸▸ జయరాం హత్య కేసులో కొత్త ట్విస్టు

▸▸ జయరామ్‌తో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ దోస్తానా!

▸▸ తద్వారా, శిఖా చౌదరి, రాకేశ్‌తో పరిచయం

▸▸ హత్య తర్వాత వారికి రాకేశ్ ఫోన్

▸▸ రోడ్డు ప్రమాదంగా చిత్రించాలని సూచన

▸▸ ఇన్‌స్పెక్టర్ బదిలీ.. ఏసీపీపై విచారణకు ఆదేశం

హైదరాబాద్, విజయవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిగురుపాటి జయరామ్ హత్య కేసులో సోమవారం కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో రాకేశ్‌కు హైదరాబాద్‌కు చెందిన ఓ ఏసీపీ, మరో ఇన్‌స్పెక్టర్ 'క్రిమినల్ ఐడియాలు' ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. జయరామ్‌ను హత్య తర్వాత రాకేశ్ నేరుగా ఆ ఇద్దరు పోలీసు అధికారులకు ఫోన్ చేశాడని, వారు ఇచ్చిన సూచనలతోనే కారులో జయరామ్ మృతదేహాన్ని తీసుకొచ్చి నందిగామకు సమీపాన ఉన్న ఐతవరం వద్ద వదిలేశాడని తెలుస్తోంది. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి కారును జాతీయ రహదారికి పక్కన ఉన్న కందకంలోకి తోసేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ ఏసీపీ రాచకొండ కమిషనరేట్ ఎల్బీనగర్ జోన్‌లో బాధ్యతలు నిర్వహిస్తుండగా.. ఇన్‌స్పెక్టర్ హైదరాబాద్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్‌లోని ఒక ఠాణాలో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. జయరామ్ ఇచ్చిన అనేక పార్టీలకు వారు హాజరయ్యారు. అక్కడే ఆయన మేనకోడలు శిఖా చౌదరితో.. ఆమె ద్వారా రాకేశ్‌తో పోలీసు అధికారులకు పరిచయం ఏర్పడింది. కాగా, జయరాంను హత్య చేసిన విషయాన్ని రాకేశ్ తొలుత శిఖా చౌదరికి చెప్పాడని, వెంటనే ఆమె ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లో ఒకరికి ఫోన్ చేసి సహాయం కోరిందనే మరో కథనం కూడా వినిపిస్తోంది. మరోవైపు.. జయరాం హత్య కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ఈస్ట్‌జోన్ పరిధిలోని ఒక ఠాణా ఎస్‌హెచ్‌వోపై హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ సోమవారం బదిలీ వేటు వేశారు. ప్రాథమిక విచారణలో జయరాంతో పరిచయం, ఈ హత్య కేసుతో సంబంధమున్న వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తేలింది. దాంతో, ఆ ఎస్‌హెచ్‌వోపై వేటు వేశారు. ఈ కేసులో ఉన్న ఏసీపీపైనా పోలీస్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. విచారణాధికారి నివేదిక వచ్చాక ఏసీపీపై చర్యలు తీసుకునే అవకాశముంది.

విలాస్ పురుష్.. రాకేశ్ రెడ్డి

(హైదరాబాద్ సిటీ న్యూస్ నెట్‌వర్క్)

ఎమ్మెల్యేల పేరుతో పరిశ్రమలు.. వ్యాపారాల యజమానులకు బెదిరింపు ఫోన్లు.. భూదందాలు! ఎమ్మెల్యే కొడుకునంటూ సినీ తారలతో పరిచయాలు.. వారితో హైటెక్ వ్యభిచారం!! వీవీఐపీలతో పరిచయాలు పెంచుకోవడం.. వారికి అమ్మాయిలను ఎరవేసి పనులు చేయించుకోవడం! అక్రమంగా సంపాదించడం.. అమ్మాయిలతో తిరగడం.. క్యాసినోల్లో జూదం.. ఇవీ చిగురుపాటి జయరాం హత్య కేసు నిందితుడు రాకేశ్‌రెడ్డి లీలలు. ఇవి మచ్చుకు కొన్నే! తవ్వినకొద్దీ అతడిపై నమోదైన కేసులు వెలుగులోకి వస్తున్నాయి. రాజకీయ నాయకులతో అతడికున్న సంబంధాలు బయటికొస్తున్నాయి. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్, మాదాపూర్ ప్రాంతాలు అతడి కార్యస్థావరాలు. ఇంటర్మీడియట్ వరకూ చదివిన రాకేశ్.. జీడిమెట్ల సబ్‌స్టేషన్ వద్ద వినాయకుణ్ని పెట్టి హంగామా చేసేవాడు. టీడీపీలో చేరి యూత్ లీడర్‌గా కొనసాగాడు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న ఒక రాజకీయ నాయకుడిని 2009లో బెదిరించి రూ.20 లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. ఆ తర్వాత ఒక కాంగ్రెస్ నాయకురాలి కుమారుడికి దగ్గరై పోలీసులతోనూ పరిచయాలు పెంచుకున్నాడు. 2014 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో.. టీడీపీ అభ్యర్థి ఒకరికి దగ్గరై ఆయనతో తిరిగాడు. ఇలా నాయకులతో పరిచయాలు పెంచుకోవడం.. పారిశ్రామికవేత్తలు, వీఐపీలకు అమ్మాయిలను ఎరవేయడం, ఆ తర్వాత వారిని బెదిరించి డబ్బులు గుంజడం ఇతడి నేర్పైలి. ఆ డబ్బుతో గోవాలాంటి ప్రదేశాలకు వెళ్లి జూదం ఆడుతూ, అమ్మాయిలతో తిరిగేవాడు. 2015లో కూకట్‌పల్లిలో ఒక హోటల్ యజమానికి ఫోన్‌చేసి.. 'నేను ఎమ్మెల్యేను మాట్లాడుతున్నా. పార్టీ ఫండ్ కోసం రూ.30 వేలు పంపు' అని బెదిరించాడు. కానీ.. ఆయనకు సదరు ఎమ్మెల్యేతో పరిచయం ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాకేశ్ రెడ్డిని పోలీసులు ఆ కేసులో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అలాగే.. తానొక ఎమ్మెల్యే కొడుకునని చెప్పుకొంటూ రాకేశ్‌రెడ్డి ఒక ప్రముఖ హీరోయిన్‌ను వ్యభిచార ఊబిలోకి దింపాడు. ఓ సినీనటితో వ్యభిచారం చేయిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. కాగా.. కొన్నాళ్ల క్రితం ఒక పబ్‌లో శిఖాచౌదరికి రాకేశ్‌తో పరిచయమైంది. ఆమే అతణ్ని జయరామ్‌కు పరిచయం చేసినట్లు సమాచారం. జీడిమెట్ల షాపూర్‌నగర్‌లోని హెచ్ఎంటీ సొసైటీకి చెందిన కాంగ్రెస్ యువనేత ఒకరితో కలిసి జయరామ్‌ను చంపేందుకు నెలరోజుల క్రితమే రాకేశ్‌రెడ్డి కుట్ర పన్నాడని.. వారి ప్రణాళిక ఫలించలేదని తెలుస్తోంది.




మమతా బెనర్జీకి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కనిమొళి, తెజస్వీయాదవ్



కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయానికి వస్తున్న వాహనదారుడిని ప్రశ్నిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభమే

లోక్‌సభలో హోం మంత్రి రాజ్‌నాథ్ ప్రకటన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితి రాజ్యాంగ సంక్షోభం కావచ్చని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆదివారం జరిగిన పరిణామాలు రాజ్యాంగ సంక్షోభాన్నే సూచిస్తున్నాయన్నారు. దీనిపై గవర్నర్ నుంచి నివేదిక కోరామన్నారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సాధారణ పరిస్థితి తీసుకొచ్చేందుకు రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉందని హెచ్చరించారు. విధులు నిర్వర్తించకుండా సీబీఐని అడ్డుకోవడం 'అసాధారణం', 'దురదృష్టకరం' అని, ఇది దేశ సమాఖ్య వ్యవస్థకే ముప్పని అభివర్ణించారు. ఈ మేరకు, కోల్‌కతాలో పరిస్థితిపై సోమవారం లోక్‌సభలో ఆయన ప్రకటన చేశారు. అంతకుముందు, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారంటూ విపక్షాలు సభలో ప్రభుత్వంపై ధ్వజమెత్తాయి. పశ్చిమ బెంగాల్‌లో 'యుద్ధం'పై కేంద్రాన్ని తప్పుబట్టాయి. కోల్‌కతా పోలీస్ చీఫ్‌ను విచారించడానికి సీబీఐ వెళ్లడంపై కాంగ్రెస్, తృణమూల్, బీజేడీ, ఆర్జేడీ, టీడీపీ, ఎన్సీపీ, సమాజ్‌వాదీ తదితర పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. తృణమూల్‌కు మద్దతు తెలిపాయి. ఈ గందరగోళం మధ్యే రాజ్‌నాథ్ ప్రకటన చేశారు. చట్టబద్ధంగా విధులు నిర్వర్తించడానికి వెళ్లిన సీబీఐ అధికారులను అడ్డుకున్నారని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ విధులను నిర్వర్తించడానికి కావాల్సిన సామరస్య వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితిపై గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠీతో హోం మంత్రి రాజ్‌నాథ్‌కు నివేదిక సమర్పించారు. అంతకుముందు గవర్నర్‌తో రాజ్‌నాథ్ మాట్లాడారు. బెంగాల్‌లో పరిస్థితిపై ఆరా తీశారు. సీబీఐ కార్యాలయాలు, అధికారుల నివాసాల వద్ద కేంద్ర బలగాలతో భద్రత కల్పించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. పరిస్థితిని 'నిశితంగా పరిశీలిస్తున్నామని' ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ప్రజాస్వామ్యంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు దాడిని ప్రజాస్వామ్యంపై సమాఖ్య వ్యవస్థపై కేంద్రంలోని మోదీ సర్కారు దాడిగా కాంగ్రెస్ సహా వివిధ ప్రతిపక్షాలు తీర్మానించాయి. సోమవారం పార్లమెంటులోని కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ చాంబర్‌లోనూ, ఎన్సీపీ నేత శరద్ పవార్ నివాసంలోనూ వివిధ పార్టీల నేతలు సమావేశమయ్యారు. కోల్‌కతాలో పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తూ మమతా బెనర్జీకి సంఘీభావం ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణ ఖరారు చేయడానికి ఒకటి రెండు రోజుల్లో మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు. శరద్ పవార్ నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు, జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఫారూక్ అబ్దుల్లా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, తృణమూల్ నేత డెరెక్ ఓబ్రెయిన్ తదితరులు సమావేశమై కేంద్రాన్ని కలిసికట్టుగా ఢీకొనడమే కర్తవ్యమని తీర్మానించారు. "కోల్‌కతాలో పరిణామాల్ని విస్మరించలేం. ఇది కేవలం మమతకు సంబంధించిన విషయమే కాదు. ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ కార్యాలయంపై కూడా దాడి జరిగింది. ఇది స్పష్టంగా ప్రజాస్వామ్య శక్తులపై దాడి" అని శరద్ పవార్ సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో సీబీఐ నిర్వాకాన్ని కాంగ్రెస్ సహా 23 పార్టీలు ఖండించాయని, అంతా మమతా బెనర్జీకి సంఘీభావంగా ఉన్నామని చంద్రబాబు చెప్పారు. తమలో కొంతమంది కోల్‌కతా వెళ్లి మమతకు సంఘీభావం ప్రకటించాలని నిర్ణయించామని, త్వరలో కలిసికట్టుగా కార్యాచరణ నిర్ణయిస్తామమని తెలిపారు. "కోల్‌కతాలో జరుగుతున్న ఘటనలు నాలుగేళ్లుగా ఢిల్లీలో కూడా జరుగుతున్నాయి. ఢిల్లీ ప్రజలపై మోదీ సర్కార్ ఎప్పుడో దాడి ప్రారంభించింది" అని కేజ్రీవాల్ అన్నారు. "ఎన్నికలకు ఒక నెల ముందు మమతా బెనర్జీపై దాడి ప్రారంభించారు. అఖిలేశ్, మాయావతిని కూడా వదిలిపెట్టరు. ఈ పద్ధతి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అవినీతిపైనే సీబీఐ దాడులు చేస్తోందన్న మాట వాస్తవం కాదు. అదే నిజమైతే శివరాజ్ సింగ్ చౌహాన్‌పై వ్యాపం కేసులో ఎందుకు దాడులు చేయలేదు? అని ఆయన ప్రశ్నించారు. సీబీఐని ఎన్నికల ఏజెంటుగా వాడుకోవాలని బీజేపీ చూస్తోందని అఖిలేశ్ యాదవ్ ట్విటర్‌లో ఆరోపించారు.

మమతకు స్టాలిన్, కుమార మద్దతు

చెన్నై/బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మమతా బెనర్జీ పోరాటానికి డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో ఒక సందేశం పోస్టు చేశారు. కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం స్వతంత్రంగా స్వేచ్ఛగా పనిచేయాల్సిన సీబీఐని తన చెప్పుచేతుల్లోకి తీసుకుని సమాఖ్య స్ఫూర్తికి గండికొడుతోందని ఆరోపించారు. మమతా బెనర్జీని నేరుగా కలిసి డీఎంకే తరఫున మద్దతు తెలిపేందుకు ఆ పార్టీ ఎంపీ కనిమొళి కోల్‌కతా వెళ్లారు. బెంగాల్‌లో జరిగిన ఘటన రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడిగా కర్ణాటక సీఎం హెచ్‌డీ .కుమారస్వామి అభివర్ణించారు. మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ కూడా తన సంపూర్ణ మద్దతు మమతా బెనర్జీకేనని ట్వీట్ చేశారు.

రాజీవ్‌ఎందుకు తప్పించుకుంటున్నారు?: బెంగాల్ కాంగ్రెస్ చీఫ్

కోల్‌కతా ఘటనలో మమతకు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం సంఘీభావం ప్రకటించగా.. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించారు. రాజీవ్‌కుమార్ ఏ తప్పూ చేయకపోతే సీబీఐ ముందుకు వెళ్లకుండా ఎందుకు తప్పించుకుంటున్నారని బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ సోమన్ మిత్రా ప్రశ్నించారు.

సాక్ష్యాల ధ్వంసంపై ఆధారాలివ్వండి

మొదటి పేజీ తరువాయి

నాశనం చేయడానికి ఏమాత్రం ప్రయత్నించినా కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందుకు ఆయన ఆ తర్వాత చింతించాల్సి వస్తుందని హెచ్చరించింది. శారదా స్కాం కేసుకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆధారాలను ధ్వంసం చేయడానికి కోల్‌కతా సీపీ ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి అంగీకరించింది. పశ్చిమ బెంగాల్‌లో ఆదివారం చోటు చేసుకున్న పరిస్థితులపై సోమవారం సీబీఐ సుప్రీం కోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. వీటిలో ఒకటి.. బెంగాల్ సీఎస్, డీజీపీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారన్నది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను వారు ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారని పిటిషన్లో పేర్కొంది. ఇక, శారదా చిట్‌ఫండ్ స్కాం కేసులో సీబీఐ విచారణకు సహకరించాల్సిందిగా కోల్‌కతా పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రెండోది దాఖలు చేసింది. వెంటనే తమ ఎదుట లొంగిపోవాలని, విచారణకు ఆయనంతట ఆయనే స్వయంగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్లో పేర్కొంది. ఈ కేసులో రాజీవ్ కుమార్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, ఆదివారంనాడు కోల్‌కతాలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, విచారణకు వెళ్లిన సీబీఐ అధికారులను అరెస్టు చేశారని, సీబీఐ జాయింట్ డైరెక్టర్, ఆయన కుటుంబాన్ని నిర్బంధంలో ఉంచారని పేర్కొంటూ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం ఎదుట సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం రెండు పిటిషన్లు దాఖలు చేశారు. చివరికి, సీబీఐ కార్యాలయాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. సోమవారం పరిస్థితి ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. సీబీఐ అధికారులను విడుదల చేశారని సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఓ రాజకీయ పార్టీతో కలిసి పోలీసు ఉన్నతాధికారి ధర్నాకు దిగారని, ఇది అసాధారణమని, వెంటనే విచారించాలని కోరారు. "ఆదివారం రాత్రి 10 గంటలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో కలిసి డీజీపీ, అడిషనల్ పోలీసు కమిషనర్ కూడా ధర్నాలో పాల్గొన్నారు. యూనిఫాం శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఇలా ప్రవర్తించడం పశ్చిమ బెంగాల్, కోల్‌కతాల్లో పూర్తిగా అరాచకం నెలకొందని చెప్పవచ్చు. రాజీవ్ కుమార్‌కు వ్యతిరేకంగా బలమైన ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. వారంట్ లేకుండా విచారించే అధికారం సీబీఐకి ఉంది. చట్టానికి, న్యాయానికి పోలీసు కమిషనర్ కట్టుబడి ఉండాల్సిందే. కానీ, ముఖ్యమంత్రి, డీజీపీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులంతా కలిసి కోర్టు ఇచ్చిన ఆదేశాలనే బహిరంగంగా ఉల్లంఘించారు. సీబీఐ విచారణను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించారు" అని కోర్టుకు వివరించారు. సోమవారం మధ్యాహ్నమే విచారణకు ధర్మాసనం నిరాకరించింది. "కోర్టు ధిక్కార పిటిషన్లను పూర్తిగా పరిశీలించాం. పిటిషన్లలో ఏమీ లేదు. ఆధారాలను ధ్వంసం చేయడానికి సంబంధించిన వివరాలేమీ లేవు" అని వ్యాఖ్యానించింది. మంగళవారం విచారిస్తామని తెలిపింది. బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వి జోక్యం చేసుకున్నారు. కోల్‌కతా సీపీ నిందితుడు కాదని, ఆయనకు అనుకూలంగా కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, ఇదంతా రాజకీయ కుట్రగా అభివర్ణించారు. ఈ కేసును మంగళవారం చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారించనుంది. రాష్ట్ర పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేయడానికి సంబంధించి హైకోర్టు స్టే ఇచ్చినా.. సీపీ ఇంటికి వెళ్లి విచారించడానికి సీబీఐ ప్రయత్నించిందని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సత్వరమే విచారించేందుకు కలకత్తా హైకోర్టు నిరాకరించింది. దీనిపై మంగళవారం విచారణ చేపడతామని జస్టిస్ శివకాంత్‌ప్రసాద్ స్పష్టం చేశారు.

శారద సిట్‌కు నోటీసులిచ్చాం

- వారి నుంచి స్పందన లేదు: సీబీఐ.. సీబీఐ నోటీసులన్నీ తప్పుల తడకలే
- న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: పందొమ్మిది వేల కోట్ల శారదా స్కామ్‌లో బెంగాల్ పోలీసులు ఏ మాత్రం సహకరించడం లేదని సీబీఐ ఆరోపించింది. శారదా స్కామ్‌ను దర్యాప్తు చేసిన బెంగాల్ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లోని అధికారులను ప్రశ్నించేందుకు ఏడాది వ్యవధిలో 20 నోటీసులు జారీ చేశామని, వారంతా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారని సీబీఐ తెలిపింది. సిట్ బృందానికి ఎప్పుడు తీరికవుతుందో చెప్పాలని కోరుతూ డీజీపీకి లేఖ రాశామని, అందర్నీ కలిపి ఒకేసారి కూర్చోబెడతామని, వారితో మాట్లాడుకోవాలని డీజీపీ ప్రతిపాదించారని తెలిపింది. అందుకు తిరస్కరించి ఆదివారం రాజీవ్ కుమార్ ఇంటికి ప్రశ్నించేందుకు వెళ్లగా ఆయన పోలీసులు దాడి చేసినట్లు సీబీఐ వెల్లడించింది. తనకు సీబీఐ సమన్లు ఇస్తున్న తీరుపై రాజీవ్ కుమార్ 2017లోనే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత తనకు ఎలాంటి నోటీసులు రాలేదని రాజీవ్ కుమార్ చెబుతున్నారు. సీబీఐ ఇచ్చానని చెబుతున్న నోటీసుల్లో అన్నీ తప్పుల తడకలే ఉన్నాయని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. నవంబరు 30న ఇచ్చిన నోటీసులో నవంబరు 6న హాజరు కావాలని పేర్కొన్నారని, డిసెంబరు 12న ఇచ్చిన నోటీసులో డిసెంబరు 10న హాజరు కావాలని నిర్దేశించారని ప్రస్తావించారు. సీబీఐ అధికారులను దర్యాప్తు వివరాలు వెల్లడించాలని బెంగాల్ పోలీసులు వేధించారని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. దర్యాప్తు ప్రణాళిక ఏమిటో చెప్పాలని ఒత్తిడి చేసినట్లు చెప్పాయి. తమను నిర్బంధించినట్లు రాతపూర్వకంగా ఇవ్వాలని సీబీఐ అధికారులు డిమాండ్ చేయగా పోలీసులు నిరాకరించారు. నిజానికి అదే పోలీస్ స్టేషన్‌కు సీబీఐ అధికారులు వెళ్లి తాము రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు వెళ్తున్నామని, రాష్ట్ర పోలీసుల సాయం అవసరమని విజ్ఞప్తి చేశారు. అటు నుంచి స్పందన లేదు.



బెంగాల్ దంగల్!

దీదీ–మోదీ పోరు తీవ్రం

కోల్‌కతా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మోదీ సర్కారుపై తృణమూల్ అధ్యక్షురాలు, పశ్చిమ బెంగాల్ సీఎం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాల కింద పైసా కూడా తీసుకోబోమని తేల్చేశారు. కోల్‌కతా నగర కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించి/అరెస్టు చేసేందుకు వచ్చిన సీబీఐ అధికారులను 'తరిమేసిన' మమత... 'రాజ్యాంగాన్ని రక్షించండి' పేరిట ఆదివారం రాత్రి చేపట్టిన ధర్నాను కొనసాగిస్తున్నారు. ఇతరత్రా అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని... మోదీ సర్కారుపైనే గురిపెట్టారు. కేంద్రం ప్రకటించిన పథకాల కోసం ఎలాంటి నిధులు తీసుకోబోమని తేల్చి చెప్పారు. "మా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మోదీ కుట్రలు పన్నుతున్నారు. గిట్టని పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని చూస్తున్నారు. గతంలో మా పార్టీ నాయకులపై సీబీఐ దాడులు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా నగర పోలీసు కమిషనర్‌నే అరెస్టు చేసేందుకు వచ్చారు. ఆయన వ్యక్తి కాదు. మొత్తం పోలీసులకు ప్రతినిధి. అందుకే నేను ఆయనకు రక్షణగా నిలిచాను" అని మమత ప్రకటించారు. మరణించడానికైనా సిద్ధమేకానీ... కేంద్రం కుట్రలకు తలొగ్గేది లేదని తేల్చిచెప్పారు. "బీజేపీ అత్యున్నత నాయకత్వం అతి నీచమైన రాజకీయ ప్రతీకార చర్యలకు దిగింది. పోలీసులను తమ అదుపులోకి తీసుకునేందుకు, వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తోంది" అని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు రైతులను మోదీ మోసగిస్తున్నారని మమత విమర్శించారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన వరాలన్నీ బూటకమని... వాటిని అమలు చేసేందుకు కేంద్రం వద్ద నిధుల్లేవని తెలిపారు.

8వ తేదీ వరకు ధర్నా

ఈనెల 8వ తేదీ (శుక్రవారం) వరకు తన ధర్నా కొనసాగుతుందని మమత ప్రకటించారు. బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నందున... విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ధర్నాను విరమిస్తామన్నారు. తన ఆందోళనను 'సత్యాగ్రహం'గా అభివర్ణించారు. సోమవారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ ఆమె అసెంబ్లీకి వెళ్లలేదు. కోల్‌కతా నగరం నడిబొడ్డున... మెట్రో చానల్ స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే వేదిక ఏర్పాటు చేశారు. వేదిక వెనుకే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గదిలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి... బడ్జెట్‌ను ఆమోదించారు.

ఏ క్షణమైనా నా ఇంటి తలుపులు

బద్దలుకొట్టి నన్ను అరెస్టు చేస్తారు

- సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఆందోళన

కోల్‌కతా, ఫిబ్రవరి 4: రాష్ట్ర పోలీసులు 50-60 మంది తన ఇంటిని చుట్టుముట్టడంతో తన భార్య, 13 ఏళ్ల కూతూరు ఇంట్లో భయంతో దాక్కున్నారని సీబీఐ కోల్‌కతా జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ తెలిపారు. "రాష్ట్ర పోలీసులు ఏ క్షణమైనా నా ఇంటి తలుపులు బద్దలు కొట్టి నన్ను అరెస్టు చేస్తారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. తన భద్రత గురించి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

సీబీఐని అడ్డుకోవడం మమ్మల్ని మోసగించడమే

- చిట్‌ఫండ్ బాధితుల ఫోరం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సీబీఐని అడ్డుకున్న మమతాబెనర్జీ సర్కారు తమను మోసగించినట్లు భావిస్తున్నామని చిట్‌ఫండ్ బాధితుల ఫోరం తెలిపింది. 'శారదా చిట్‌ఫండ్ కేసు విచారణ సవ్యంగా సాగితే మాకు న్యాయం జరుగుతుంది. చిట్‌ఫండ్ కేసుల్లో నిందితులకు శిక్షపడాలనే డిమాండ్‌తో త్వరలో భారీ ర్యాలీని నిర్వహిస్తాం' అని ఫోరం కన్వీనర్లు ఆసిమ్ చటర్జీ, జయంత హల్దార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మౌనం దాల్చిన కేసీఆర్, నవీన్

- జాతీయ మీడియాలో ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బెంగాల్ రాజకీయ పరిణామాలపై ప్రధానంగా మూడు పార్టీలు మౌనం దాల్చాయి. అవి: తెలంగాణ రాష్ట్ర సమితి, బిజూ జనతాదళ్, అన్నాడీఎంకే. ఈ మూడు పార్టీల అగ్రనేతలూ మమతా బెనర్జీ ధర్నాపై పెదవి విప్పలేదనీ, ఎన్నికల-అనంతర రాజకీయానికి ఇది సంకేతమని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండోసారి భారీ మెజారిటీతో గెలిచాక -ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా మొట్టమొదట కలిసినది మమతా బెనర్జీనేననీ, ఇపుడు మోదీకి వ్యతిరేకంగా ఆమె పోరాడుతూంటే మాత్రం మొహం చాటేశారనీ ఆ కథనాల్లో పేర్కొన్నాయి. ఇక ఒడిసా సీఎం, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ కూడా ఈ వివాదానికి దూరం జరిగారు. కాంగ్రెస్, బీజేపీలు రెంటికీ సమదూరం పాటిస్తామన్నది ఆయన ప్రకటిత వైఖరి. ఆ కోణంలోనే ఆయన దీనిపై స్పందించలేదని బీజేడీ వర్గాలు వివరణ ఇచ్చినప్పటికీ బీజేపీతో రహస్య అవగాహనలో భాగంగానే ఆయన బెంగాల్ పరిణామాలతో సంబంధం లేదన్న వైఖరి అవలంబించారన్న వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. సీబీఐ తన నైతిక నిష్ఠ, చిత్తశుద్ధి ప్రదర్శించాలని మాత్రం బీజేడీ ఓ వ్యూహాత్మక వ్యాఖ్య చేసి ఊరుకుంది. ఇక తన ప్రత్యర్థి అయిన డీఎంకే మమతకు సంఘీభావం ప్రకటించినందున సహజంగానే అన్నాడీఎంకే ఆ వైపు చూడదని అంటున్నారు.

రాష్ట్రపతి పాలన విధిస్తాం... జాగ్రత్త!

- భగ్గుమన్న బీజేపీ నేతలు, మంత్రులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బెంగాల్ సర్కారు గీత దాటితే రాష్ట్రపతి పాలన విధించాల్సి ఉంటుందని కేంద్ర ఉక్కు మంత్రి చౌదరి బీరేంద్రసింగ్ పరోక్షంగా హెచ్చరించారు. రాష్ట్రాలు రాజ్యాంగ పరిధిలో పరిపాలన చేయాలని, ఆర్టికల్ 356ను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వ్యవహరించాలని సలహా ఇచ్చారు. బెంగాల్లో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్ర మంత్రి బాబూలాల్ సుప్రియో డిమాండ్ చేశారు. మమత ధర్నాపై బీజేపీ మంత్రులు భగ్గుమన్నారు. మమతకు సంబంధించిన రహస్యాలు కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ చేతిలో ఉండటం వల్లే ఆయన్ను కాపాడటానికి బెంగాల్ ముఖ్యమంత్రి ధర్నా చేశారా? అని మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ ప్రయత్నించడం సమాఖ్య వ్యవస్థపై దాడిగా విపక్షాలు అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండించారు. సమాఖ్య ముసుగులో అవినీతి పరులను కాపాడాలనుకుంటే కుదరదని చెప్పారు. సీబీఐ చర్యను వ్యతిరేకించడంలో విపక్షాలు ఏకమవడాన్ని ప్రస్తావిస్తూ "అవినీతి కూటమి" అని వ్యాఖ్యానించారు. రాహుల్ సహా కూటమిలో ముఖ్యనేతలంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మమత ధర్నాకు కూర్చోవడం, కమిషనర్ జత కలవడం సంప్రదాయాలను, నిబంధనలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. ఎంపీలు సహా పలువురు తృణమూల్ కాంగ్రెస్ నేతలు అరెస్టయినపుడు మమత ఇంతటి శ్రద్ధ చూపించలేదని అన్నారు.

తెరపైకి రెడ్ డైరీ, పెన్ డ్రైవ్!

"చిట్‌ఫండ్ కుంభకోణం కేసుల్లో సాక్ష్యాలను దాచేయాలని చూస్తున్నారా? రెడ్ డైరీ, పెన్ డ్రైవ్ ఉన్నాయంటూ కుంభకోణం సూత్రధారి తన వాంగ్మూలంలో బయటపెట్టారు" అని బీజేపీ నేత ప్రకాశ్ జావడేకర్ పేర్కొన్నారు. కోల్‌కతాలో పరిస్థితులు 'ఎమర్జెన్సీ'ని తలపిస్తున్నాయని మమతా ఆరోపించడాన్ని ఆయన ఖండించారు.

ఎన్నికల నాటికి ఏదైనా జరగొచ్చు: నితీశ్

పట్నా, ఫిబ్రవరి 4: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేనాటికి దేశంలో ఏదైనా జరగవచ్చని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. చిట్‌ఫండ్ కుంభకోణాల కేసుల దర్యాప్తులో భాగంగా బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, కేంద్రం ప్రత్యక్ష పోరుకు దిగిన నేపథ్యంలో ఆయన పైవ్యాఖ్యలు చేశారు. నేరచరితుల ఆర్డినెన్స్‌ను చించేసిన రాహుల్.. అదే కోవకు చెందిన లాలూ ప్రసాద్‌తో కలిసి తన ఖ్యాతిని పోగొట్టుకున్నారని విమర్శించారు.

సలాం... ఢిల్లీ!



మోదీ సర్కారు దెబ్బకు దెబ్బ.. ఐఏఎస్, ఐపీఎస్‌లపై 'నియంత్రణ'?

- వారి సస్పెన్షన్ అధికారం కేంద్రానిదే
- 1969 రూల్స్ సవరించే అవకాశం
- సీబీఐకి 'నో ఎంట్రీ'పై కౌంటర్!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ఐఏఎస్, ఐపీఎస్‌లను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకునేలా పావులు కదుపుతోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని 'డోన్ట్ కేర్' అన్నా అధికారులకు ఫర్వాలేదు అనే సంకేతాలు పంపుతోంది. అఖిల భారత సర్వీసు అధికారుల క్రమశిక్షణ, అప్పీల్ రూల్స్ - 1969కు సవరణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దీనికోసం రాజ్యాంగాన్ని సవరించాల్సిన అక్కర్లేదు. పార్లమెంటులో చట్టం చేయాల్సిన అవసరం లేదు! ప్రధానమంత్రి ఆమోదంతో చిన్న సవరణ చేస్తే చాలు!

రాష్ట్రాలకే అధికారం

ఐఏఎస్, ఐపీఎస్‌లను నియమించేది కేంద్రమే! శిక్షణ పూర్తయిన తర్వాత రాష్ట్రాలకు కేటాయిస్తుంది. అప్పటి నుంచి ఆ అధికారులు రాష్ట్రాల పరిధిలోనే ఉంటారు. వారి పోస్టింగ్, బదిలీలు, క్రమశిక్షణ చర్యలు... అన్నీ రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారమే! ఐఏఎస్, ఐపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సస్పెండ్ చేయవచ్చు. ఆ తర్వాత 45 రోజుల్లోపు కేంద్రం ఈ సస్పెన్షన్‌ను ఆమోదించాల్సి ఉంటుంది. ఏడాదికి మించి సస్పెన్షన్ కొనసాగించాల్సి వస్తే కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం పరిధిలోని కమిటీ దీనిని సమీక్షిస్తుంది. ఒక్కసారి సస్పెండ్ అయినా సర్వీసులో అది మచ్చగా మారుతుంది. ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో పూర్తి చిత్తశుద్ధి ప్రదర్శించడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు అనుకూలంగా, అధికారంలో ఉన్న వారికి రాజకీయంగా కలిసొచ్చేలా ఐఏఎస్, ఐపీఎస్‌లు నడుచుకోవడానికి ఇదే కారణం! కేంద్రంలోని మోదీ సర్కారుకు, విపక్షాల చేతిలో ఉన్న రాష్ట్రాలకూ మధ్య కొన్నాళ్లుగా పరిస్థితి ఉప్పూ నిప్పులా ఉంది. సుప్రీం ఆదేశాల మేరకు రాష్ట్రాల డీజీపీల నియామకం యూపీఎస్సీ కమిటీ ద్వారా జరగాలంటూ కేంద్రం మెలిక పెట్టగా... అదేం కుదరదు, 'మా డీజీపీ మా ఇష్టం' అంటూ అనేక రాష్ట్రాలు సొంతంగానే నియమాకాలు చేసుకుంటున్నాయి. సీబీఐ సంస్థను రాజకీయ ప్రత్యర్థులపైకి ప్రయోగిస్తున్నారంటూ తీవ్ర వివాదం చెలరేగింది. తమ ముందస్తు అనుమతి లేకుండా అడుగు పెట్టేందుకు వీల్లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాలు 'జనరల్ కన్సెంట్'ను ఉపసంహరించుకోవడం మొదలుపెట్టాయి. కోల్‌కతా ఘటనలో పోలీస్ కమిషనర్ అఖిల భారత సర్వీసు అధికారి అయినప్పటికీ... సీబీఐకి సహకరించలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాజకీయ నాయకత్వ విధానాలకే కట్టుబడి ఉన్నారు. దీనికి కారణం... అఖిల భారత సర్వీసు అధికారులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రాలకే ఉండటమే అని మోదీ సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వారందరినీ గుప్పిట్లో పెట్టుకోవడానికి కీలక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, అటవీ ముఖ్య సంరక్షణ అధికారిపై కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి తర్వాతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు... ఈ జాబితాలో మొత్తం ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను చేర్చాలని భావిస్తున్నారు. ఇక వారిపై రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా క్రమశిక్షణ చర్యలు తీసుకోలేవు. వారు తమ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, చివరికి తిరుగుబాటు చేసినా రాష్ట్రం ఏమీ చేయలేదు. మహా అయితే బదిలీ మాత్రమే చేయగలరు. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను బెంగాల్‌కు పంపింది కూడా కేంద్రమే. శారదా, రోజ్‌వ్యాలీ స్కామ్‌లపై సిట్‌కు ఆయనే నేతృత్వం వహించారు. ఆయనే 'కేంద్రంపై తిరుగుబాటు' చేశారు. ఇందులో ఐపీఎస్‌ల పాత్రను సమీక్షించాలని కేంద్రం నిర్ణయించుకుంది. దీనిపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠీతో చర్చించినట్లు సమాచారం.

ప్రో వాలీబాల్‌లో నేడు

కాలికట్ హీరోస్ X యు ముంబా
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3లో...



అంబటి రాయుడు ఎంతో క్రికెట్ ఆడాడు. ఎన్నో ఏళ్లుగా జట్టులో ఉన్నాడు. ఓ పక్కన వికెట్లు పడుతున్నా తన అనుభవాన్ని రంగరించి భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఆఖరి వన్డేలో అతడి ఇన్నింగ్స్ రాయుడు కెరీర్‌కు ఎంతో ఊపు ఇస్తుంది. ఈ ఫామ్‌ను అతడు కొనసాగిస్తాడని భావిస్తున్నా.

-కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంస



అదరగొట్టిన హైదరాబాద్

- అహ్మదాబాద్‌పై గెలుపు
- ప్రో. వాలీబాల్ లీగ్


కొచ్చి: తొలి రెండు మ్యాచ్‌లు ఏకపక్షంగా సాగిన ప్రో.వాలీబాల్ లీగ్‌లో సోమవారంనాటి మూడో పోటీ అసలు సిసలు మజా పంచింది. ఆఖరి సెట్ వరకూ విజయం దోబూచులాడింది. అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-2 స్కోరుతో (15-11, 13-15, 15-11, 14-15, 15-9) బ్లాక్‌హాక్స్ హైదరాబాద్ జయకేతనం ఎగుర వేసింది. కెప్టెన్ కార్‌సన్ క్లార్క్ అదరగొట్టాడు. మొత్తం 15 పాయింట్లతో (స్పైక్ 12, బ్లాక్ 1, సర్వ్ 2) జట్టును విజయంపథంలో నడిపించాడు. బ్లాకర్ అష్వల్ రాయ్ (14), అటాకర్ రోహిత్ కుమార్ (11) కూడా సత్తా చాటారు. అహ్మదాబాద్‌లో అటాకర్ విక్టర్ సిసొయేవ్ (12) అత్యధిక పాయింట్లు స్కోర్ చేశాడు. మరో అటాకర్ గగన్‌దీప్ సింగ్ (8), బ్లాకర్ వైష్ణవ్ (7), బ్లాకర్ నొవాక జలిక (6) పర్లేదనిపించారు. మొదటి నాలుగు సెట్లను హైదరాబాద్, అహ్మదాబాద్ చెరో రెండు గెలవడంతో నిర్ణాయక ఆఖరి సెట్‌లో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. అయితే చివరి సెట్‌లో హైదరాబాద్ ఒక్కసారి జూలు విదిల్చింది. సమష్టి ఆటతో ప్రత్యర్థిని హడలెత్తించింది. దాంతో సెట్, మ్యాచ్ బ్లాక్‌హాక్స్ సొంతమైంది.

వన్డేల్లో భారత్‌కు రెండో ర్యాంక్

టాప్‌లోనే కోహ్లీ, బుమ్రా

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానానికి దూసుకొచ్చింది. ఇక బ్యాట్స్‌మెన్, బౌలర్ల విభాగాల్లో కెప్టెన్ కోహ్లీ, బుమ్రా తమ అగ్రస్థానాలను నిలబెట్టుకున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లపై సిరీస్ విజయాలు సాధించిన దరిమిలా 122 పాయింట్లతో టీమిండియా మూడు నుంచి రెండో స్థానానికి ఎగబాకింది. ఇంగ్లండ్ (126) అగ్రస్థానంలో నిలిచింది. బ్యాట్స్‌మెన్‌లో కోహ్లీ 887 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మ (854) రెండో ర్యాంక్‌లో నిలిచాడు. ధోనీ (688) మూడు స్థానాలు మెరుగుపరుచుకొని 17వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అంబటి రాయుడు (574) 42వ స్థానంలో నిలిచాడు. బౌలర్లలో బుమ్రా (808) అగ్రస్థానంలోనే నిలవగా, కుల్దీప్ యాదవ్ (719) రెండో ర్యాంకులో ఉన్నాడు. లెగ్‌స్పిన్నర్ చాహల్ (709) ఒకస్థానం ఎగబాకి ఐదో ర్యాంక్ చేజిక్కించుకున్నాడు. పేసర్ భువనేశ్వర్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకొని 17వ ర్యాంక్ దక్కించుకున్నాడు.

టీ-20లకూ గప్టిల్ దూరం



వెల్లింగ్టన్: వెన్నుముక గాయం నుంచి కోలుకోకపోవడంతో న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ భారత్‌తో టీ-20 సిరీస్‌కు దూరమయ్యాడు. టీమిండియాతో ఐదో, చివరి వన్డేకు ముందు గప్టిల్‌కు ఈ గాయం అయింది. దాంతో అతడి స్థానంలో ఆల్‌రౌండర్ జిమ్మీ నీషమ్‌కు జట్టులో చోటు కల్పించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోటీ బుధవారం ఇక్కడ జరగనుంది.



నాలుగులో.. నేనున్నా!

అంబటి రాయుడు భరోసా

ప్రపంచ కప్ ఎంతో దూరం లేదు.. జట్టులో అన్ని స్థానాల విషయంలో అటు సెలెక్టర్లు ఇటు మేనేజ్‌మెంట్ గుండెమీద చేయి వేసుకొని నిద్రించే పరిస్థితి ఉన్నా ఒక్కస్థానం విషయంలో ప్రస్తుతమేకాదు సుదీర్ఘ కాలంగా ఆందోళన చెందుతోంది..అది బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎంతో కీలకమైన నాలుగో స్థానం.. ప్రపంచకప్ జరిగే ఇంగ్లండ్‌లో స్వింగ్ అయ్యే వికెట్లపై ఒకవేళ ఓపెనర్లు విఫలమైతే ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాల్సిన బాధ్యత మూడు, నాలుగో నెంబర్ బ్యాట్స్‌మెన్‌దే. కెప్టెన్ కోహ్లీతో మూడో స్థానానికి ఢోకా లేకపోయినా నాలుగో నెంబర్‌లో నిలకడగా ఆడే ఆటగాడికోసం చాలాకాలంగా టీమిండియా పలువురు బ్యాట్స్‌మెన్‌ను పరీక్షిస్తోంది.. ఎట్టకేలకు అంబటి రాయుడు రూపంలో విలువైన ఆటగాడు లభించడంతో మెగా టోర్నీకి ముందు భారత్‌కు పెద్ద బెంగ తీరిపోయింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

యువరాజ్ సింగ్, కేఎల్ రాహుల్, కేదార్ జాదవ్, విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోనీ, మనీష్ పాండే, హార్దిక్ పాండ్యా, దినేష్ కార్తీక్, అజింక్యా రహానే..ఆగస్టు 2017 నుంచి సెప్టెంబరు 2018 వరకూ, శ్రీలంక నుంచి ఇంగ్లండ్ పర్యటనల దాకా 25 వన్డేల్లో తొమ్మిదిమంది బ్యాట్స్‌మెన్‌ను నాలుగో స్థానంకోసం టీమిండియా పరీక్షించింది. వీరిలో కెప్టెన్ కోహ్లీ మూడో స్థానం ఆటగాడైతే ధోనీని ఐదో నెంబర్‌లో పంపాలని విరాట్ నిర్ణయించేశాడు. దాంతో మిగిలిన ఏడుగురిలో ఒక్కరు కూడా నాలుగో స్థానంలో జట్టుకు దిలాసా ఇవ్వలేకపోయారు. నాలుగో నెంబర్‌కు యువరాజ్ సూటైనా అతడు దాదాపు రిటైరవడంతో పరిగణనలోకి తీసుకోలేదు. ఇక మిగిలిన ఆరుగురికి నాలుగో నెంబర్ సరైన స్థానం కాదు. కేఎల్ రాహుల్ విషయానికొస్తే అతడు అసలు లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మనే కాదు. జాదవ్, పాండ్యా దిగువ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే ప్లేయర్లు. శ్రీలంకలో జరిగిన నిధహాస్ కప్‌లో బంగ్లాదేశ్‌పై చివరి బంతికి సిక్సర్ కొట్టి జట్టుకు అద్భుత విజయం అందించిన కార్తీక్ 'ఫినిషర్'గా తనకు అంది వచ్చిన అవకాశాన్ని ప్రతిసారీ వినియోగించుకున్నాడు. దక్షిణాఫ్రికాలో ఆరు మ్యాచ్‌ల్లో స్థానం దక్కినా రహానే తనదైన ముద్ర వేయలేకపోయాడు. మనీష్ పాండేకేమో తగినన్ని చాన్స్‌లు లభించలేదు.

పరిష్కారం దొరకని దశలో..

ఇంతమందిని పరీక్షించినా ఒక్కరూ కుదురుకోకపోవడంతో..ఇక నాలుగో నెంబర్‌లో సరైన బ్యాట్స్‌మన్ దొరకడేమోనని సెలెక్టర్లు, జట్టు యాజమాన్యం మధనపడుతున్న తరుణంలో రాయుడు 'నేనున్నా'నంటూ భరోసా ఇచ్చాడు. జాతీయ జట్టులో అంబటి పునరాగమనానికి గత ఐపీఎల్ ఎంతో తోడ్పడింది. ఆ టోర్నీలో 16 మ్యాచ్‌ల్లో 43 సగటుతో 149.75 స్ట్రయిక్ రేట్‌తో 602 పరుగులు చేయడం ద్వారా తనలో సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. ఆ ఐపీఎల్‌లో రాయుడుకాక..రిషభ్ పంత్, రాహుల్ మాత్రమే మెరుగైన ప్రదర్శన చేశారు. ప్రస్తుతం వారిద్దరు కూడా వరల్డ్ కప్ రేస్‌లో ఉన్నారు. కానీ వీరిద్దరికంటే కూడా ఇప్పుడు రాయుడిపైనే సెలెక్టర్ల దృష్టి నిలిచే అవకాశముంది. యోయో టెస్ట్‌లో విఫలమైనా ఇంగ్లండ్ పరిస్థితుల్లో అంబటిని పరీక్షించాలని సెలెక్టర్లు నిర్ణయించారు. ఆ క్రమంలో అతడికి ఆసియా కప్‌లో చాన్స్ ఇచ్చారు. తదనంతరం 11 మ్యాచ్‌ల్లో ఏకంగా 56 సగటుతో ఓ సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలతో 392 పరుగులు సాధించిన రాయుడు తన ఎంపికకు పూర్తి న్యాయం చేశాడు.

అనుభవమే శ్రీరామ రక్ష..

ఎవరికీ ఇవ్వనన్ని అవకాశాలు రాయుడికే ఎందుకిచ్చారన్న ప్రశ్నకు కెప్టెన్ రోహిత్..'అనుభవం' అని సూటిగా బదులిచ్చాడు. ఐదో వన్డేలో 4/18తో మరో ఘోర పరాభవం తప్పదా..అని అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో రాయుడు (113 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 90) ఆడిన తీరును ఎంత ప్రశంసించినా తక్కువే. ఆదిలో ఎంతో సంయమనంతో బ్యాటింగ్ చేసిన ఈ హైదరాబాదీ..కుదురుకున్నాక ఒక్కసారిగా జూలు విదిల్చాడు. ఫోర్లు, సిక్సర్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆఖరి వన్డే విజయంలో విజయ్ శంకర్, హార్దిక్ పాండ్యాల పాత్ర ఉన్నా..భారత్ పోరాడే స్కోరుకు తొలుత బాటలు వేసింది రాయుడే. వన్డేల్లో నాలుగో స్థానం ఎంత కీలకమో చెప్పాల్సిన అవసరం లేదు. జట్టు ఇన్నింగ్స్ అంతా ఆ బ్యాట్స్‌మన్ చుట్టూనే తిరుగుతుంది. ఆ స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడికి వన్డేల్లో ఎదురయ్యే ప్రతి క్లిష్ట దశ అవగతమవుతుంది. టాప్ ఆర్డర్ విఫలమైతే మధ్య ఓవర్లలో ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టాల్సిన బాధ్యత ఆ బ్యాట్స్‌మన్‌ది. ఓ ర్పుగా అదే తరుణంలో వేగంగా పరుగులు చేయడం ద్వారా డెత్ ఓవర్లలో మిగిలిన ఆటగాళ్లు ధాటిగా బ్యాటింగ్ చేసేలా ఇన్నింగ్స్ నిర్మించాల్సి ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే అతడు టాప్, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌కు వారధి లాంటి వాడు. మొత్తంగా ఈ లక్షణాలన్నీ పుణికిపుచ్చుకున్న రాయుడు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రపంచకప్‌లో భారత్ విజయాల్లో తనవంతు పాత్ర పోషించాలని ఆశిద్దాం.

ధోనీ... పరుగో పరుగు



వెల్లింగ్టన్: మీడియా ముందు ఎప్పుడూ తడుముకోకుండా సమాధానాలిచ్చే ఎంఎస్ ధోనీ.. ఈసారి తన సహచరుడు ఇంటర్వ్యూ అడిగితే మాత్రం తుర్రుమని పారిపోయాడు. న్యూజిలాండ్‌పై ఆఖరి వన్డే గెలిచిన తర్వాత మైదానంలో టీమిండియా యువ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ తన 'చాహల్ టీవీ'తో మాట్లాడాల్సిందిగా ధోనీ ముందు మైక్ పెట్టాడు. ఇందుకు ధోనీ నిరాకరించాడు. అయినా, మాట్లాడాల్సిందేనంటూ చాహల్ బలవంతం చేయబోవడంతో, సరదాకో, సీరియస్‌గానో తెలియదు గానీ.. ధోనీ అక్కడి నుంచి తప్పించుకొని డ్రెస్సింగ్ రూమ్‌పైపు పరిగెత్తుకుంటూ వెళ్లిపోయాడు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డబుల్ సెంచరీ

- శ్రీలంక క్రికెటర్ అరుదైన రికార్డు



ఏంజెలో పెరీరా

కొలంబో: శ్రీలంక క్రికెటర్ ఏంజెలో పెరీరా ఒకే మ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలు సాధించి అరుదైన రికార్డు నెలకొల్పాడు. లంక దేశవాళీ క్రికెట్‌లో భాగంగా సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో నాండేస్క్రిప్స్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు కెప్టెన్ ఏంజెలో పెరీరా తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 231 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో 1938లో ఇంగ్లిష్ క్రికెటర్ ఆర్థర్ ఫాగ్ తర్వాత ఒకే మ్యాచ్‌లో రెండు ద్విశతకాలు నమోదుచేసిన రెండో క్రికెటర్‌గా ఏంజెలో నిలిచాడు. 2013లో దక్షిణాఫ్రికాపై వన్డేతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 28 ఏళ్ల ఏంజెలో.. ఇప్పటిదాకా 4 వన్డేలు, 2 టీ20 ఆడాడు.

ఈసారి మనోళ్లు పట్టేస్తారు!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సూపర్ ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లలో ఒకరు ఈసారి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచే అవకాశాలున్నాయని చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ధీమా వ్యక్తం చేశాడు. 'ఈ ఏడాది మనకు ఆల్ ఇంగ్లండ్ టైటిల్ వస్తుందనుకుంటున్నా. సైనా, సింధు, శ్రీకాంత్‌లలో ఒకరి నుంచి కచ్చితంగా ఆ మెగా టైటిల్‌ను ఆశిస్తున్నా. ఇటీవలే సైనా ఇండోనేసియా ఓపెన్ గెలిచింది. సింధు, శ్రీకాంత్ కూడా అద్భుతంగా ఆడుతున్నారు' అని గోపీ చెప్పుకొచ్చాడు.

గోపీ అకాడమీకి కోటక్ సహకారం: గోపీచంద్ అకాడమీకి సహకారం అందించేందుకు కోటక్ మహీంద్ర బ్యాంక్ ముందుకొచ్చింది. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో అధునాతన సౌకర్యాలతో కూడిన ఆరు ఎయిర్ కండీషన్ కోర్టులు, స్పోర్ట్స్ సైన్స్ పార్క్ నిర్మించేందుకు కోటక్ మహీంద్ర బ్యాంక్ సిద్ధమైంది. ఇందులో భాగంగా సోమవారం గోపీచంద్ అకాడమీతో ఒప్పందం కుదుర్చుకొంది.

ఆసీస్ క్లీన్‌స్వీప్



రెండో టెస్ట్‌లో కంగారూల గెలుపు ● 2-0తో సిరీస్ కైవసం

కాన్‌బెర్రా: సొంతగడ్డపై శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి, రెండో టెస్ట్‌లో కంగారూలు 366 పరుగులతో లంకపై ఘన విజయం సాధించి.. 2-0తో సిరీస్ కైవసం చేసుకున్నారు. మిచెల్ స్టార్క్ (5/46) దెబ్బకు.. 516 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో లంక 149 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 17/0తో నాలుగో రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు మరో 132 రన్స్ మాత్రమే జోడించి ఆలౌటైంది. కుశాల్ మెండిస్ (42), లాహిరు తిరిమన్నె (30) టాప్ స్కోరర్లు. కమిన్స్ 3 వికెట్లు పడగొట్టగా..రిచర్డ్‌సన్, మర్నస్ లబూషెనేకు చెరో వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 534/5 (డిక్లేర్డ్), లంక 215 స్కోర్లు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌ను ఆతిథ్య జట్టు 196/3 వద్ద డిక్లేర్ చేసింది.

విదర్భ 312

- సౌరాష్ట్రతో రంజీ ఫైనల్



స్నెల్ పటేల్ (87 బ్యాటింగ్)

నాగపూర్: బౌలర్ల హవా కొనసాగుతుండడంతో సౌరాష్ట్రతో విదర్భ రంజీ ఫైనల్ రసవత్తరంగా సాగుతోంది. 200/7తో రెండో రోజు ఆటను ఆరంభించిన విదర్భ.. తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులకు ఆలౌటైంది. అక్షయ్ కర్నేవార్ (73 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో రాణించడంతో ఓవర్‌నైట్ స్కోరుకు మరో 112 పరుగులు జత చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర.. ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఒంటరి పోరాటం చేస్తున్న స్నెల్ పటేల్ (87 బ్యాటింగ్)తోపాటు ప్రేరక్ మన్కడ్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పిచ్ నుంచి లభిస్తున్న సహకారాన్ని అద్భుతంగా వినియోగించుకున్న సర్వాటే (3/55), అక్షయ్ వాఖరే (2/42).. సౌరాష్ట్ర టాపార్డర్ పనిబట్టారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సౌరాష్ట్ర ఇంకా 154 పరుగుల వెనుకంజలో ఉంది.

సెమీస్‌కు తెలంగాణ



ఖమ్మం (స్పోర్ట్స్): జాతీయస్థాయి సీనియర్ మహిళల టీ20 చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 38 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది. మరో మ్యాచ్‌లో కర్ణాటక జట్టు మూడు పరుగుల తేడాతో రాజస్థాన్‌పై గెలుపొంది సెమీఫైనల్ చేరింది.

ఆర్చరీ సంఘానికి దక్కని గుర్తింపు

న్యూఢిల్లీ: క్రీడా మంత్రిత్వశాఖ గుర్తింపు సాధించడంలో ఆర్చరీ అసోసియేషన్ విఫలమైంది. వార్షిక రెన్యువల్‌లో భాగంగా మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన క్రీడా సమాఖ్యల జాబితాలో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు చోటు దక్కలేదు. కొత్త రాజ్యాంగం ప్రకారం ఏఏఐకు తాజాగా ఎన్నికలు నిర్వహించారు. గత డిసెంబరు చివర్లో హైకోర్టు నియమించిన అధికారి పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో ఏఏఐ అధ్యక్షుడిగా బీవీ పాపారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను వరల్డ్ ఆర్చరీ గుర్తించేందుకు తొలుత నిరాకరించినా.. ఆ తర్వాత ఆమోదించింది. కానీ, భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) గుర్తింపు ఇంకా రాలేదు. కోర్టుకు సమర్పించిన కొన్ని క్లాజ్‌లు జాతీయ క్రీడా కోడ్‌కు అనుగుణంగా లేవని క్రీడాశాఖ, ఐవోఏ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఆర్చరీతోపాటు గోల్ఫ్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో సంఘాలకు కూడా గుర్తింపు లభించలేదు.

హోల్డర్‌పై మ్యాచ్ నిషేధం



దుబాయ్: వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్‌పై ఐసీసీ ఓ టెస్ట్ మ్యాచ్ నిషేధం విధించింది. గతవారం ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో విండీస్ స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది. నిర్ణీత సమయంలో హోల్డర్‌సేన 2 ఓవర్లు తక్కువగా వేసింది. గత జూన్‌లో శ్రీలంకతో మూడో టెస్ట్‌లోనూ కరీబియన్ జట్టు ఈ తప్పిదం చేసింది. దీంతో 12 నెలల వ్యవధిలో రెండుసార్లు నిబంధనలు ఉల్లంఘించినందుకు కెప్టెన్ హోల్డర్‌పై వేటు పడింది. అతని మ్యాచ్ ఫీజులో 40, మిగతా జట్టు సభ్యులకు 20 శాతం జరిమానాగా విధించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న ఇంగ్లండ్‌తో ప్రారంభంకానున్న ఆఖరిదైన మూడో టెస్ట్‌కు హోల్డర్ దూరం కానున్నాడు. ఇప్పటికే ఈ సిరీస్‌ను ఆతిథ్య జట్టు 2-0తో కైవసం చేసుకుంది.

నెట్‌లో జర భద్రం!



నేడు 'సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం'

అపరిమిత డేటా ఆఫర్లు వచ్చాక.. మొబైల్ ఇంటర్నెట్‌ను వాడకం పెరిగింది. అయితే.. గుర్తింపు, భద్రత లేని యాప్స్ ద్వారా మొబైల్ యూజర్ల డేటా లీక్ అవుతోంది. అలాంటి 29 యాప్స్‌ను గుర్తించిన గూగుల్.. సోమవారం వాటిని ప్లేస్టోర్ నుంచి తొలగించింది. మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో నిపుణులు ఏమంటున్నారంటే.. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, మెయిల్స్, సోషల్ మీడియాలకు ఒకే పాస్‌వర్డ్‌ను వాడొద్దు. మొబైల్ బ్యాంకింగ్ యాప్స్ వాడే ఫోన్‌లో.. గేమ్స్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవడం మంచిది.

● వరాహ నామ సంవత్సరే..

నేడు చైనీయుల ఉగాది



మన ఉగాదిలాగా చైనా వాళ్లకి మంగళవారం సంవత్సరాది. ప్రభవ, విభవ.. ఇలా మనకు తెలుగు సంవత్సరాలు 60 ఉంటే చైనీయులకు పన్నెండే ఉం టాయి. వాటిలో ఆఖరుది వరాహనామ సంవత్సరం. చైనా గాథల ప్రకారం.. పంది సంపదకు గుర్తు. దీంతో చైనాలో సందడి నెలకొంది.

● క్యారెట్ నుంచి జీవ అనుకూల లేజర్

ఐఐటీ-మద్రాస్ ఘనత



చెన్నై, ఫిబ్రవరి 4: ఘన, ద్రవ, వాయు మాధ్యమం నుంచి కాంతిని ప్రసరింపజేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందని నోబెల్ గ్రహీత సీవీ రామన్ చెప్పారు. ఇప్పుడిదే ప్రక్రియ ఆధారంగా క్యారెట్ నుంచి జీవ అనుకూల లేజర్‌ను ఉత్పత్తి చేయొచ్చని ఐఐటీ-మద్రాస్ పరిశోధకులు వెల్లడించారు. ఈ తరహా పరిశోధన ప్రపంచంలోనే మొదటిదని, ఆప్టికల్ స్పెక్ట్రోస్కోపీలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ విజయన్ నేతృత్వంలో ఈ పరిశోధనలు చేశారు.



● అబూధాబీలో పోప్‌కు ఘన స్వాగతం

పోప్ ఫ్రాన్సిస్ యూఏఈ చారిత్రక పర్యటనలో భాగంగా సోమవారం అబూధాబి చేరుకున్నారు. అబూధాబి రాజప్రాసాదంలో ఆయనకు సంప్రదాయరీతిలో సైనిక లాంఛనాలతో స్వాగతం పలికారు.


కుంభమేళాలో 5 కోట్ల మంది

ప్రపంచంలోనే ఎంతో ప్రాముఖ్యత గల కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు జన ప్రవాహం పోటెత్తింది. పరవళ్లు తొక్కుతూ ప్రవహించే గంగతో పోటీ పడుతూ ఉరకలెత్తింది. కనీవినీ ఎరుగని రీతిలో తరలి వచ్చిన జనతరంగాలతో గంగ, యమున, సరస్వతి నదీ సంగమం కిక్కిరిసిపోయింది. 'హరహర గంగ' నినాదాలతో హోరెత్తిపోయింది. హిందువులకు పవిత్రమైన మౌని అమావాస్య రోజున సుమారు 5 కోట్ల మంది పవిత్ర స్నానాలు ఆచరించారు. పంచాయతీ అఖాడా మహానిర్వానీ, పంచాయతీ అఖాడా అటల్, పంచాయతీ నిరంజనీ అఖాడా, తపోనిధి పంచాయతీ ఆనంద్ అఖాడాతో పాటు ఇతర అఖారాలకు చెందిన సాధువులు భారీగా తరలివచ్చారు. -ప్రయాగ్‌రాజ్



కుటుంబాన్నే చూడనివారు.. దేశాన్నేం కాపాడతారు?

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు
- బీజేపీలో దమ్మున్న నేత గడ్కరీనే: రాహుల్
- నాకు రాహుల్ సర్టిఫికెట్ అక్కర్లేదు: గడ్కరీ



నాగపూర్, ఫిబ్రవరి 4: "పార్టీ కార్యకర్తలు ముందు తమ కుటుంబానికి సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించాలి. అలా చేయనివారు.. దేశానికి సేవ చేయలేరు"..మోదీ, అమిత్‌షా నాయకత్వంపై తరచూ పరోక్ష విమర్శలు చేసే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల నాగపూర్‌లో చేసిన వ్యాఖ్యలివి. బీజేపీ విద్యార్థి విభాగం 'అఖిల భారతీయ విద్యార్థి పరిషత్' మాజీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "తమ జీవితాలను దేశానికి, పార్టీకి అంకితం చేయాలని కోరుకుంటున్నట్టు చెప్పే చాలా మందిని నేను కలిశాను. అయితే, వారిలో చాలామంది తమకు కుటుంబాలున్నాయని, తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని కూడా చెప్పారు. అలాంటివారందరికీ నేను చెప్పేదేంటంటే.. ముందు కుటుంబం గురించి, కుటుంబసభ్యుల గురించి జాగ్రత్త తీసుకోండి. కుటుంబాన్నే సరిగ్గా నిర్వహించలేనివారు దేశాన్నేం కాపాడతారు" అని గడ్కరీ వ్యాఖ్యానించారు. కాగా.. గడ్కరీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. "గడ్కరీజీ.. మీకు ప్రశంసలు. బీజేపీలో దమ్మున్న నాయకుడు మీర్కొరే. దయచేసి ఇలాగే రాఫెల్ కుంభకోణంపైన, అనిల్ అంబానీపైన, రైతుల దుస్థితిపైన, వ్యవస్థల విధ్వంసంపైన కూడా మాట్లాడండి" అని ట్వీట్ చేశారు. అయితే రాహుల్ ట్వీట్‌పై గడ్కరీ ఘాటుగా స్పందించారు. "రాహుల్‌గాంధీజీ.. నా ధైర్యం గురించి మీ సర్టిఫికెట్ అక్కర్లేదు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడైన తర్వాత కూడా.. మీరిలా మా ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీడియా వక్రీకరించిన వార్తల సాయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది" అని గడ్కరీ ట్వీట్ చేశారు.

బ్యాలట్ పత్రాలే నయం

- ఈసీకి 21 పార్టీల వినతిపత్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలపై అనుమానాలు దేశ ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని 21 పార్టీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. మళ్లీ బ్యాలట్ పత్రాలు ప్రవేశపెట్టడమే సరైన మార్గమని, ఇప్పుడు తగిన సమయం లేనందువల్ల కనీసం 50 శాతం వీవీపాట్‌లను లెక్కించాలని డిమాండ్ చేశాయి. ఈవీఎం ఓట్లకూ, వీవీపాట్ ఓట్లకూ తేడా ఉంటే వీవీపాట్‌నే పరిగణనలోకి తీసుకోవాలని సూచించాయి. కేవలం 2.5 శాతం వీవీపాట్‌లను లెక్కించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించాయి. దేశంలో 70 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరాయి. తెలుగుదేశం అధినేత చంద్రబాబు, గులాంనబీ ఆజాద్ (కాంగ్రెస్), రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), సతీశ్‌చంద్ర మిశ్రా (బీఎస్పీ), రాజా(సీపీఐ) తదితరులు ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా, కమిషనర్ లావాసాలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చాలా చోట్ల పోలయిన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ తేడాలు కనిపించాయని తెలిపారు. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయిస్తామని చెప్పిందని చంద్రబాబు మీడియాకు తెలిపారు. వినతిపత్రంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, చంద్రబాబు సహా 21 పార్టీల నేతలు సంతకాలు చేశారు.

విదేశీ పౌరసత్వం ఉన్నా చోక్సీ భారతీయుడే:సర్కార్



జార్జిటౌన్, ఫిబ్రవరి4: పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన మెహుల్ చోక్సీకి యాంటిగ్వా పౌరసత్వం లభించినప్పటికీ ఆయనింకా భారతీయ పౌరుడేనని భారత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గయానాలోని భారత హైకమిషనర్ వి.మహాలింగం దీనిపై మాట్లాడుతూ... విచారణ నిమిత్తం చోక్సీని భారత్‌కు రప్పించే ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. "ఆయనింకా భారత పౌరసత్వాన్ని వదులుకోలేదు. చోక్సీ పాస్‌పోర్టును భారత్ రద్దు చేసింది. అంతమాత్రాన ఆయన పౌరసత్వాన్ని రద్దు చేసినట్లుగా భావించరాదు" అని మహాలింగం స్పష్టం చేశారు.

విజయ్ మాల్యా అప్పగింత!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అయితే అప్పగింతకు ముందు ఆఖరిసారిగా తన వాదన వినిపించుకొనేందుకు గాను అప్పీలు చేయడానికి ఆయనకు అవకాశమిచ్చారు. రెండు వారాల్లోగా ఆయన తన అప్పీలును హైకోర్టులో దాఖలు చేయాలి. ఒకవేళ అందులోనూ ప్రతికూలంగా తీర్పు వస్తే ఆయన బ్రిటన్ సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చు. ఈ ప్రక్రియ అంతా ముగియడానికి మరో ఏడెనిమిది నెలలు పట్టవచ్చని న్యాయనిపుణులు అంటున్నారు. మాల్యా ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్నారన్న ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని అంటూ భారత్‌కు ఆయనను అప్పగించే విషయం పరిశీలించాలని కోరుతూ వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు డిసెంబరు 10న తీర్పునిచ్చింది. మాల్యాకు ఆ తీర్పు పెద్ద దెబ్బ. సాధారణంగా బ్రిటన్‌లో కోర్టుల ఆదేశాలకు ప్రభుత్వాలకు మోకాలడ్డవు. మాల్యా మోసాలకు పాల్పడ్డారన్న అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించి హోంశాఖ మంత్రి ఆ సంతకం చేశారు. బ్రిటన్ హోంశాఖ క్లియరెన్స్‌ను భారత్ స్వాగతించింది. సాధ్యమైనంత తొందరగా బ్రిటన్‌లో న్యాయ ప్రక్రియ పూర్తయి భారత్ కోరిన విధంగా మాల్యాను అప్పగిస్తారన్న ఆశాభావాన్ని విదేశాంగ శాఖ వ్యక్తీకరించింది. మాల్యా అప్పగింత వ్యవహారంలో మరో మెట్టును కేంద్రం అధిగమించగలిగిందని అమెరికాలో చికిత్స పొందుతున్న ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. "మాల్యాను రప్పించేపనిలో మోదీ సర్కారు నిమగ్నమైంది. విపక్షాలు మాత్రం శారదా స్కాం నిందితులకు సంఘీభావం పలుకుతున్నాయి" అని హేళన చేశారు.

విపక్షాలపై సీబీఐ, ఈడీ ఉస్కో.. ఉస్కో!

- యూపీఏ పక్షాల అగ్రనేతలే టార్గెట్
- పాత కేసుల్ని తవ్వితీస్తున్న దర్యాప్తు సంస్థలు
- దర్యాప్తు వేగం ఆకస్మికంగా పెరగడంపై అనుమానాలు
- కేసుల కదలికల్లో రాజకీయ ప్రయోజనాలే కీలకం
- లొంగదీసుకోవాలన్నది మోదీ-షా యత్నమన్న నేతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బెంగాల్లో కేసుల మాటున మమతా బెనర్జీకి, ప్రధాని నరేంద్ర మోదీకి సాగుతున్న యుద్ధం సార్వత్రిక ఎన్నికల వేడిని ప్రస్ఫుటిస్తోంది. ఒక్క మమతపై మాత్రమే కాదు, ఒకరిద్దరు అస్మదీయులు మినహాయిస్తే మిగతా విపక్ష నాయకులందరిపైనా ఇపుడు సీబీఐ, ఈడీ కేసులు ఒక్కపెట్టున ఇపుడు విచారణ ఊపందుకుంటున్నాయి. సోనియా నుంచి మమత దాకా- ఫరూక్ అబ్దుల్లా నుంచి చంద్రబాబునాయుడి దాకా ఇలా అందరి వెంటా సీబీఐ. ఈడీ పడుతున్నాయి. వారిని లేదా వారి సన్నిహితుల్ని పిలిపించడం, గంటల తరబడి కూర్చోబెట్టి ప్రశ్నించడం సర్వసాధారణమైపోయింది. "కేసుల దర్యాప్తును ఎవరూ కాదనరు. కానీ ఈ టైమింగ్, వేగం ఇందులోని రాజకీయ కోణాల్ని బయటపెడుతున్నాయి. కేసులు తవ్వి, కొత్త సెక్షన్లు బనాయించి, వాటిపై ఇంటరాగేట్ చేస్తుండడం మోదీ సర్కారు ఉద్దేశపూర్వకంగా ఇది చేస్తోందా.. అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఎన్నికలకు ముందు కేసులతో భయపెట్టి, వారిని మానసికంగా కుంగదీయడం లేదా లొంగదీసుకోవడం..ఈ కేసుల క్యాంపెయిన్ వెనుక లక్ష్యంగా కనిపస్తోంది" అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





పేరు:	మాయావతి
హోదా:	అధ్యక్షురాలు, బహుజన్ సమాజ్ పార్టీ, యూపీ మాజీ సీఎం
కేసు:	రూ 1400 కోట్ల స్మారకస్థూపాల కేసు, 4900 కోట్ల జాతీయగ్రామీణ ఆరోగ్య మిషన్ నిధుల స్వాహా కేసు (2007లో ఆమె సీఎంగా ఉన్నప్పటి కేసులు)
నమోదు:	మే 2016
ప్రస్తుత స్థితి:	యూపీ అంతటా 11 చోట్ల ఈడీ దాడులు- మాయావతి హయాంలో పనిచేసిన ఇద్దరు మంత్రుల అరెస్టు



పేరు:	మమతా బెనర్జీ
హోదా:	పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్
కేసు:	రూ 2500 కోట్ల శారదా చిట్‌ఫండ్ కేసు, పెయింటింగ్స్‌ను ఎక్కువ ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలు,,, జాగో బంగ్లా డిపాజిట్ల కేసు
నమోదు:	2013
ప్రస్తుత స్థితి:	తృణమూల్ నేతలపై, మమత అనుచరులపై సీబీఐ దాడులు, ఇంటరాగేషన్, కేంద్రంతో మమత ఢీ



పేరు:	అరవింద్ కేజ్రీవాల్
హోదా:	అధ్యక్షుడు, ఆమ్ ఆద్మీ పార్టీ, ఢిల్లీ సీఎం
కేసు:	అవినీతి, చీఫ్ సెక్రటరీపై ఆప్ మంత్రుల దాడి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌తో అధికారాల పంపకంపై కేసులు
నమోదు:	2016, 17, 2018
ప్రస్తుత స్థితి:	రెండు అవినీతి కేసుల్లో క్లీన్‌చిట్, కొందరు మంత్రుల అవినీతిపై కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు, కొనసాగుతున్న చీఫ్ సెక్రటరీ కేసు, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా తనను పనిచేయనివ్వకుండా చేస్తున్నారని, పాలన స్తంభించిపోయిందని జనవరి 24న సుప్రీంలో కేజ్రీవాల్ ఫిర్యాదు



పేరు:	పినరయి విజయన్
హోదా:	కేరళ సీఎం, సీపీఎం సీనియర్ నేత
కేసు:	లవలీన్ జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు కేసు
నమోదు:	2006
ప్రస్తుత స్థితి:	పినరయి విజయన్‌ను ప్రశ్నించేందుకు సుప్రీం అనుమతిని కోరిన సీబీఐ, విచారణ వాయిదా, బహుశా ఈ నెలలోనే కేసు మళ్లీ విచారణ



పేరు:	ఎన్ చంద్రబాబునాయుడు
హోదా:	టీడీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం
కేసు:	ఓటుకు నోటు కేసు, బాబ్లీ ప్రాజెక్టుపై దీక్ష కేసు
నమోదు:	2015, 2010లో బాబ్లీ కేసుపై 2018లో అరెస్ట్ వారెంటు
ప్రస్తుత స్థితి:	ఈ నెలలోనే ఓటుకు నోటుపై సుప్రీం విచారణ జరిగే అవకాశం

(వీటితో పాటు జగన్‌పై కోడికత్తి దాడి కేసును జాతీయ పరిశోధన సంస్థ-ఎన్ఐఏకు అప్పగింతమొదలైన వాటితో కేంద్రం ఇరకాటపెట్టే యత్నం)






పేరు:	కనిమొళి, ఎ రాజా
హోదా:	రాజ్యసభ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి. డీఎంకే నేతలు
కేసు:	2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల స్కాం
ఎప్పుడు నమోదు:	2018 మార్చి, 2017లో నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో అప్పీలు
ప్రస్తుత స్థితి:	ఫిబ్రవరి 7న విచారణ

మోదీ- షా కేసులు మాత్రం పెండింగ్



అన్ని కేసులనూ తవ్వుతూ, శరవేగంగా దాడులు చేస్తున్న సీబీఐ, ఈడీలు ప్రధాని నరేంద్ర మోదీపైనా, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా అనేక రాష్ట్రాల బీజేపీ సీఎంలు, మాజీ సీఎంలు, ఇతర ప్రముఖ నేతలపై ఉన్న కేసులను మాత్రం పెండింగ్‌లో పెడుతోంది. అలాగే అధికార పార్టీకి సన్నిహితంగా మసలుతున్న పార్టీల నాయకుల కేసులూ తిరగతోడడం లేదు. గుజరాత్ అల్లర్ల విషయంలో నరేంద్ర మోదీకి ఆనాడు సిట్ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ ఎహ్‌సాన్ జాఫ్రి భార్య జకియా జాఫ్రీ ఈ మధ్యే సుప్రీంకోర్టులో కేసు వేశారు. దానిపై కోర్టులో విచారణ సాగుతోంది. దీనిపై తాజాగా సీబీఐ దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ సహా అన్ని విపక్షాలూ కేంద్రాన్ని కోరాయి, సీబీఐని కూడా కోరాయి. అలాగే అమిత్ షాపై ఎన్నో ఏళ్ల తరబడి సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు సాగింది. ఆ కేసును ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ బనాయించినట్లు చివరకు తీర్పు వెలువడింది. నిందితులందరూ నిర్దోషులంటూ కోర్టు విడిచిపెట్టేయడం సంచలనం రేపింది. ఇక నోట్ల రద్దు సమయంలో -అమిత్ షా డైరెక్టర్‌గా ఉన్న అహ్మదాబాద్ సహకార బ్యాంకు నుంచి భారీగా నగదు మార్పిడి జరగడంపై కూడా వివాదాస్పదమై సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేసే దాకా వెళ్లింది. కానీ ఆయన వైపు సీబీఐ దృష్టిసారించలేదు.





పేరు:	తేజస్వీ యాదవ్, రాబ్డీదేవి
హోదా:	ఆర్జేడీ చీఫ్, బిహార్ మాజీ సీఎం
కేసులు:	ఐఆర్‌సీటీసీ స్కాం..
నమోదు:	2017 మార్చి
ప్రస్తుత స్థితి:	2సార్లు ఇద్దరి ఇంటరాగేషన్, కొనసాగుతున్న విచారణ మాజీ సీఎం లాలూ ప్రస్తుతం దాణా స్కాంలో జైలుశిక్ష అనుభవిస్తున్నారు.

ఇతర ప్రముఖులు- కేసులు

భూపిందర్ హుడా: హర్యానా మాజీ సీఎం భూ కేటాయింపుల్లో అవినీతి
వీరభద్రసింగ్: హిమాచల్ మాజీ ముఖ్యమంత్రి అక్రమార్జన కేసులో నిందితుడు
ఆస్కార్ ఫెర్నాండెజ్, మోతీలాల్ వోరా, శామ్ పిట్రోడా: కాంగ్రెస్ నేతలు, నేషనల్ హెరాల్డ్ కేసు
డీకే శివకుమార్: కర్ణాటక కాంగ్రెస్ నేత-మనీలాండరింగ్ కేసు
ఛగన్ భుజ్‌బల్: ఎన్సీపీ నేత- మనీలాండరింగ్ కేసులో రెండేళ్ల జైలు తర్వాత 5 నెలల కిందట బెయిల్
సుజనా చౌదరి: టీడీపీ నేత, మాజీ కేంద్ర మంత్రి, రూ 5700 కోట్ల బ్యాంకుల మోసం కేసులో రెండునెలల కిందట ఈడీ దాడులు
అశోక్ గెహ్లాట్- సచిన్ పైలట్: రాజస్థాన్ సీఎం, డిప్యూటీ సీఎం- అంబులెన్సుల కుంభకోణం






పేర్లు:	సోనియాగాంధీ, రాహుల్ గాంధీ
హోదా:	యూపీఏ ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ అధ్యక్షుడు
కేసు:	నేషనల్ హెరాల్డ్ కేసు- అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు చెందిన 5000 కోట్ల విలువైన ఆస్తులను రూ 50 లక్షలు మాత్రమే చెల్లించి తీసుకున్నట్లు ఆరోపణ. ఇందుకోసం యంగ్ ఇండియా అనే సంస్థను ఏర్పాటు చేసి రాహుల్, సోనియా 76 శాతం వాటా పొందారు
నమోదు:	2012 నవంబరు1న.... బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి వేశారు..
ప్రస్తుత స్థితి:	కేసు విచారణలో భాగంగా ఇపుడు సోనియా- రాహుల్ తరఫు లాయర్లు ఫిబ్రవరి 4 నుంచి స్వామిని క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నారు.




పేరు :	అఖిలేశ్ యాదవ్
హోదా:	ఎస్పీ చీఫ్, యూపీ మాజీ సీఎం
కేసు:	అక్రమ మైనింగ్ లీజులు, మనీ లాండరింగ్, జవహర్‌బాఘ్ స్వాధీన్ భారత్ కార్యకర్తలపై పోలీసు జులుం కేసులు
నమోదు:	జనవరి 5, 19
ప్రస్తుత స్థితి:	బ్యూరోక్రాట్లు, సమాజ్‌వాదీ పార్టీ నేతల వాంగ్మూలాల్ని రికార్డు చేస్తున్న సీబీఐ



పేరు:	ఫరూక్ అబ్దుల్లా
హోదా:	నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత, జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం
కేసు:	213 కోట్ల జమ్మూ కశ్మీర్ క్రికెట్ సంఘం నిధుల కైంకర్యం కేసు
నమోదు:	2015 జూన్
ప్రస్తుత స్థితి:	కొద్ది రోజుల్లో అధికారుల విచారణ



పేరు:	పి. చిదంబరం
హోదా:	కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత
కేసు:	ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు
నమోదు:	---
ప్రస్తుత స్థితి:	త్వరలో అరెస్ట్ చేసే అవకాశం



పేరు:	కుమారస్వామి
హోదా:	కర్ణాటక సీఎం, జేడీఎస్ నేత
కేసు:	జంతకల్ కంపెనీకి మైనింగ్‌లీజులు,భూకేటాయింపుల కేసు
నమోదు:	---
ప్రస్తుత స్థితి:	పెండింగ్‌లో.. తిరిగి తెరిచే యోచనలో సీబీఐ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.